UNIVERSAL LIBRARY
OU_204716
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T 82 877 M Accession No. T 4083

Author [illegible]

Title [illegible] 1956

This book should be returned on or before the date last marked below.

# మరో ప్రపంచం

(రేడియో నాటికలు)

E8047

మహాకవి

శ్రీ శ్రీ

సారథీ పబ్లికేషన్స్

సికింద్రాబాద్

ప్రచురణ : 1 ప్రతులు : 100

జూలై '54

Printed and Published by A .Seetharamaiah
at Poineer Press Secundrabad.

శ్రీ శ్రీ

# మరో ప్రపంచం

★

రు 2/

ఇందులో :-

* మరోప్రపంచం
* గవేషణ
* అనంతరయాత్రి
* సుప్తాస్థికలు
* విదూషకుడి ఆత్మహత్య
* గ్రామఫోనురికార్డుల తిరుగుబాటు
* గుమాస్తాకల
* జడభరతుడు
* ఒంటరిబావి
* భూతాలకొలిమి
* బలి ( వామనమూర్త్యావిర్భావఘట్టం - పోతనామాత్యుని కృతజ్ఞతతో )

# మరో ప్రపంచం

## ప్రకటన

ఈ నాటకం ఒక యువకవి మెదడులో, అందలి సుప్త చైతన్యాంగంలో జరుగుతుంది. దీనిలో యువతీ యువకుల గొంతుకలూ, వృద్ధకంఠాలూ, ఇరవై ఒకటవ శతాబ్దపు మానవుని గొంతుకా పాల్గొంటాయి.

యువతీయువకుల బృందగానం:—

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది,
పదండి ముందుకు,
పదండి తోసుకు
పోదాం, పోదాం పైపైకి
కదం తొక్కుతూ.
పదం పాడుతూ,
హృదంతరాళం గర్జిస్తూ
పదండిపోదాం
వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం?

1వ గొంతుక:_ఇదంతా ఏదో కలలా వుంది.

2వ గొంతుక: ఇదంతా ఏమిటో చీకటిగా వుంది.

1వ ,, : కాదు ఎంతో వెలుగ్గా వుంది.

2వ ,, : అంతా ఏమిటో కలలాగ మాత్రం-

1వ ,, : లేదు. కలలే నిజమవుతాయి.

3వ ,, : ఎవరో వస్తున్నారు.

2వ ,, : ఏదీ నాకేం కనబడలేదు.

1వ ,, : అదుగో అటుచూడు దూరంగా.

2వ ,, : ఏమిటో నాకంతా అగమ్యగోచరంగావుంది.

1వ ,, : చూడు. దూరంలో, మబ్బులాంటి పొగ మంచులాంటి పుష్పొడి దుమారంలాంటి దూరంలో_

2వ గొంతుక: అదేంకాదు. అదంతా ఒక గందరగోళం.

3వ ,, : ఆ గజిబిజిలోంచే ఎవరోవస్తున్నారు.

2వ ,, : ఏదో వస్తున్నాది.

3వ ,, : దాన్ని వర్ణించు.

2వ ,, : టెన్నిస్ బంతిలాగుంది.

1వ ,, : ఆకుపచ్చని బంతి

3వ ,, : ఆకుపచ్చని గాజు బంతి.

1వ ,, : అదంతా ఒక పెద్ద కన్నులాగుంది.

2వ ,, : కాదు. అంతా ఒక చెవి.

1వ ,, . అదే దానినోరులాగకూడా అగపడుతోంది

2వ ,, : అదేదాని_

3వ ,, : చాలించు దగ్గర పడుతున్నాడు.

1వ గొంతుక: ఏదో మాట్లాడబోతున్నాడు.

2వ ,, : ఒళ్ళంతా ఒకేకన్ను చేసుకొని దీక్షగా చూస్తున్నాడు.

1వ గొంతుక: ఎవరునువ్వు కనుపాపా?

కనుపాప: (లోహకంఠం- తెలివైన కుర్రాడు టెలిఫోన్ లో మాట్లాడినట్లు)- నేను ఇరవైఒకటవ శతాబ్దపు మనిషిని.

2వ గొంతుక: మనిషి. ఆకుపచ్చని గాజుబంతి. కనుపాప?

1వ గొంతుక: ఇది కలా, నిజమా?

2వ గొంతుక: నిజంగానువ్వు మనిషివేనా?

కనుపాప: మనిషినే. నిజమే. కాని ఏదో పెద్ద పొరపాటు జరిగింది. ఇప్పుడు నేనెక్కడున్నాను?

1వ గొంతుక: ఇది ఆలిండియారేడియో, మద్రాసు కేంద్రం.

కనుపాప: ఊహుఁ ఇది ఎవరిదో మెదడులాగుంది.

2వ గొంతుక: దేవాంతకుడు.

1వ ,, ఎలా తెలుసు కున్నాడో?

కనుపాప: ఔను. ఇది రేడియో స్టూడియోకూడా. ఫోకస్ తగ్గించి చూస్తే కనిపించింది.

1వ గొంతుక: నువ్వు మానవమాత్రుడివి కావు.

కనుపాప: నేను మానవుణ్ని నమ్మండి. నేను మనిషినే.

2వ గొంతుక: నిజంగా?

కనుపాప: నిజంగా. నిదర్శనంకావాలా? మానవుడన్నవాడు పొరపాటు చేస్తాడు. నేను పొరపాటు చేశాను. భవిష్యత్తులోకి ప్రయాణం చెయ్యబోయివా అంతర్యంత్రాలను అజాగ్రత్తగా

కదల్చడంవల్ల భూతకాలంలోకి వచ్చాను. ఇది ఇరవయ్యో శతాబ్దంలాగుందే.

1వ గొంతుక: ఔను.

కనుపాప: అందుకే ఇంత ఉక్కిరి బిక్కిరిగాఉంది. శీతోష్ణస్థితి మీా అధికారం కిందకిరాలేదని మేము చరిత్రలో తెలుసుకున్నాము. కాని ఇంత ఉక్కగా ఉంటుందనుకోలేదు. ఇక నేను పోతున్నాను.

1వ గొంతుక: వద్దు, వద్దు. కనుపాపా. పోవద్దు.

కనుపాప: లేదు. పోవాలి. కావలిస్తే మళ్ళీవస్తాను.

2వ గొంతుక: అబద్ధం.

కనుపాప: అదేదో కొత్తమాట నాకు అర్థంకాలేదు.

2వ గొంతుక: అయ్యో మీాకు అబద్ధాలు తెలియవ్వా?

కనుపాప: వేళ మించిపోతోంది. వెళ్ళొస్తాను.

1వ గొంతుక: త్వరలో రావాలి.

కనుపాప: తప్పకుండా. ఇప్పుడే ఇరవైఅయిదో శతాబ్దంలోకి వెళ్ళి వెంటనే వచ్చేస్తాను.

1వ గొంతుక: వెళ్ళిపోయాడు.

2వ " ఇదంతా నిజమా, కలా?

1వ " నిజం నిజం భవిష్యత్తు కనబడింది. మనకి భావిమానవుణ్ని చూశాంమనం. అతనితో మాట్లాడాం. విచిత్రంకాదూ. కలలు నిజమవుతాయికాదూ.

యువతీ యువకులు: భవిష్యత్తుకి స్వాగతం మానవుడికి స్వాగతం.

బృందగానం: మరో ప్రపంచం ... జలపాతం.

1వ వృద్ధకంఠం: మరో ప్రపంచం, మరేం పనిలేకపోతేసరి.

2వ వృ : ఏదీ, ఏదీ, ఆ మరో ప్రపంచం?

1వ వృ : ఎక్కడ?

2వ వృ : ఎప్పుడు?

1వ వృ : ఏమిటో ఆ ప్రపంచం? ఎలా వుంటుందో అది?

ఒక గద్గదకంఠం: జీవు లెనుబదినాల్గు లక్షలు
చావు పుట్టుక లిక్కడా
ఎవరు చేసిన పాపకర్మము
లనుభవించే దక్కడా......

అదీ మరీ ప్రపంచం.

ఒక వృద్ధ: మరో ప్రపంచం అంటే మరణం.

ఇంకో వృద్ధ: మహా ప్రస్థానం అంటే మరణం.

ఫేడ్ ఇన్...(పుట్టినబిడ్డ ఏడ్చినచప్పుడు)

ఒక యువకంఠం-స్త్రీ:—మరో ప్రపంచం అంటే జననం
సృష్టి! ఈలోకం ఇహలోకం ఇప్పుడే, ఇక్కడే.

బృందగానం:— దారిపొడుగునా గుండె నెత్తురులు
తర్పణచేస్తూ పదండి ముందుకు
బాటలు నడిచీ, పేటలు కడచీ
కోటలన్నిటిని దాటండి.
నదీ నదాలూ, అడవులు, కొండలు,
ఎడారులా మనకడ్డంకి?

(పై చరణం పాడుతున్నంతసేపూ, తర్గస్థాయిలో వినబను

తున్న శిశువు ఏడుపుపాట ఆగగానే స్థాయి హెచ్చుతుంది.)

ఒక యువకంఠం: అదే ప్రపంచభాష. భవిష్యత్తుపాట సార్వకాలిక సార్వస్థానికమైన మానవునిభాష.

2వ ,, :- భవిష్యత్తుకి స్వాగతం.

3వ ,, :- మరణంలేని మానవాత్మకి స్వాగతం.

గద్గద కంఠం:- ఏమిజన్మము, ఏమి జీవనము
ఈ మాయకాయము
ఏమి శాశ్వతమేమి—

(ఆ పాటను ఉప్పెనగా ముంచివేస్తూ)

బృందగానం:- పదండి ముందుకు
పదండి తోసుకు
పోదాం, పోదాం పైపైకి
ఎముకలు కుళ్ళిన వయస్సు మళ్ళిన
సోమరులారా, చావండి!
నెత్తురుమండే, శక్తులునిండే
సైనికులారా రారండి!
హరోం హరోం హర, హరహర, హరహర
హరోం హరా అని కదలండి!
మరో ప్రపంచం, మహా ప్రపంచం
ధరిత్రినిండా నిండింది.

గద్గద:- ఈరోజుల్లో ఇదోపిచ్చి. ఏమిటో వీళ్ళందరికీ ఈ వెర్రి భ్రమ.

ఎన్నాళ్ళు బతికినా ఏమి సామ్రాజ్యమే
కొన్నాళ్ళకో రామచిలుకా
మూన్నాళ్ళ ముచ్చటకే మురిసేవు తుళ్ళేవు
ముందుగతి కానవే చిలుకా.

1వ యువకకంఠం:- ఎవరీ మృత్యుదూత? ఏమిటా ఏదుపు కూత? మనుష్యులు మరణిస్తారు. మానవునికి మరణం లేదు.

2వ „ :- భవిష్యత్తుకి స్వాగతం.

3వ : :- మానవునికి స్వాగతం

బృందగానం:- పదండి ముందుకు
పదండి తోసుకు
ప్రభంజనం వలె హోరెత్తండి
భావవేగమున ప్రసరించండి,
వర్షుకాభ్రముల ప్రళయఘోషవలె
పెళ పెళ పెళ పెళ విరుచుకు పడండి
పదండి, పదండి, పదండి ముందుకు
కనపడలేదా మరో ప్రపంచపు
కణ కణ మండే త్రేతాగ్ని

గద్దద:- ఇంకా తగలెట్టండి ఇప్పటికే మండుతు పోతోంది కాలం. ఏమిటో ఆ మరో ప్రపంచం?

ఒక ఎగతాళి గొంతుక:- ఎలా వుంటుందో అది?

ఇంకొక ఎగతాళి గొంతుక:- ఎక్కడ దొరుకుతుందో?

1వ ఎగతాళి గొంతుక: ఏమిటీ చెప్మా దానికి దారి?

2వ ,, : వోట్లు ఇవ్వడమా?
3వ ,, : యోగాభ్యాసమా?
2వ ,, : పారిశ్రామికాభ్యుదయమా?

గద్గదకంఠం:— పరస్పర సంహారమా?

1వ ఎగతాళి గొంతుక:— భాషనుండి కొన్ని పదాలను శాశ్వతంగా తొలగించడంవల్ల కాబోలు.

3వ ఎగతాళి గొంతుక:— భూలోకంనుండి కొన్నిజాతులను పూర్తిగా తుడిచిపెట్టడంవల్ల కాబోలు.

2వ ఎగతాళి గొంతుక:— శబ్ద విస్తరణ యంత్రాలు పెట్టి ఏదో ఒక పతాకం పాతి, వేనవేల జనం ముందు ఘాటుగా ఉపన్యసిస్తే:—

ఉపన్యాసం:— సోదర సోదరీమణులారా, నేడు చాలా సుదినం. ఇంకొకచోటికి పోకుండా, ఇక్కడకే వచ్చినందుకు మిమ్మల్నీ, మిమ్మందర్నీ ఆకర్షించ గలిగినందుకు నన్నూ చాలా అభినందించుకొంటున్నాను. నూతన జీవితకాంతులు మీమీద ప్రసరించడం ప్రారంభమవుతోంది. నేను చూపించిన మార్గంలోనే మీరంతా నడవండి. కనుచూపు మేరలో అదిగో మన గమ్యస్థానం కనబడుతోంది. ఈమాట మీకు ఇరవైఏళ్ళ కిందట చెప్పాను. చూశారా, నేటికి నిజం ఋజువయింది. (కరతాళ ధ్వనులు)

2వ ఎగతాళి గొంతుక: ఇక్కడ భూలోక స్వర్గాలు విక్రయించబడును. వెంటనే కొనుక్కోండి. వెల స్వల్పం. ఫలమధికం.

2వ ఎగతాళి గొంతుక:- నకలు సరుకు చూసి మోసపో కండి. "మరో ప్రపంచం" మార్కు గుర్తించుకోండి. భవిష్యత్తును పొట్లాలుకట్టి పంచభాషల చీటీలతో సహా పంచిపెడుతున్నాము. ఎండకాలపు తగ్గింపు ధరలు.

యువకంఠం:- ఆహా, ఈ పెద్దమనుషులెవరో కాని తమ వెటకారంలోనే మాకొక గుణపాఠం బయలు పెడుతున్నారు. అమ్మడం, కొనడం తప్ప ఇంకో విధంగా వీళ్ళ మనస్సులు ఆలోచించనేలేవని స్పష్టం చేస్తున్నారు. రూపాయగానా పైసలు లేని లోకంలో వీరికూపిరి సలపదు. కాబోలు.

ఇంకొక:- ఔనుపాపం. నేటి జీవితపు ఉష్ణోగ్రతని కొలవడానికి థర్మామీటరు ధనం. ఈ లోకంలో అన్నీ అమ్ముడు పోతూనే ఉన్నాయి. చదువు, సౌందర్యం, కళ, సాహిత్యం, శాస్త్రం, శ్రమ-అన్నీ. ప్రయాణం, పెళ్లి, యుద్ధం- ఏది చెయ్యాలన్నా డబ్బే ప్రధానం.

మొదటి:- నీరయితే నిమ్నానికి ప్రవహిస్తుంది కాని, ధనం మాత్రం ఉన్నత క్షేత్రాలకి తప్ప ఇంకో చోటికి పారదు. ధనస్వాములవారి హయాంలో ప్రజలబాధల గుణకారం జరిగినంత జోరుగా బ్యాంకుల్లో అంకెలు పెరిగిపోతాయి. ఆవశ్యక వస్తువులు చీకట్లో అదృశ్యమవుతాయి. సంఘద్రోహులు ప్రజల బ్రతుకులను పణంగాపెట్టి జూదం సాగిస్తారు.

2వ యువ:- ఇదీ మన ప్రపంచం? ధనస్వామిని రక్షించడానికి న్యాయవాదుల శక్తియుక్తులూ, రాజకీయవాదుల వక్కా-

జిత్తులూ, విజ్ఞానవేత్తల తెలివితేటలూ, అన్ని వేళలా పారా ఇస్తాయి. ఈ లోకంనుంచి ఎగిరిపోయి శిరోవేష్టనం ధరించిన ఏ వైమానికుడూ దూరదర్శినీ యంత్రంతో విహాయసంనుంచి విహంగావలోకనం చేస్తూ, ప్రతిఒక్క చదరపుమైలుకీ సగటు సంఖ్యని ఎంతమంది నిర్భాగ్యులున్నారో ఎన్నడూ లెక్క కట్టబోడు.

3వ యువ:- ఇదీ మన ప్రపంచం! ప్రజలలో నిస్పృహ పరిపక్వమవుతున్నకొద్దీ, జీవితంమీద విరక్తి జనిస్తుంది. పిల్లల్ని పోషించలేని పెద్దమనిషి. పెళ్లాన్ని తిడతాడు, కొడతాడు. అనుదినం అనంతంగా ఒకే అభినయంచేసే ట్రాఫిక్ పోలీసు వాడు అమాంతంగా ఏకాంతంలోకిపోయి ఎవరితోనూ చెప్ప కుండా విషం తాగేస్తాడు. జీవితంలో నీరసం దారుణమవు తున్న కొద్దీ, మనుష్యులకి మతులు చెడిపోయి కాళ్లమీద నిల బడి కళ్లతో అరుస్తారు.

మొదటి యువ:- ఇదీ మన ప్రపంచం. విప్లవ పద్ధతులలో తరిబీయతిచ్చే విశ్వవిద్యాలయాలు లేకపోవడంవల్ల విద్యార్థులు పరీక్షాపత్రాలని ప్యాస్ మార్కుల ద్వీపానికి తీసుకుపోయే పడవలుగా మాత్రమే పరిగణిస్తారు. వాళ్ళ అధ్యాపకులుసహా, మధ్య తరగతుల మర్యాదలకు కట్టుబడి నిన్నటి అబద్ధాలనే నేడుకూడా సరఫరాచేస్తూ తలలోని తెలివీ, తలపైని వెంట్రు కలూ కోల్పోయి, ముప్ఫైఏళ్ళకే ముసలివాళ్ళయిపోతారు.

2వ యువ.- ఆ పాదమస్తకం రుజాగ్రస్తమైన ఈ ప్రపం చంలో సర్వవేళలా సమాజానికి అంతఃకరణాలుగా పనిచెయ్య

వలసిన కవులు సైతం, సామాజిక శరీరంలో బ్రహ్మరంధ్రం దాకా పర్యాప్తమయ్యే సుషుమ్నా నాడిగా స్పందించవలసిన కవులు కూడా స్తంభించిపోతారు. గంతలుకట్టిన గానుగెద్దు ల్లాగ లాగలేనంత బరువు భరించే ఛందస్సులచేత సర్కస్ ఫీట్లు చేయిస్తూ, అర్థాన్ని మొయ్యలేక అలిసిపోయినమాటలు చేసేమూక సంజ్ఞలకి మూర్ఛపోతారు.

3వ యువ:- ఇదీ మన ప్రపంచం. ఇక్కడ ఈ పరస్పర విద్వేషాగ్నుల మధ్య ముంచుకొచ్చే మృత్యువాంఛల నడుమ, నిరాశాంధకారాల నీడలకింద రకరకాల కుహనా ప్రవక్తలు బయలుదేరుతారు. జీవిత సంగ్రామంలో అన్ని రంగాలలోను పరాజయం పొందిన భ్రష్ట ప్రాణులంతా వీళ్ళచుట్టూ భజన చేసి పారలౌకిక మిథ్యా మాంసల్లోకి పలాయన మవుతారు. ఈ విశుష్క జీవుల ఐహిక సమస్యల్ని ఆముష్మికంగా భీమా చెయ్యడానికి భగవంతుని ఏజంట్లమంటూ ప్రచారం సాగించే పేరు పేరు వరసల దంభసన్యాసులు పెచ్చు పెరిగిపోతారు.

ఒక వృద్ధ:- చాలు ఇక చాలు. చాలించండి. మీ ధోరణి. అయినా యీ కాలపు కుర్రకారంతా ఇలా తయారవుతుం దేమిటి? పెద్దలమీద గౌరవం లేనేలేదు కదా, సంప్రదాయాల మీద భక్తి సన్నగిల్లిపోయింది కదా. రాజభక్తి మాటసరే దేశభక్తికూడా లేదు. నానాటికీ వీళ్ళలో నాస్తిక భావాలు మాత్రం ముదిరిపోతున్నాయి.

ఇంకో వృద్ధ:- ఇందంతా వొట్టి కుర్రతనపు విరగబాటు

అనుభవంవల్ల సవరించబడని ఉద్రేకంచేసే అతివాద విమర్శ-కాలం గడిచి కష్టాలు వొంటబట్టినతర్వాత వీళ్ళకే తెలుస్తుంది. ఈ జబ్బులన్నీ వర్తమానకాలపు ప్రత్యేక లక్షణాలు కావని; ఇవన్నీ మనతోబాటు ఎప్పుడూ ఉంటాయని; ఎందరు ప్రయత్నించినా వీటిని కుదర్చడం ఎన్నటికీ సాధ్యంకాదని.

ఒక వృద్ధ:- అసలు సమాజమనేదే మిధ్య - ఒక్కొక్క వ్యక్తి తన శరీరం అనే కారాగృహంలో ఒక్కొక్క ఖైదీ. శిక్ష అనుభవిస్తూ చివరకి మృత్యువుతో విడుదలకి ఎదురుచూడడం తప్ప మానవుడు చెయ్యగలిగింది మరొకటేదీ లేదు.

2వ వృద్ధు:- ఆద్యంత రహితమైన విశ్వంలో జనన మరణాల శాఖా చంక్రమణంచేసే మానవమాత్రుడికొక ప్రాముఖ్యం ఇవ్వడం అనవసరం. సూర్యుడిలోంచి మంట బంతిగా విడిపోయిన భూగోళంమీద మానవుడు లేనికాలం ఒకటుంది. సూర్యుడు చల్లారిపోయి మంచుముద్దగా పేరుకుపోయే భూలోకం నుంచి మానవుడు నిష్క్రమిస్తే సృష్టి దృష్టిలో అదొక నిట్టూర్పు విడువదగ్గ విషాద సంఘటన కానేరదు.

ఒక యువ:- ఈ నిరాశావాదంతో మాకు నిమిత్తంలేదు. జీవితానికి పరాజయం ఉందని మేము అంగీకరించలేము. భూమిమీద కాకపోతే ఇంకో ఖగోళంలో ప్రాణం పుష్పిస్తుంది. మానవుడిలో మాకు నమ్మకంఉంది. భవిష్యత్తులో మాకు విశ్వాసంఉంది.

ఒక స్త్రీ:- కాలం అనేదే ఒక భ్రాంతి. కాబట్టి భవిష్యత్తులో నమ్మకం భ్రాంతిలో భ్రాంతి.

యువకం:- భవిష్యత్తుని మేం చూశాం. భావి మానవుడు మాకు కనిపించాడు.

2వ స్త్రీ:- స్వర్గస్వప్నాలు అంతా మిథ్య. మృత్యువొక్కటే యథార్థం.

ఒక యు:- సరే మీరు గతకాలాన్ని నెమరు వేసుకుంటూ మృత్యువునే ఆరాధించకోండి. వెనక్కి వెనక్కి వెళ్లిపొండి.

గద్గదకం:- అలాగే వెళ్ళిపోతాం, వెనక్కి కాకపోతే మాకు భవిష్యత్తులో ఏముంది కనుక?

ఏయ్‌టాక్సీ, వెనక్కి ఇంకా వెనక్కి
గోడ కనబడలేదా పోదాం వెనక్కి
ఈ సందుకి మలుపులేదు. పోపో వెనక్కి
హేహే టాక్సీ ఇలా తెచ్చావేం, ఇంక వెనక్కి
ఓయ్ నావికా, మళ్లించు పడవ
ఈ నీళ్లు ఎంతదూరం వెళ్ళినా ఇంతే
గాలి మారింది నావికా వెనక్కి తిప్పు పడవ
వ్యర్థం ఈ ప్రయాణం వెళ్ళిపోదాం వెనక్కి
అమ్మాయీ, జీవితం, అలిసిపోయాం మనం
నీ జుత్తు తెల్లబడింది నా ఆశ చల్లబడింది.
నానాళ్లలో ప్రవహించేది నెత్తురుకాదు జాన.

అమ్మాయీ హడలిపోయాం వెనక్కి పట్టించు దోవ
సినిమా ఆపరేటర్ స్లోమోషన్ ఫ్లాష్‌బాక్
బద్దలైన నా స్వప్నాల రంగు గాజు పెంకులేవి
చివికిన నా యౌవనపు సీతాకోక చిలుకలేవి
నా పారిపోయిన చిన్నతనపు పచ్చదనం ఏదీ?
అమ్మాయీ జీవితం
ఆనందం, సౌందర్యం
ఘోరమైన దోపిడి జరిగింది.
పారిపోదాం వెనక్కి.

మేం వెళ్ళిపోతున్నాం అమ్మాయిలూ, అబ్బాయిలూ ఇదిమాత్రం జ్ఞాపకం ఉంచుకోండి. మీమీద మాకు కోపంలేదు. యౌవనోత్సాహాలన్నీ ఇంద్రధనస్సు రంగులతో ఏవో వింతలో కాలు చిత్రించుకుంటారు మీరు. అవి తామరాకులమీద నీటి బిందువుల్లాగ ఎంత అందమైనవో అంత అశాశ్వతమైనవి.

యువకం:— ఇకమీరు వెళ్ళండి. మాకుకూడా మీ మీద కోపంలేదు. మీ దృక్పథాన్నే మేము సహించలేము. మీది వెనుకచూపు మాది ముందుచూపు.

2వ యువ: భవిష్యత్తును చూశాం మేము. భావి మానవుడు కనిపించాడుమాకు. మళ్ళీ ఇప్పుడే వస్తాడు.

వృద్ధ: అర్థంలేని ఆశలు. ఆకారంలేని స్వప్నాలు.

యువకం: భవిష్యత్తులో మాకు నమ్మకం వుంది. మానవుడిలో మాకు విశ్వాసం ఉంది.

రాశిచక్ర గతులలో,
రాత్రిందివాల పరిణామాలాలలో,
బ్రహ్మాండ గోళాల పరిభ్రమణాలలో,
కల్పాంతాలకు పూర్వం కదలిక పొందిన
పరమాణువు సంకల్పంలో
ప్రభవం పొందినవాడా!
మానవుడా! మానవుడా!
ఆలోచనలు పోయేవాడా!
అనునిత్యం అన్వేషించేవాడా!
చెట్టూ, చెరువూ
గట్టూ, పుట్టా
ఆకసంలో, సముద్రంలో
అన్వేషించేవాడా!
అశాంతుడా! పరాజయం ఎరుగనివాడా!
ఊర్ధ్వ దృష్టీ! మహోమహుడా!
మహా ప్రయాణికుడా!
మానవుడా! మానవుడా!
అవిభక్త కుటుంబీ!
ఏకరక్త బంధూ!
మానవుడా! మానవుడా!

యువకం: కనుపాప వస్తున్నాడు.

2వ యువ: ఔను. వస్తానని అన్నాడు. అల్లాగే వస్తున్నాడు. వాళ్ళ ప్రపంచంలో అసత్యానికి చోటులేదు.

వృద్ధ: కనుపాప ఎవరు?

యువ: భావి మానవుడు. అదిగో వస్తున్నాడు.

వృద్ధ: నాకే కనుపాపలాగా కనపడలేదు.

యువ: మీరు కళ్ళు గతాన్ని తప్ప భావిని చూడలేరని తీర్మానం చేసుకున్నాము. మీకు కనుపాప ఎలా కనపడతాడు?

వృద్ధ. అంతా భ్రాంతి. అంతా మిథ్య

1వ యువ: అదిగో కనుపాప.

2వ యువ: ఆకుపచ్చని నాగబంతి.

3వ యువ: భావి మానవుడు.

కను: మాట నిలబెట్టుకోవడానికి వచ్చాను. అంతే ఈ వాతావరణంలో నేను ఉండలేక పోతున్నాను.

1వ యువ: మాకోసం కొంతసేపైనా ఉండాలి. కనుపాపా మా కాలపు విశేషాలు చెప్పవూ?

కను: అడిగింది చెబుతాను.

1వ యువ: అంతా ఆశ్చర్యంగా వుంది. ఏం అడగాలో తోచలేను.

2వ యువ: ఎన్నో అడగాలని ఉంది. ఏం అడగడానికీ తోచలేదు.

1వ యువ: కనుపాపా, మీకు మరణముందా?

కను: మేము కాలంలో జీవిస్తాము. కాలాన్ని అర్థం చేసుకున్నవాళ్ళకి మరణంలేదు.

2వ యువ: కనుపాపా మీకు ఆకలి వేస్తుందా?

కను: ఆకలి? ఆమాటకి నాకర్థం తెలియదు.

2వ యువ: కాదు. మీకు ఆహారం అక్కర్లేదా?

కను: ఓహో అదా? ఈ సమస్యను చెట్లు ఏప్పుడో పరిష్కరించాయి.

2వ యువ: అందుకా ఆ అనుపస్పదనం? సూర్య కిరణాలనే మీరు తింటున్నారన్నమాట.

కను: కిరణాలని తినం. వాటిశక్తిని పీల్చుకొని-

1వ కం: సరే. ఈ తిండిఘోషకేంగాని ఒక సంగతి చెబుదూ. నువ్విప్పుడు తెలుగుభాష మాట్లాడుతున్నావు. మీరంతా ఇదేభాష మాట్లాడుతారా?

కను: మేమసలు మాట్లాడుకోము. భాషచాలా అసమగ్రమైన పనిముట్టు. ఏ ఊహనీ అది విస్పష్టంగా అసందిగ్ధంగా తెలియజెయ్యలేదు. నా మాటలుకూడా మీకు సరిగా అర్థమవుతున్నాయో లేదో తెలియదు. ఇరవయ్యో శతాబ్దంలో తెలుగు జనులమధ్య ఉన్నాను కాబట్టి నా ఊహలయంత్రాలు తెలుగు ధ్వనులు చేస్తున్నాయి.

1వ కం: అయితే మీరు ఒకరిభావాలు మరొకరికెలా ప్రకటించుకుంటారు?

కను: పరస్పరం ఊహలతోనే ప్రసంగించుకొంటాము. ఈ సమస్యనుకూడా చెట్లే పరిష్కరించాయి.

2వ కం: నువ్వు చెట్టువా?

కను: కాను. అయితే వృక్షాలతత్వం మాలో చాలా మట్టుకు జీర్ణించింది.

1వ కం: అదెలాగ?

కను: వినండి. ఇరవై ఒకటవ శతాబ్దపు తొలి సంవత్సరాలలో రెండవ పరమాణు యుద్ధం జరిగింది. అందులో–

1వ కం: మొదటి పరమాణు యుద్ధం ఎప్పుడు జరిగింది?

కను: ఇరవయ్యో శతాబ్దంలో. అంతకన్న ఎక్కువ నన్ను డగవద్దు.

2వ కం: పోనీ అది యెవరిమధ్య జరిగింది? ఎలా పరిణమించింది?

కను: రెండు విభిన్న దృక్పథాలుగల ప్రపంచరాజ్యాల మధ్య జరిగింది. 48 గంటలయుద్ధం అని దానికి చరిత్రలో పేరు. దాని ఫలితంగా రెండురాజ్యాలూ తుడిచిపెట్టుకు పోయాయి. భూమి అంతా ఒక ఎడారిగా–ఇంతకన్న మంచిమాట నాకు దొరకి లేదు—భూమి ఒక ఎడారిగా మారింది. లోకం మొత్తంమీద కొన్ని వందలమంది మనుష్యులూ, కొన్ని వేల చెట్లూ మాత్రమే మిగిలాయి. చెట్లకీ మనుష్యులకీ మధ్యస్థంగా గోళాకారంగల జీవులుకొత్తగా ఆవిర్భవించారు. వాళ్ళ సంతతి వాళ్ళమేమేము. రెండో పరమాణుయుద్ధం జరిగిన దాకా ప్రాణికోటి పరిణామంలో జంతుతత్వం, వృక్షతత్వం విడివిడిగానే అభివృద్ధిచెందుతూ వచ్చాయి. గోళాకారులలో సంఘర్షణ క్రమక్రమంగా తీవ్రరూపం ధరించింది. నిజానికి

ద్వితీయ పరమాణు సంగ్రామం మానవునిలో జంతుతత్వానికీ నృతు తత్వానికి మధ్యజరిగిన యుద్ధం అందులోకూడా ఏ తత్వ మూ జయించలేదు. ఒక కొత్తపరిణామం మాత్రమే జరిగింది. దానిఫలితమే మేము.

1వ యువ: కనుపాపా, 25వ శతాబ్దంలోకి వెళ్ళేనన్నావు. అప్పటివిశేషాలు చెప్పవూ?

కను: నాకవి సరిగా బోధపడలేదు. మేము ఎనమందు గురం కలిసి పరిశోధనకని బయలుదేరాం. నా యంత్రాలలో పొరపాటువల్ల ఇటు వచ్చేశాను. నేను మళ్ళీ వెళ్ళిపోవాలి. సమిష్టిమీద పరిశోధన సాగిస్తున్నాం. సమిష్టిమీదనే మాకు అర్థం అవుతుంది. ఇక నన్ను బలవంతం చెయ్యకండి. నాకు వ్యవధి లేదు.

1వ యువ: ఒక్కటిమాత్రం చెప్పు కనుపాపా. మీలో ఎవ్వరికీ వ్యక్తిత్వం లేదూ?

కను: ఏం ప్రశ్న యిది. సమిష్టి బాధ్యతలో వ్యక్తిత్వం ఎన్నడూ హరించుకు పోనక్కరలేదు. నేనున్నానా? సమగ్ర సమాజ జీవితంలో నా వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసిస్తుంది. వ్యక్తిత్వం అంటే ఏకాంతం అనుకుంటారు మీరు. కాబట్టే మీకందరికీ ఇంత ఒంటరితనం.

1వ యువ: మరిమీకు రహస్యాలు లేవూ?

కను: రహస్యాలా? మేము గోళాకారపు గాజు గృహాల్లో జీవిస్తాము. భూమి ఆకారంతో, విశ్వం ఆకారంతో, మా శరీ

రాలన్నీ నివాసాలనీ సమన్వయించుకున్నాం. ఏ క్షణంలో ఎక్కడ ఎవరేం జేస్తున్నదీ ఇంకొకళ్ళకి ఎప్పుడూ తెలుస్తూనే ఉంటుంది. ఆఁ వస్తున్నాను.

1వ యువ: వెళ్ళిపోయాడు.

2వ యువ: భవిష్యత్తు ఆకర్షణీయంగా లేదూ?

వృద్ధ: అంతా పెద్ద భ్రమ. అంతా వ్యామోహం.

1వ యువ: తాతా, నువ్వు భావి మానవుడిమాటలు విన లేదూ?

వృద్ధ: నేను నిద్రపోతున్నాను. మీరు కలలు కంటున్నారు.

1వ యువ: కలలే నిజమవుతాయి. భవిష్యత్తును మేం చూశాం. భావి మానవునితో మేం మాట్లాడాం.

బృంద:- మరో ప్రపంచం...

కనపడలేదా మరో ప్రపంచపు
కణకణ మండే త్రేతాగ్ని.

# గవేషణ

(మిలిటరీమార్చి రికార్డు వినబడుతూ ఉంటుంది)

ప్రకటన: భూలోకంలో ఒకమానవుడు తన ముప్పయి అయిదోఏట చచ్చిపోయాడు అతనిఆత్మని మృత్యుదూతలు మిలిటరీ పహారాలో మరో ప్రపంచానికి తీసుకుపోతున్నారు. ఆ లోకంలో అతనిఆత్మని ఒకానొక న్యాయస్థానంలో అప్ప గించ వలసిందిగా మృత్యుదూతలకి ఉత్తరువు. దారిలో హఠా త్తుగా మానవుడు మేలుకొంటాడు. తానింకా బతికిఉన్నానని మృత్యు దూతలతో వాదిస్తాడు.

(ఫేడౌట్. మిలిటరీ మార్చి)

(ఫేడిన్ - మానవుని గొంతుక)

మానవుడు. ఇదేమిటి? మీరంతా ఎవరు? ఎక్కడికి తీసుకుపోతున్నారు నన్ను? మాట్లాడరేం? మాటలురావూ మీకు?

ఒక మృత్యుదూత: మాట్లాడకుండా నడవయ్యా మానవుడా.

ఇంకొక మృత్యుదూత: ఈ మనిషి. చచ్చిపోయాడు కదా ఎలా మాటలాడ గలుగుతున్నాడు? ఎప్పుడూ ఎరగని విడ్డూరం.

మాన: నేను చచ్చిపోయానా? మీకేం మతిపోయిం దా? మనిషంత మనిషిని నేను కనబడలేదూ నీకు?

2వ మృ: నిన్ను చూడనక్కరలేదు. నీకు శరీరంలేదు. నువ్వు చచ్చిపోయావు. నీ కళేబరం ఇప్పుడు మీ పల్లెటూరి

వల్లకాట్లో ఉంది.

మాన: నేను బతికే ఉన్నాను. నన్ను వదలిపెట్టండి నాలోకానికి పోతాను. నా ఇంటికి నేను పోతాను. నన్ను వదలిపెట్టండి.

1వ మృ: నిన్ను వదలిపెట్టడానికి ఉత్తరువు లేదు. న్యాయమూర్తి ముందు నువ్వు నిలబడబోతున్నావు. నిన్నక్కడ విచారణ చేస్తారు.

మాన: నేనేం పాపంచేశాను.?

1వ మృ: ఏమో. మనుల్ని అడగనద్దు మాట్లాకుండారా

2వ మృ: ఈ మానవుడు చచ్చిపోయాడు కదా ఎలా మాటలాడుతున్నాడ?

మాన: మళ్ళీ అదేమాటా? నేను బతికే ఉన్నాను.

1వ మృ: అదిమాకు అనవసరం. మా ఉత్తరువు ప్రకారం మేము నడుచుకోవాలి.

మాన: ఆ ఉత్తరు విచ్చిన అధికారి ఎవరు?

1వ మృ: అధికంగా మాటలాడకు. ఆజ్ఞలను ఉల్లంఘించకు.

మాన: నన్నాజ్ఞాపించుతున్న దెవరు?

1వ మృ: అందర్నీ ఎవడు శాసిస్తున్నాడో వాడు.

మాన: అతనిదగ్గరకానన్ను తీసుకొని వెళ్తున్నారు?

1వ మృ: అబ్బో. అతనిదర్శనం అంతసులభంకాదోయ్.

మానవుడా. చచ్చిపోయినవెంటనే విచారణ జరిగే మొదటి న్యాయశాలకి తీసుకువెళ్ళుతున్నాం నిన్ను.

2వ మృ: ఈ చచ్చిపోయినమనిషి ఎలా మాట్లాడుతున్నాడో? ఏదో పొరపాటు జరిగినట్లుంది.

మాన: అవును. నన్ను వదలిపెట్టండి. నేను బతికేవున్నాను మీరు నమ్మరూ నన్ను?

1వ మృ: మేము నమ్మినా, నమ్మకపోయినా నీకేం ప్రయోజనం లేదు. నిన్ను వదలిపెట్టగల స్థితిలో మేంలేము. బహుశా నువ్వు బతికే వున్నావేమో కాని—

మాన. బహుశా అంటావేమిటి? నిశ్చయంగా నేను బతికే ఉన్నాను.

2వ మృ: ఎక్కడో పెద్దపొరపాటు జరిగింది.

1వ మృ: ఈ లోకంలో ఎన్నడూ పొరపాట్లు జరగవు.

మాన: ఏం ఇదేం స్వర్గమా?

1వ మృ: స్వర్గమనీ, నరకమనీ వేరేవేరేలోకాలులేవు. నీ పాపం నీ నరకం. నీ పుణ్యం నీ స్వర్గం.

మాన: ఏది పుణ్యం? ఏది పాపం? స్వర్గ నరకాలు వేరువేరుగా లేకపోతే పుణ్యపాపాలుకూడా వేరువేరుగాలేవు.

2వ మృ: చచ్చిపోయినవాడివి. చచ్చినట్లుండక చట్ట విరుద్ధంగా మాటలాడడం పాపం.

2వ మృ: ఊరుకో. ఊరుకో. ఇతణ్ణి విచారణచేసే అధికారం మనకిలేదు.

2వ మృ: అయితే ఈ మానవుణ్ణి మాటలాడవద్దను. వీడు మాటలాడుతూవుంటే నాకెందుకో భయంవేస్తోంది.

1వ మృ: మనమేదో తప్పుపని చేస్తున్నట్టు నా అంతఃకరణకి స్ఫురిస్తోంది. చచ్చిపోకముందే మనం ఇతణ్ణి తీసుకుపోతున్నామేమో?

2వ మృ: ఇందులో మన తప్పేంఉంది. మనకిచ్చిన ఉత్తరువు ప్రకారం మనం నడుస్తున్నాం.

1వ మృ: ఈ మానవుడు బతికేఉన్నాడు. ఇతణ్ణి న్యాయమూర్తి యెదుట నిలబెట్టడానికి వీలులేదు.

2వ మృ: ఉత్తరువును ఉల్లంఘించవలసిందేనా?

1వ మృ: ఎంత సంకటం వచ్చిపడింది మనకి. ఎక్కడో తప్పుజరిగింది. దానిఫలితం మనం అనుభవిస్తున్నాం.

2వ మృ: ఊరుకో. ఊరుకో. తప్పు జరిగిందని నిశ్చయంగా నీకేం తెలుసు? తెలియందే ఎవళ్ళమీదనైనా ఎలా నేరం ఆరోపించగలవు?

1వ మృ: ఈ మానవుడు బతికివుండడమే ఇందుకు నిదర్శనం.

2వ మృ: మానవుడు మాటలాడలేదు.

1వ ,, మానవుడు మరణించాడు.

2వ ,, మరింతసేపూ మాటలాడాడే? ఇది సంభవమా?

1వ మృ: ఇంతసేపూ ఏదో భ్రాంతిలో పడ్డాం మనం.

2వ మృ: మరి మనకంత భయం వేసిందేం? ఎన్నడూ భయమంటే ఏమిటో ఎరగమే మనం. ఒక మానవమాత్రుడు ఎంత హడలు కొట్టించాడు మనల్ని. ఏదో తప్పు చేసినట్లు ఎంత వణికిపోయాం ఇంతసేపూ?

1వ మృ: ఈ లోకంలో ఎప్పుడూ తప్పు జరగదు. ఇదివరకెప్పుడూ మనం బతికున్న వాళ్ళ జోలికి పోలేదు.

మానవుడు: ఇప్పుడు మీరు నాకు అన్యాయం చేస్తున్నారు. నా ప్రాణాలు తీసేస్తున్నారు. నన్ను నరకబాధ పెడుతున్నారు. నేనేం తప్పు చేశానని? బతికుండగానే నన్నిలా కాల్చేస్తున్నారేమిటి? తీసుకెళ్ళండి? నన్ను మీ అన్యాయమూర్తి దగ్గరకి తీసుకెళ్ళండి. అతణ్ణే ప్రశ్నిస్తాను. కానియ్యండి. మీ ధర్మం మీరు నిర్వహించండి. ఆ న్యాయమూర్తి ఎవరో నాకు చూపించండి. బహుశా అతడు భగవంతుడు కాడనుకుంటాను అతనికన్నా తక్కువహోదాలో ఉన్న క్షుద్రదేవత అనుకుంటాను. మా భూలోకంలో ఇలాంటి అధికారులు చాలామంది ఉన్నారు. ఇక్కడకూడా ఉన్నారన్నమాట అన్యాయాధికారులు.

1వ మృ: ఊరుకో, ఊరుకో. ఇదుగో న్యాయశాల సమీపించాం. మానవుడా! మమ్మల్ని చీవాట్లు పెట్టకు. నీ మరణానికి మేము కారణం కాం. నువ్వసలు చచ్చిపోయావో బతికున్నావో కూడా మాకు తెలియదు. ఆజ్ఞమేరకు నిన్నిక్కడికి తీసుకొచ్చాం. అంతే.

2వ మృ: ఇక మేం వెళ్ళిపోతున్నాం. ఇక్కడి రక్షక భటులకి నిన్నప్పగించి మేం సెలవు తీసుకుంటాం. మానవుడా! నీ రౌద్రాకారాన్ని చూస్తే మాకు భయంవేస్తోంది. విచారణ లో నువ్వు గెలవాలని త్రికరణ శుద్ధిగా కోరుతున్నాం. దేవతలు కూడా పొరపాటు చేస్తారని నీ జీవితంలో ఋజువుచేశావు. నువ్వు జీవించే ఉన్నావనడానికి మాకేమీ సందేహంలేదు. మానవుడా, జీవించు.

1వ మృ: మరిమాకు సెలవు. (పావు నిమిషంసేపు జాత్రి సంగీతం.)

౨

ప్రకటన: మృత్యుదూతలు మానవుని ఆత్మని మరో ప్రపంచపు న్యాయస్థానానికిచెందిన రక్షకభటులకి అప్పగించి వెళ్ళిపో యారు. రక్షకభటులు ధర్మాసనంమీద కూర్చున్న న్యాయ మూర్తి సమక్షంలో మానవుణ్ణి హాజరుపెట్టారు. ఈ న్యాయ మూర్తి వయస్సులేని, నేత్రాలులేని ఒక స్త్రీమూర్తి.

న్యాయమూర్తి: మానవుడా! ఎన్నడూ జరగని పొర పాటొకటి ఈ లోకంలో జరిగింది. ఇప్పుడే నీ కాగితాలన్నీ తెప్పించి పరిశీలించాను. నాకు కళ్ళులేవుగాని చూడగలను. భూలోకంలో నీకింకా అయిదుసంవత్సరాల ఆయుస్సు ఉండగా ఈ కార్యాలయంలోని ఒకచిన్న వుద్యోగితప్పు లెక్కవల్ల మృత్యుదూతలు నిన్నిక్కడికి తెచ్చేశారు. నువ్వు చనిపోయా వని నిజంగానే వాళ్ళనుకున్నారు.

మాన: మీరు ధర్మస్వరూపులు. దేవతల పొరపాటు వల్ల ఈ మానవుడు బాధపడుతున్నాడు. నన్నుకూడా ఇప్పుడు సందేహం బాధిస్తోంది. నేను బతికున్నట్టా చచ్చిపోయినట్టా?

న్యాయ:మృత్యు రాజ్యపు చట్టంప్రకారం నువ్వు చని పోయినట్టుగానే వుత్తరువు పడిపోయింది. తక్షణమే మృత్యు దూతలు నీ శరీరంనుంచి నీ ఆత్మని తొలగించివేశారు. నీ కాగితాలు తెప్పించి పై అధికారులతో నీ విషయమై ఎంతో వాదించాను. ఇక్కడి వ్యవస్థలో ఎప్పుడూ పొరపాటు జరగ దనే అందరూ అనుకుంటున్నారు. కాని నీపట్లమాత్రం పొర పాటు జరిగింది. నీ కన్యాయం జరిగింది. నక్షత్రాల సాక్ష్యం ప్రకారం నీకింకా అయిదేళ్ళ ఆయువుందని నేను స్థిరంగా నిర్ధారణ చేశాను.

మాన: ధర్మదేవతా! కృతజ్ఞుణ్ణి.

న్యాయ: నువ్వింక భూలోకానికి పోవచ్చు నీ ఆత్మని దేవదూతలు మర్యాదగా మీ పల్లెటూళ్లో వదలిపెడతారు. మా పొరపాటువల్ల నీకు అన్యాయం జరిగినందుకు మేమంద రమూ సిగ్గుతో తలవంచుకుంటున్నాము. భగవంతుడుకూడా ఆయన్ని నేనెప్పుడూ చూడలేదుగాని ఈ జరిగినదానికెంతో బాధ పడుతూ వుంటాడు.

మాన: ధర్మదేవతా! భగవంతుణ్ణిమీరు చూడలేదా ఎప్పుడూ?

న్యా: భగవంతుడు ధర్మానికికూడా అతీతుడు. ఈ చర్చ లిప్పుడు వద్దు. ఇక నేను సభ చాలిస్తున్నాను. నువ్వు భూలోకానికి వెళ్లు. (అరనిమిషంసేపు జంత్రి సంగీతం.)

3

ప్రకటన: దేవదూతలు మానవుని ఆత్మను అతని పల్లెటూళ్లో దిగవిడిచిపోయారు. కాని అప్పటికే అతని శరీరాన్ని బంధువులంతా దహనంచేసివేశారు. ఇంకా అయిదేళ్ళ జీవితం వున్న మనుష్యుడి ఆత్మ నివసించడానికి శరీరంలేదు. తన శరీరాన్ని వెతుక్కుంటూ ఆత్మ ఆ రాత్రింతా ఎంతో అల్లాడింది. మళ్ళీ ధర్మదేవత దర్శనం చేసుకుంటే బాగుండుననుకుంది. కాని ఈ లోకంలోని ఉన్నతాధికారుల దర్శనం చేసుకోవాలంటేనే ఎందరోన్ని ఆశ్రయించి ఎన్నెన్నో తిప్పలు పడాలే ఆ లోకంలోని అధికారిని దర్శించడంఅంటే మాటలా! నిన్న తనప్రయత్నం లేకుండానే ధర్మదేవత కనబడింది. ఈ రోజు ఎక్కడుందోకూడా తెలియదు. అయినా తన ప్రయత్నాన్ని ఆత్మ వదిలిపెట్ట దలుచుకోలేదు. సమస్తదేశ కాలావధులలో స్వతంత్రంగా నిరాఘాటంగా సంచరించ గలుగుతోంది ఆత్మ. కాని, పంచభూతాళలో కలిసిపోయిన తన శరీరంమాత్రం ఎంత వెదికినా మళ్ళీ కనిపించదు. ఇదేమిటీ ఉపద్రవం? ఎక్కడో ఎవ్వరోచేసిన పొరపాటుకి తానెందుకింత బాధ పడాలి? మళ్ళీతాను మరో ప్రపంచానికి వెళ్ళి ఎలాగైనా తనశరీరాన్ని తన కిప్పించవలసిందని న్యాయమూర్తి యెదుట ఫిర్యాదుచెయ్యడానికి మరణజీవితాలమధ్య అల్లాడుతున్న మానవుని ఆత్మ నిశ్చయించింది.

మరోప్రపంచపు న్యాయస్థానం వెలుపల పెద్ద పెద్ద సారంగాలవంటి వరండాలు. కీచురాళ్ళ చప్పుడు. ప్రవేశం ఆత్మ రూపంలో మానవుడు.)

మాన: ధర్మదేవతా! ధర్మదేవతా!

(ఎవరూ పలకరు. కాలావధుల కొసనుంచి అతని జాలి కేకకు అదేజవాబుగా ప్రతిధ్వని. చీకటి గుహల్లోంచి నదులు ప్రవహించినచప్పుడు.)

మాన: న్యాయమూర్తీ! న్యాయమూర్తీ!

(ఎవరూ పలుకరు, ప్రతిధ్వని తప్ప. తర్వాత గాజుపెంకలు పగిలిపోయినట్లు నవ్వు)

నవ్వినమనిషి: ఈ భగవంతుని న్యాయస్థానంలో ఎవరయ్యా నువ్వు?

మాన: నేనోమానవుణ్ణి. నాకింకా అయిదేళ్ళు ఆయుర్దాయం ఉంది. (నవ్వు) ఎందుకలా నవ్వుతావు? ఎవరివి నువ్వు?

నవ్విన: ఎవరినైతేనేం? ఆనందం అనుకోనన్ను మాటవరసకి. ఏకం నా సంఖ్య. ఎప్పుడూ ఇక్కడే నా ఉద్యోగం. నీకు ప్రస్తుతం సాయం చెయ్యడానికి వచ్చాను.

మాన: సంతోషం. నిజంగా ఇది స్వర్గలోకంలాఉంది.

నవ్విన: ఇక్కడ ఉద్యోగుల్ని కొందర్ని చూస్తే ఇదే నరకం అనుకుంటావు నువ్వు. వాళ్ళదాహం నువ్వు తీర్చలేవు.

మాటవరసకి నాలోనే మరో దుర్మార్గవు వేపుంది. మాటవర సకి నీకు నేను న్యాయమూర్తి దర్శనం చేయిస్తాననుకో. నాకే మాత్రం లంచం చదివించుకోగలవు?

మాన: ఇంకా సందేహమా? ఇది నరకం.

నవ్వీన: అన్నీ నీ మనస్సులో నువ్వే కల్పించుకొంటు న్నావు. నిష్కల్మషంగా నీకు సహాయపడాలని వచ్చాను. మాటవరసకి నువ్వు కోరినవరం ఇస్తాను. నేనుకోరే హవిస్సు లతో నన్ను సంతోషపెట్టు.

మాన: ఆనందానికి ఆనందం కలిగించాలా నేను? నన్ను నేను హోమం చేసుకుంటున్నాను. ఇది చాలదా ? తృప్తికి నిన్ను నూటఎనిమిది పేర్లతో పిలిచి స్తోత్రం చేస్తాను. నీకు జాలి గలగదూ. ధర్మదేవతని చూపించవూ?

నవ్వీన: ధర్మదేవతా దర్శనం! అదంత సులభమను కున్నావా మానవుడా. మాటవరసకి అందుకెంత తపస్సు కా వాలో ఆలోచించావా?

మాన: నేను కోరకుండానే నిన్న ఆవిడ నాకు దర్శన మిచ్చింది.

నవ్వీనవ్యక్తి: నువ్వు భూలోకపు కాల పరిమితులలో మాట్లాడడం మానివెయ్యాలి. మాటవరసకి నిన్న చూశావో కొన్ని యుగాలకిందట చూశావో ఎవరికి తెలుసు? ఇంతకీ నువ్వెందుకు ఆవిడనుచూడాలి?

మాన: నీకు తెలియదా మహానుభావా! నా నోటంట చెప్పించాలా?

న. వ్య: నువ్వేదో దావాలో గెలిచావటకాదూ?

మాన: గెలిచానో, ఓడానో! ఈ ప్రాణానికేమీ సుఖం లేదు. నా శరీరం నాకు దొరికితే బాగుండును.

న. వ్య: ఏమైంది నీ శరీరం? ఎక్కడ పారేసుకున్నావు?

మా: నేనేమీ పారేసుకోలేదు. మీ న్యాయస్థానంలో ఒక వుద్యోగి చేసిన పొరపాటువల్ల నాకు మరణం సంభవించింది.

న. వ్య: అలాగనా పాపం.

మాన: ధర్మదేవత నా జీవితాన్ని నాకుమళ్లీ ప్రసాదించింది. కాని మావాళ్లు నా శరీరాన్ని దహనంచేసివేశారు. నిన్న రాత్రింతా నేనెంతో యాతనపడ్డాను. ఒక చచ్చిపోయిన గబ్బిలం శరీరంలో ప్రవేశించాను. గబ్బిలంగా బతకడం ఎంతకష్టం. చాలాసేపు ఒక చెట్టు కొమ్మని పట్టుకొని వేలాడేను. నూతిలో ఒక కప్ప చచ్చిపోయివుంది. పోనీ అని దాని ఒంట్లోదూరేను. కప్పబతుకు, అందులోకీ నూతిలోనికప్పబతుకు అదీ ఉక్కిరి బిక్కిరిగానే వుంది. నాకు మిగిలిన అయిదేళ్లూ నా బతుకు నేను బతుకక ఇంకో జంతువుని ఎందుకు కావాలి నేను?

న. వ్య: పోనీ మనిషి.గానే బతకలేకపోయావూ? మాట వరసకి భూలోకంలో మనుష్య కళేబరాల కేం తక్కువ? అనుక్షణం ఎందరు మరణించడంలేదు.? కాశ్మీరంలో, మలయాలో, జావాలో—

మాన: ముప్ఫయి అయిదేళ్ళు నేను నేనుగా జీవిం

చాను. నా శరీరంలో సమాధానపడ్డాను. అదిమాని ఇంకొకరి బతుకు నేనెలా బతగ్గలనుచెప్పు?

నాడి అలవాట్లు వాడి ఆలోచనలు అన్నీ నాడివే పోనీ ఎలాగో కష్టపడి వాటినే అవలంభిస్తాననుకో, అప్పటికీ నాది అబద్ధం బతుకే అవుతుంది.

న. వ్య: ఎక్కడో జరిగిన ఒక్క తప్పువల్ల ఎంత ఇబ్బందిలో పడ్డావునువ్వు! నీకు సాయపడాలని వుంది నాకు. నువ్వు నాకే లంచాలూ ఇవ్వనక్కరలేదులే. నీకేం సహాయం కావాలో చెప్పు. నీ శరీరాన్ని మాత్రం చూపించమనకు.

మానవుడు. ధర్మదేవతని చూపించు.

న. వ్య: ఆవిడమాత్రం ఏం చెయ్యగలదు? ఆవిడే కాదు ఎవ్వరూ యిక నీ శరీరాన్ని నీకివ్వలేరు.

మాన: దేవతలకికూడా అసాధ్యమైన కార్యాలున్నాయా?

న. వ్య: మానవుడివి కాబట్టి నీకు దేవతలశక్తిమీద విపరీతమైన విశ్వాసం వుండడం సహజమే. కానిదేవాదిదేవులు కూడా పురోగమనశీలమైన కాలాన్ని వెనక్కి మళ్ళించలేరు. కావాలంటే నీకు ధర్మదేవత దర్శనం యిప్పిస్తాను. లేదా ఇంకేదేనా సహాయం కావాలంటూనా? చెప్పు, చేస్తాను.

మాన: అక్కర్లేదు. ఆవిడని చూపిస్తే చాలు. ఆవిడ నాకేదో దారి చూపిస్తుంది. ధర్మదేవత ఏం చెయ్యమంటే అది చేస్తాను.

న. వ్యా: అయితే పద.
(పావు నిమిషం జంత్రిసంగీతం)

(ప్రకటన: నవ్విన వ్యక్తి, అనగా ఆనందం, తనవాగ్దానం పరిత్యాగం శరీరంలేని మనిషిని న్యాయమూర్తి సముఖానికి తీసుకెళ్ళాడు)

మాన: ధర్మదేవతా! నిన్ను సందర్శించడానికి నేను ప్రచండమైన తపస్సుచేశాను. వర్ణనాతీతం నేను పడుతున్న క్షోభ.

న్యా: మళ్ళీ వచ్చావెందుకు మానవుడా? ఈ మారు నువ్వు తెచ్చిన అభియోగం ఏమిటి?

మాన. నా శరీరం దగ్ధమైపోయింది. నేను నిలవడానికి నీడలేదు. మీరిచ్చిన అయిదేళ్ళూ తీసుకున్నా తీసుకోండిగాని. నిరాశ్రయంగా నన్ను అనంతవిశ్వంలో పరిభ్రమించ నివ్వకండి.

న్యాయ: మొదటిసంగతి ఆ అయిదేళ్లూ నేనిచ్చినవి కావు. రెండోది వాటిని తీసుకొనే శక్తిగాని, అధికారంగాని నాకులేవు.

మానవుడు: మరి నన్నిప్పుడేం చెయ్యమన్నారో మీరే చెప్పండి. జీవితంనుంచి నేనొక కాందిశీకుణ్ణయిపోయాను. ఇం కొకడి బతుకు నేను బతకలేను. ఎందుకు నాకీ అయిదేళ్ళు?

న్యా: పోనీ, ఇదిచెప్పూ. ఇంకో కొత్తబతుకు ప్రారంభిస్తావా?

మాన: అంటే? నాకు బోధపడలేదు. ఈ అయిదేళ్ల కాలంలో ఇంకో కొత్తబతుకు ఎలా సాధ్యమవుతుంది నాకు?

న్యా: అయిదేళ్లే అన్న పరిమితి తొలగిస్తాను. నీయిష్టం వచ్చిన శరీరంలో నువ్వు ప్రవేశించు.

మా: వద్దు తల్లీ వద్దు. నన్ను జన్మదుఃఖపు చెరనుంచి విడిపించు

న్యా: జన్మరాహిత్యమే! అదిమాత్రం నన్నడక్కు. ఆవరం నేనివ్వలేను. నీకో జీవితాన్నివ్వగలను. నీకో శరీరాన్ని చూపించగలను. అంతేగాని జన్మరాహిత్యాన్ని ప్రసాదించే శక్తి నాకు లేదు.

మాన: దేవతలు తమ అశక్తిని నాదగ్గర చెప్పుకుంటున్నారంటే నవ్వాలో ఏడవాలో నాకు తెలియలేదు. కానియ్యండి, జరిగిన పొరపాటేదో జరిగిపోయింది. నేను భూలోకానికి పోతున్నాను. ఏదోఒక శరీరంలో దూరుతాను. ఏదో ఒక బతుకు ఎలాగో ఒకలాగ బతుకుతాను. ఎప్పుడు మీరు పిలిపించుకుంటే అప్పుడు వస్తాను. ఇప్పుడునాకు బోధపడింది. నేను మీ చేతిలో ఎలా ఆట వస్తువునో, ఇంకొకడి చేతిలో మీరు అలా ఆటవస్తువులు. ఆ ఇంకొకడు మరొకడిచేతిలో, ఆ మరొకడు వేరొకడి చేతిలో. ఇలాగ ఇది అనంతం.

న్యా: సృష్టి రహస్యం అంతా ఇంతే. ఇక చెప్పు మానవుడా. ఏ శరీరంలో ప్రవేశిస్తావు?

మాన: అన్ని శరీరాలూ ఇప్పుడు నాకొకటే. దేవతల్లోనూ మానవుల్లోను కూడా నాకు నమ్మకం పోతోంది.

న్యాయ: ఓయి మానవుడా, నువ్వు దేవతలని నమ్మకపోతే పోయేవుగాని మానవత్వంమీద విశ్వాసాన్ని మాత్రం విసర్జించకు. నిజమే. నీకు దేవతలవల్ల అన్యాయం జరిగింది. ధర్మదేవతని నేను క్షమించమని కోరుతున్నాను. మానవుడా! దేవతలు నీ క్షమాపణ కోరుకుంటున్నారు. క్షమించవూ?

మాన: ఎంతమాటన్నావు తల్లీ. ఇదిగో చేతులు జోడించి మొక్కుతున్నాను. ఈ అల్పమానవుడా దేవతలను క్షమించవలసినవాడు. అంతమాట అనకు తల్లీ. నాకు సెలవిప్పించు, నేను భూలోకానికి పోతాను.

ధర్మదేవతలు: ఇందుచేతనే దేవతలు మానవుని ప్రేమిస్తారు. ఈ హృదయవైశాల్యాన్ని చూశా! ఓ నరుడా నీకు వరమిస్తున్నాను. నీవు ఎవరిలాగ బతకాలనుకుంటున్నావో కోరుకో.

మాన: నాకు నాలాగ తప్ప ఇంకోవిధంగా బతకాలని లేదు. అది అసాధ్యమని తేలిపోయింది. ఇక ఏ బతుకైతే నేం? ఎలాగూ కొత్తజీవితం ప్రారంభించాలి. కాబట్టి సరికొత్త జీవితమే మొదలుపెడతాను. నన్నో అమ్మ కడుపులో పారెయ్యి తల్లీ. అదే నేను కోరేవరం.

ధర్మ: అదిగో మళ్ళీనాకు లేనిశక్తి సామర్థ్యాలని నాకాపాదిస్తున్నావు. నిన్ను తిరిగి నేను సృష్టించలేను. శిశువుగా జీవితాన్ని ప్రారంభిస్తానన్నావు. కనుక ఇదుగో విను. నీకు పూర్ణాయుర్దాయం ఇస్తున్నాను. ఈ క్షణంలో భూలోకం

లో ఒక అమ్మాయి ప్రసవిస్తోంది. కాని ప్రాణంలేని శిశువు అది. అతికష్టంమీద వైద్యుడు ఆ శిశువుని పైకితీశాడు. ఆబిడ్డ శరీరంలో నువ్వు ప్రవేశించి బ్రతుకుని ప్రారంభించు.

మాన: మహాప్రసాదం దేవీ.

(అరనిమిషం జంత్రి సంగీతం)

౫

ప్రకటన: భూలోకంలో, ఆంధ్రదేశంలో, ఒక ప్రసూతి వైద్యశాలలో ఆపరేషన్ గది. ఒక అమ్మాయి మృత శిశువును ప్రసవించింది. క్లోరోఫారం నిద్రనుంచి మేలుకుంటోంది. చిన్న మూలుగు. పక్క పెద్ద డాక్టరు నిలుచున్నాడు. మిగిలినవాళ్ళు కొంచెం దూరంగా ఉన్నారు.

డాక్టరు: భయంలేదమ్మా. నీకేం ప్రమాదం లేదమ్మా. అంతా అయిపోయింది.

అమ్మాయి: (నీరసంగా) ఏ మయింది. డాక్టరుగారూ! నా బిడ్డను చూపించరా?

డాక్టరు: చూదువుగానిలే అమ్మా! మొదటనీవు విశ్రాంతి తీసుకో

అమ్మాయి: ఇదిచెప్పండి డాక్టరుగారూ? ఏంపిల్ల? మొగాడా, ఆడదా?

డాక్టరు: పిల్లడేనమ్మా. కళ్ళుమూసుకో. అటుచూడకు

అమ్మాయి: అబ్బాయికదలడేమండీ! ఏడుపు వినబడదేం?

డాక్టరు: ఏం చెప్పమంటావమ్మా? నువ్వు ధైర్యంగా వుండాలి.

అమ్మాయి: చెప్పండి. ఫరవాలేదు. చెప్పండి. అబ్బాయి చచ్చిపోయాడు, అంతేనా?

డాక్టరు: ఇంకా ఆశలేక పోలేదు. మా ప్రయత్నాలు మేం చేస్తాం. కళ్ళు మూసుకుని పడుకోఅమ్మా. మాట్లాడొద్దు కదలవద్దు మెదలవద్దు.

అమ్మాయి: (దుఃఖంగా) నాకు తెలుసు. చచ్చిపోయాడు. లాభంలేదు. చచ్చిపోయాడు.

మానవుని గొంతుక: నేను చచ్చిపోలేదు. నమ్మండి నేను బతికే ఉన్నాను.

(శిశువు రోదనధ్వని కెవ్వుమని వినిపించి క్రమంగా ఫేడౌట్.)

# అనంతర యాత్ర

ప్రకటన: కాలం అంతా ఒకటేగాని అందరికీ ఒకటి కాదు. జీవిస్తున్నవారి కాలం వేరు. మరణించినవారి కాలం వేరు. గర్భంలో ఉన్న శిశువుదొక కాలం. ఇంకా గర్భస్థంకాని జీవి దింకో కాలం. స్టీమరులోనో, విమానంలోనో ప్రయాణం చేస్తున్నవాడికీ, నిద్రపోయి కలలు గంటున్నవాడికీ, మతిపోయిన వాడికీ, వైరాగ్య నైరాశ్యాలవల్ల కాషాయం ధరించిన వాడికీ, కాలం ఒకేవిధంగా గడవదు.

(రైలుబండి చప్పుడు ప్రారంభం)

తత్వశాస్త్రాధ్యాపకుడు శ్రీరంగారావు రైలుబండిలో ప్రయాణం చేస్తున్నాడు. నిద్రపోతున్నాడు. అతడుకాక ఇంకా ఆ మొదటి తరగతి పెట్టెలో ఇద్దరుమాత్రం ఉన్నారు. కాంతం, సరళ.

కాంతం: టైమెంతయింది సరళా?

సరళ: సారీ. నావాచీ ఆగిపోంది.

కాంతం: ముసిలాడు చేతిని వాచీతోనే నిద్రపోతున్నాడు. చూడెంత టైమయిందో!

సరళ: మర్యాదగా మాట్లాడు కాంతం. ఆయనెవరో తెలుసా?

కాంతం: ఎవరైతే మనకేం? అయినా ఎవరు?

సరళ: ఆ సూట్‌కేస్‌మీద పేరుచూడు.

కాంతం: ఎ. యస్. రంగారావు. ఇంకో యస్. తమ్ముడన!

సరళ: షటప్. ఈయన చాలాగొప్పవాడు. మావారె ప్పుడూ ఈయన్ని గురించే చెబుతూంటారు.

కాంతం: సరే. ఒప్పుకున్నాం. టైమెంతయిందో చూడ మంటే—

సరళ: ఆరు.

కాంతం: ఎప్పుడో ఆగిపోయిన నీ వాచీలో కాదు. అదుగో ఆవాచీలో, ఎంతయిందో చూడవే?

సరళ: నీవాచీ యేంచేశావ్? పెట్లో పెట్టేశావుకదూ? ఏం అజాగ్రత్త!

సరళ: అక్కర్లేదోయ్!

కాంతం: ఏమిటేఅది? విభ్రాంతపోయావ్?

సరళ: ఈయన వాచీకూడా ఆగిపోయింది?

కాంతం: మంచి పని చేసింది.

సరళ: కాదే. సరిగ్గా ఆరుదగ్గరే ఆగిపోయింది.

కాంతం: అయితే ఏమంటావు?

సరళ: ఏమీలేదు. ఎందుకేనా మంచిది. నీవాచీకూడా చూడు. నాకేమిటో భయం వేస్తోంది.

కాంతం: సూపర్ స్టిషస్! భయమెందుకే! అన్ని వాచీలూ సాయంత్రం ఆరుగంటలకు ఆగిపోయాయనేం ఈ

రాత్రి ఏదో ప్రళయం వచ్చేస్తుందనే; ఫరవాలేదు నా వాచీ సరిగానే ఉంటుందిలే!

సరళ: అయినా ఓమారు పెట్టె తెరచి చూద్దూ!

కాంతం: చాదస్తం! చాలారాత్రియింది: ఇక నిద్ర పోదాం.

సరళ: అలాగంటే పనికిరాదు. నాగుండెల్లో పెద్దబెంగ పడింది. ఏదీ నీ తాళం ఇలాఇయ్యి.

కాంతం: ఇవ్వకపోతే?

సరళ: పోనీ నువ్వేతియ్.

కాంతం: చిన్నపందెం వేద్దాం. నావాచీ తిరుగుతూనే ఉంటుందని నేను, ఆగిపోయుంటుందని నువ్వు!

సరళ: అబ్బ, తాళం ఇవ్వకపోతే నన్ను చంపుకు తిన్నట్టే.

కాంతం: ఏమిటా ఒట్లూ నువ్వూనూ? కావలిస్తే ఇందు.

రంగా: అమ్మాయిలూ! ఇంకా నిద్రపోలేదూ? అర్ధ రాత్రయినట్టుందే... అరే నావాచీ ఆగిపోయింది!

సరళ: నావాచీ కూడా సరిగ్గా ఆయుదగ్గరే ఆగిపోయిం దండీ!

కాంతం: ఊఁ, నావాచీ కూడా తీసిచూడు! ఇవాళే కాలమే ఆగిపోతుందని సరళ భయం.

రంగా: కాలం ఎప్పుడూ ఆగిపోదమ్మా. ఇక గతియా

రాల మాటా? మూడు గడియారాలొక్కసారి ఒకేచోట ఆగిపోతాయా అంటే అటువంటి సంఘటన అసంభవం అనను గాని—అతి అతి అతి, అత్యంత—

సరళ: (గట్టిగా) అక్కయ్యా! (రైలు ప్రమాదం. పెద్ద చప్పుడు. చాలా గల్లంతు. రకరకాలగోల.)

ఆకాశవాణి రేడియో వార్తలు. గతరాత్రి రైలు ప్రమాదంలో గాయపడిన వారిసంఖ్య 24. మరణించిన వారి సంఖ్య ఒకటి. మరణించినవ్యక్తి ప్రొఫెసర్ ఏ. యస్......

ఒకగొంతు: చాలు! ఈ వార్తలు, రైలు ప్రమాదం. గాయపడ్డవారు, మరణించినవారు! విమాన ప్రమాదం—గాయపడ్డవారు, మరణించినవారు! యుద్ధ ప్రమాదం—గాయపడినవారు మరణించినవారు! ఏదీ ఇవన్నీ మరపించే మంచి సంగీతం! (మ్యూజిక్)

రంగా: గణితశాస్త్రరీత్యా కాలం ఆగిపోవడం సంభవమా? అసంభవమా? ఆ అమ్మాయివాచీ నడుస్తోందో ఆగిపోయిందో తెలియలేదే? అక్కయ్యా అనిఅరచి కిటికీలోంచి గెంతేసింది. నేను నిద్రపోతున్నానా? మేలుకున్నానా? ఇప్పుడు టైమెంతయిందో?

రైలు ఆగిపోయినట్టుందే! స్టేషనుగానీ వచ్చిందా? అంతా చీకటిగాఉందే. అరే నావాచీఏదీ? చెయ్యేదీ? శరీరమేదీ?

ఒకగొంతు: ఆ ఒక్కడైనా చచ్చిపోయుండకపోనట. పాకీవాళ్ల గుండె ఆగిపోయుండట. ఇదుగో పేపర్లోవుంది.

రంగా: నా గురించె మాట్లాడుకుంటున్నారు.

ఒకగొంతు: ఆపెట్టెలోనే ప్రయాణం చేస్తూన్న అమ్మాయొకర్తె పదిగజాల దూరంలో బురదలో పడిపోయి చెక్కు చెదరలేదు.

రంగా: చేతులో రిష్టువాచీకూడా ఉందా?

ఒకగొంతు: చేతిని రిష్టువాచీ మాత్రం ఆగిపోయింది. అయితే అది ప్రమాదానికి పూర్వం ఆరుగంటలకి!

ఇంకొకరు: ఈ పేపరు వాళ్ళు ఏసంగతీవదలిపెట్టరురా!

ఒకగొంతు: ఈ చిత్రం చూశావా? ఆ పిల్ల చేతిలో ఇంకో రిష్టువాచీ ఉందట. దానిముళ్లు—

ఇంకొక: చాలెద్దూ!

రంగా: చంపేశాడు! ఈసారి నేను నిజంగా చచ్చిపోతూన్నాను! ముళ్లు తిరుగుతున్నట్టా? తిరగనట్టా? ఏయ్ పేపరు చదువుతున్న మనిషీ! నిన్ను నిన్ను బతిమాలుకుంటాను. చెప్పవూ? దానిముళ్లు—

ఒకగొంతు: మూడుముళ్ళూ పడ్డాక ఏలుకోక ఏం చేస్తాడంటా?

రంగా: వీళ్ళు మరేదో ధోరణిలో పడ్డారు. లాభం లేదనుకుంటాను. అయినా అరిస్తే?—అరుస్తాడు—ఏయ్ అబ్బీ!

ఒకగొంతు: ఛీ! దోమలు! ఒకటే సంగీతం. మీ యింటినిండా ఇన్ని దోమ లేమిటి?

రంగా: నేను దోమకన్నా హీనం! దోమకు ప్రాణం

ఉంది. నాకులేదు. లేదని బెంగకూడాలేదు. గాని శైత్యమెంత యుందో తెలిస్తేనా?

ఒకగొంతు: అబ్బో చాలా శైత్యమయింది. ఇక నేనింటికి వెళ్ళాలి.

ఇంకొక: ఏం ఇప్పుడేమంత మించిపోయింది. కాఫీ తాగిపోవచ్చు. ఒసే!

రంగా: కాఫీ తాగాలన్న తాపత్రయం ఒకటి వొదిలిపోయింది. చచ్చిపోవడంలో చాలా హాయుంది. కాఫీ ఒకటే అన్నమాటేమిటి? తిండీ తిప్పలూ అక్ఖర్లేదు. ఇల్లూ వాకిలీ అనవసరం! బట్టలు వేసుకోవాలన్న ఊడదే లేదు. నా టయిం ఎప్పుడూ సమయానికి కనబడేది కాదుకదా! సమయం! సమయం! ఏమిటో జ్ఞాపకం వస్తోంది! ఏమిటి చెప్మా! ఆఁ అదే! ఇదేమిటి నేనెక్కడికో తేలిపోతున్నాను? ఏమిటి జ్ఞాపకంవచ్చింది? ఏమో! మరచిపోయాను.

(సానుభూతి సభలో)

ఉపన్యాసకుడు: సోదర సోదరీ మణులారా! మనమిప్పుడు ప్రొఫెసర్ రంగారావుగారి మరణానికి సానుభూతి ప్రకటించే నిమిత్తం ఇక్కడ సమావేశమైనాం. రంగారావు నా ప్రాణస్నేహితుడు.

రంగా: పచ్చి అబద్ధం! వీడే కాలేజీలో నాఉద్యోగం పోవడానికి కారణం. అందుకనే నేను కడుపుచేత్తో పట్టుకొని ఉత్తరహిందూ స్థానానికి పోయాను.

ఉపన్యా: రంగారావు మనఊరి వాడైనందుకు నేను గర్విస్తున్నాను. ఆయన ఫిలాసఫీలో నిధి! ఖండ ఖండాంతరాల కాయనపేరు వ్యాపించింది. అతని పుస్తకాలు అర్థం కావడమే కష్టం! నిజం చెప్పాలంటే నాకవి అసలే అర్థంకాలేదు! అసలు నేను రాజకీయవాదిని, జీవితమంతా దేశసేవలో వెళ్ళబుచ్చాను. నాప్రియమైన పార్టీ నాసేవని గుర్తించి—

రంగా: నిగోడవెవడికావాలిరా నాకోసం జరుపుతున్న సభలో నాగురించి మాట్లాడవ్వ? నాపుస్తకాలుమహా మహా వాళ్ళకే అర్థంకావు. నీకు బోధపడలేదని ఏడుపెందుకు! ఛీ! ఇహ నేనిక్కడ ఉండలేను. అంతా నటన! అంతామోసం. జీవించినంతకాలం నేను మానవుల్ని ద్వేషించాను. మరణించిన తర్వాత ఆ ద్వేషం మరింత దృఢపడింది. మరణం ఎంతమధురంగా ఉంది! ఏ కోరికాలేకుండా చచ్చిపోవడం ఎంతహాయి! ఏ కోరికాలేదూ? లేకేం? ఒక్క కోరికమాత్రం మిగిలిపోయింది. ఆ అమ్మాయి పెట్టెలోంచి తీసిన రిస్టువాచీ తిరుగుతోందా? ఆగిపోయిందా? ఆగిపోతే ఆరుదగ్గరేఆగిపోయిందా? మూడు వాచీలు ఒక్కమాటు, ఒక్కచోట ఆగిపోతాయా? ఎందుకాగి పోకూడదు? ఎలా తీరుతుందీ సందేహం! ఆఅమ్మాయెక్కడుందో తెలిస్తే బాగుండును!

మగగొంతు: కంగ్రాట్యులేషన్సు మిసెస్ సరళా! చాలా మిరేక్యులస్‌గా ఎస్కేప్ అయ్యేరు!

సరళ: థాంక్‌యూ శర్మగారూ, మీ ఆవిడ నింపాదిగా ఉన్నారా?

రంగా: ఈ ఆడవాళ్ళకిద్దో జబ్బు! ఎదటివాడి పెళ్ళాం యోగక్షేమాలు భోగట్టా చేస్తారు! వాచీ సంగతి రానేరాదే మిటి చెప్మా?

శర్మ: మీ అక్క చెల్లెళ్ళ రిస్టువాచీలు. పేపర్లో కెక్కాయే!

రంగా: థాంక్ యూ శర్మగారూ!

కాంతం: సరిగ్గా వాచీ పెట్లోంచి పైకి తీసిందో లేదో ఢాం! పెద్ద ఏక్సిడెంట్. రెక్కలొచ్చినట్టు నాకళ్ళముందే ఎగిరి పోయింది. నేను కూర్చున్నదాన్ని కూలబడ్డాను. చిన్న గాయాలు తగిలాయి.

సరళ: పాపం! రంగారావుగారిది వీక్ పార్ట్. లేకపోతే ఆయన బతికుండేవాడే.

శర్మ. కేజుఆలిటీస్ లేకపోతే ఏక్సిడెంట్ ఏమిటి?

సరళ: వేళాకోళాలొద్దు శర్మగారూ! రంగారావుగా రంటే నాకెంతో గౌరవం! ఆయన దురదృష్టానికి నేనుచాలా విచారిస్తున్నాను.

రంగారావు: ఏమీ విచారం అక్కర్లేదు. నేను నిక్షే పంలా గున్నాను. నాసంగతి కేం? ఆ వాచీమాట చెప్పు.

కాంతం: వాచీ చూడ్డానికి ముందు మామధ్య ఎంత రభస పెరిగిందనుకున్నారు! పోలీసాఫీసరు వాచీ ఆరుదగ్గిరాగి పోయింది! దీని వాచీకూడా. బైఎస్టేన్డర్స్ కో ఇన్సిడెన్సు. ఆరు దగ్గిరే ఆగిపోయింది. పెట్లోవున్న నా వాచీ చూస్తానని—

సరళ: హల్లో! ఫాదర్: శర్మగారూ: ఈయన మానాన్న. నాన్నా: ఈయన బి. యే. లో నా క్లాస్ మేట్ శర్మ. నన్ను కంగ్రాట్యులేట్ చెయ్యడానికొచ్చారు.

రంగా: ఈ నాన్న ఇప్పుడే రావాలి? ఇక మళ్ళీవీళ్ళు వాచీసంగతి మాట్లాడరు? ఎలా తెలుస్తుంది? ఏం సాధనం?

శర్మ: క్షమించాలి! భోంచేసే వొచ్చాను.

రంగా: అక్కయ్యా అని అరిచిందికదా. అందులో కూడా అర్థే అయిందేమో? లేక రైలుపెట్టెభోగ్లాపడుతున్నం దువల్ల అరిచుండ కూడదూ?

శర్మ: ఔనండీ. అమెరికా అంటే నా కేమిటో అసహ్యం. బ్రిటనులోనే చదవాలనుంది.

సరళ: శర్మగారో చిన్న పింక్ సోపలిస్తు నాన్నా!

ప్రకటన: చచ్చిపోయిన ప్రొఫెసరు రంగారావుచాలా సేపుఅక్కడే తచ్చాడాడు. కానిమళ్ళీ వాచీమాటఎవరూ ఎత్త లేదు. కాలం ఇందాకా నేను చెప్పినట్టు, అంతా ఒకటే కాని, అందరికీ ఒకటి కాదు. మరణించిన రంగారావు జన్మించబోయే శిశువుల కాలంలో ప్రవేశించాడు.

(చల్లని నేపథ్య సంగీతం)

పిల్లల గొంతు తాతయ్యా, తాతయ్యా!

రంగా: మీరంతా ఎవర్రా?

ఒక పిల్లడు: మేం పుట్టబోయే పిల్లలం తాతయ్యా!

భూమ్మీద బతక బోతున్నాం. బతకడం ఎంతో బాగుంటుంది కదూ?

రంగా: బతకడం బాగుంటుందని ఎవరు చెప్పారు. నన్నడగండి! అరవయ్యేళ్ళు బతికిన వాణ్ణి. బతకడంలో వున్న బాధలన్నీ చెబుతాను.

ఇంకొక పిల్లడు: ఊపిరి తియ్యడమే ఎంతో సుఖమనీ, సులభమనీ అంటారు నిజమేనా తాతయ్యా?

రంగా: క్షయరోగం అన్న పేరెప్పుడైనా విన్నారా? ఊపిరి తియ్యడం ఎంతసుఖమో ఎంత సులభమో క్షయరోగుల్ని అడగండి. భయంకరమైన క్షయవ్యాధికి భూలోకంలో ఏటేటా కోటానుకోట్ల మంది బలి అవుతారు. సరేనా? ఇంకో ప్రశ్న అడగండి!

ఒక పిల్లడు: బతికుంటే మంచి మంచి వస్తువులు తినొచ్చు కాదూ? రకరకాల పళ్లూ, వేడి వేడి అన్నం, లడ్డూ జిలాబీ, హల్వా, ఇడ్లీ, ఉప్మా, దోసె.

రంగా: ఆ గబ్బాయ్ ఆగు. అజీర్ణం అన్నమాటెప్పుడైనా విన్నావా? అబ్బ, అన్నిరోగాలకి అదే మూలం. భూలోకంలో తిన్నది జీర్ణించుకోలేక బాధపడుతున్న వాళ్లున్నారు. తినడానికి తిండిలేక దేవురిస్తున్న వాళ్లున్నారు. తినడమూ బాధే. తినక పోవడమూ బాధే.

ఇంకొక పిల్లడు: జీవించడం అంటే ప్రేమించడంఅన్న మాట: నిజమైన ప్రేమని అనుభవిస్తే అంతకుమించిన స్వర్గం లేదంటారు నిజమేనా?

రంగా: అబ్బో: చాలా పెద్దమాటలాడుతున్నావ్. నేనోటి చెబుతాను విను ? ప్రేమే కాదు, ఏ అనుభవమైనా, అనుభవించ నంతసేపే ఆకర్షణ. కాని ఆ తర్వాత యాతనే అనుకోండి! అన్ని అనుభవాలూ చవిచూసిన నేను చెబుతున్నాను వినుకోండి.

ఒక పిల్లాడు: మీరెంత తెలిసిన వాళ్ళయినా మేము స్వయంగా అనుభవించకుండా మీ వ్యాఖ్యానాలతో ఎలా తృప్తిపడగలం తాతగారూ:

ఇంకొకడు: ఇతడు చచ్చిపోయాడురా: చచ్చిపోయిన వాడు బతకడం మీద మాట్లాడితే ఇలాగే ఉంటుంది.

రంగా: అయితే వెళ్ళండి: పుట్టండి: ఆ భూలోకంలో పడండి: మీ అంతట మీరే తెలుసుకోండి: నేను చెబితే నమ్ముతారా? అన్ని అనుభవాలూ అయినతర్వాత అప్పుడే తెలుస్తుంది వెళ్ళండి. శరీరాలు ధరించండి. ఎవరి శరీరాలలో వాళ్ళు ఎవరి కాలం పొడుగున వాళ్ళు జీవించండి. కాలం కాలం! మరచిపోయిందేదో జ్ఞాపకం వస్తోంది వాచీ. వాచీ! మూడో వాచీ! అందులోకాలం సాయంకాలం ఆగిపోయిందా లేదా? ఎలా తీరుతుందీ సందేహం?

ప్రకటన: ఈ సందేహం తీరదు. రంగారావు అనంతర యాత్ర అనంతంగా సాగిపోవలసిందే.

# సుప్తాస్థికలు

పరిత్రాణాయ సాధూనాం । వినాశాయచదుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ । సంభవామి యుగే యుగే.

శిష్టమానవ రక్షణ సేయుకొరకు । దుష్టమానవ నాశనో
ద్యోగమునకు
ధర్మ సంస్థాపనము నిమిత్తము ధరిత్రి । యుగయుగమ్ముల
యందు నే నుద్భవింతు.

ప్రకటన

సుప్తాస్థికలు: నిద్రపోతున్న ఎముకలు. ఎముకలునిద్ర పోతాయా? ఏమో. పోనీ, నిద్రిస్తాయనే అనుకుందాం. నిద్రించడం తప్ప మరేమీ చెయ్యలేవనే అనుకుందాం. నిద్రిస్తాయి కాబట్టి కలలు కూడా కంటాయా? ఏమో ఒక కవి యిలా అన్నాడు.

కవి

అవి ధరాగర్భమున
మానవాస్థికా పరంపరలు!
సుప్త నిశ్శబ్ద సంపుటములు!
ఆటనొకే దీర్ఘ యామిని!
ఆ నిశా శ్మశాన శయ్యకు
ప్రాతః ప్రసక్తి లేదు!

ఆయగమ్యతమౌ రహస్యాంగణాన
తాండవించును
మృత్యు శైతల్య మొకటె
అవి నితాంత హేమంత
హృదంతరంత రనుభవాళి
ఘనీభవించిన సమాధులు.
ఆ మనుష్యాస్థికలు
నిద్రిలో మునింగి
సంచరించును భైరవస్వప్నవీథి
అవిచలించును తమ
చర్మ కవచ మెపుడో
బ్రతికిన దినాల
తలపోత బరువుచేత
నా కనుంగవ కన్నీళ్లు తైకరంగు
నవ్వి యొనర్చెడు నీర వాహ్యానమెరిగి
ఇంత శోషిల్లునేలో
నా హృదయ పుటము
వణకునేటికో నా అస్థిపంజరమ్ము.

## ప్ర క ట న

అస్థికలు, సుప్తాస్థికలు! అయితే? అదా! సుప్తి. రాత్రి. చీకటి—నిశ్శబ్దం మరణం! ఎముకలు మరణానికి చిహ్నం కాబోలు. ఎవరి మరణం, ఏమిటిదంతా? ఇదంతా దేన్ని

గురించి? ఏదో ఉపద్రవం సంభవించినట్లు ఏమిటా రోదన నాదం? ఏం జరిగింది? అలా కొట్టుకుంటున్నాయేం మీ గుండెలు? ఏం ఘోరం? ఏం విపత్తు.? ఎవరు పోయారు? ఏమి టిదంతా? ఎవరు? ఎవరో మీఆత్మలకన్న ఆత్మీయుడూ ఆప్తుడూ ఎవరో మహాప్తుడో, మహాత్ముడో మీకు దూరం అయి పోయాడా? ఎవరికీ కనబడకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడా? ఇదంతా యేమిటి? ఎందుకీ యేడుపులు?

### విషాద కంఠాలు

ఏమని చెప్పమంటావు
ఎందుకేడుస్తున్నామో?
ఎందుకేడుస్తున్నామో
ఏమో మాకే తెలియదు!
ఏమిటిదంతా అంటావా?

ఏమో మాకూ తెలియదు!
ఎవరు? ఎందుకు? ఏమిటి?
ఇవన్నీ మాకేం తెలియదు.

ఎప్పుడు? ఎక్కడ? ఎలాగ?
ఏం ప్రశ్నలయ్యా! ఇవి?
నోరులేని గాలి నడుగు,

ఆవులించిన ఆకాశాన్నడుగు!
ఔను! ఘోరమే జరిగింది!
అనుకోనిదే నిజమయింది.

ఎందుకా ఏడుస్తున్నాం అని
ఇంకా అడుగుతున్నావా?
ఒకళ్లూ ఇద్దరూ కాదు
ఒక కుటుంబం ఊరూ కాదు
ఒక నగరం ఒక రాష్ట్రం కాదు
ఒక దేశం ఒక ఖండం కాదు
సమస్త ప్రపంచం నేడు
సమగ్రదుఃఖంలో మునిగిందయ్యా!
అమేయ మీ ఉపద్రవానిది
అంతర్జాతీయ పరిమాణం!
అమెరికాలో సాహుకారు,
ఆఫ్రికాలో నీగ్రో
భవనంలో మహారాజు
ఫ్యాక్టరీలో కూలీ
ఒకళ్లూ ఇద్దరూ కాదు
వందలూ వేలూ కాదు
ధరిత్రి ఈ కొసనించి ఆ కొసకి
దద్దరిల్లి పోయిందయ్యా!
ఇంకా ఏమని చెప్పమంటావు
ఎందు కేడుస్తున్నామో!
హిమాలయం మా
హృదయభారం!
గంగానది మా కన్నీళ్ళు!

## ప్ర క ట న

ఔను ఔను, నా కర్తవ్యమైపోయింది. మిమ్మల్ని ఓదార్చడానికి ప్రయత్నించను. అయినా ఇటు చూడండి, ఈ శ్మశాన ప్రశాంతిని! హెచ్చు తగ్గులులేని ఈ మైదానాన్ని చూడండి. మృత్యువు భయంకర మైనదని మీ ఉద్రేకం చెబుతుందేమో కాని ఈ ప్రాంతం ఎంత ప్రసన్నమో ఒక్కసారి ఆలోచించి చూడండి! ఎవరో ఇటువస్తున్నారు.

## స ం ధ్య

నేను సంధ్యని
దివసమ్మునకు వయోధికత
ప్రాప్తించినది
తీక్ష్ణ దీప్తు లడంగి దినరాజు
కృశియించె!
వృద్ధాహ్న మిడినదీ వెనచేత
జనియించి
ఔద్ధత్యమునచే అహర్పతిన్
మ్రింగితిని;
ఈ నా భవనమ్ములో కానంద
మొసగునా?
ఏ నెప్పటికి కూడ ఇటు
వికాసింతునా?
నా కే నిముస మేని

లేకుండునా మృతి
ఇట మాయమైన నాకెట
సమున్మేషమో?

## అంధకారం

నేను చీకటిని
ఈ దివారోచిస్సుధా
ధామమును గూల్చి,
ప్రాదుర్భవించి నే
బయలుదేరినయంత-
జగతి యేమోకాని
నగవే మరచిపోయి,
పగపుచే నిట్టూర్చి,
వగలచే తపియించు:
నా మేలి ముసుగులో
నలుపు లూరెడు నంట,
నామీద జగతి కింతయు
ప్రేమలేదంట !

## నక్షత్రం

నేను నక్షత్రాన్ని.
నీలోత్పల నికాశ
మా నిశీథమునుండి
ఎలుగెత్తి యేడ్తు
నెందుల కంధకారమా?

వాగులైనా ప్రేమ
నరియించు నేనిన్ను,
స్వాగతమ్మొసగు
నాశాగంధ వాయువుల్ !
నిలువలేనే నీవు
నిలిచియుండని వేళ!
వెలుగలేనే నీవు
విస్తరిల్లని వేళ!
నీ కాటుకలచేత నాకనుల్
వికసించు !
నీవు నేనే్న నాకు నీవె
ఈ లోకాన !

ప్రకటన: మృత్యువు జగద్విజేత కావచ్చును. కాని మరణాన్ని ప్రేమ జయిస్తుంది.

ఒకగొంతు: సకల ప్రాణులనూ సమానంగా ప్రేమించ గలిగిన వ్యక్తికి మరణమా? ఇది నిజమని ఎలా నమ్మడం?

రెండవ: పుష్పక విమానంలోవలె అతని హృదయంలో ఎంద రధివసించినా ఇంకా స్థలం ఉండనే ఉంటుంది.

మూడవ: ఎన్ని గ్రంథాలు చదివినా మానవ మేధస్సులో ఇంకా కొత్తభావాలకి తావున్నట్లు.

బృందగీతి

చీకట్లతోటలో కన్నీటిలోయ
కన్నీళ్ళ లోయలో, కారుణ్యరేఖ.

పాపాల కోనలో
పసిపాప నవ్వు
చీకట్ల కోటలో
చిన్నారి వెలుగు
మృత్యు నిశ్శబ్దాన
మృదు జీవ రవళి
ఎముకల నిద్రలో
ఇంపైన కలలు.

ప్రకటన: అదుగో! అదుగో! అటు చూడండి. భయంకర చితాగ్ని జ్వాలలనుండి పైకి లేస్తున్న ప్రశాంత తేజాన్ని చూడండి! అతని భౌతిక శరీరం అగ్ని కాహుతి అయింది. అతని అనశ్వరాత్మ ఆకాశాల నాక్రమించింది.

బృందగీత

అతడు సామాన్య వ్యక్తి
అత డసామాన్య వ్యక్తి
తృణం కన్నా తేలిక
మేరువు, కంటే ధీరుడు!
అగర్భ శ్రీమంతుడు!
నిత్య దరిద్ర నారాయణుడు

వయస్సుమీరిన బిడుగు,
వయస్సులేని నిసువు!
అన్యాయం సమక్షంలో
అగ్ని మహోదగ్రమూర్తి
చరాచర ప్రపంచానికి
క్షమా మార్గదర్శి
అత డిప్పుడు లేడు
అత డెప్పుడూ ఉన్నాడు
అమరత్వం అందుకున్న
అతనికి మా నతులు!

ప్రకటన: అరే! ఎవరూలేరే? ఎంత శూన్యంగా వుందో ఈ స్థలమంతా? ఏదీ చితి, ఏదీజ్వాల? ఏవీ అస్థికలు? ఏవీ బూడిద? ఏవీలేవే? అన్ని వస్తువులూ తమ ఆకారాన్ని పరిత్యజించినట్టుందే? అంతా శూన్యాకాశం! నిర్జన నిర్జీవ నిరుపాధిక నిశ్శబ్దం! (క్షణం నిశ్శబ్దం) ఈ నిరవధిక నిశ్శబ్దంలో......ఏమిటో గుసగుసలు. వెలుగూ చీకటీకాని, బుద్ధికీ కంటికీ అందని ఈ విచిత్రాకాశపథంలో ఒక సోదర తార సహస్రకోటి యోజనాల దూరంలో ఉన్న ఇంకొక సోదరీ తారతో సంభాషిస్తోంది.

౧వ తార: అక్కా! ఓసేచుక్కా!
౨వ తార: ఏం తమ్ముడూ!
౧వ తార: అదేమే అలా తుళ్ళిపడి లేచావూ?

౨వ తార: ఏం లేదు. నిద్రపోదూ!

౧వ తార: మరి నువ్వెందుకు మేలుకున్నావూ?
ఎందుకే అలా వణుకుతున్నావు?

౨వ తార: ఏం లేదు. పడుకుందూ, ఏమిటో
నిద్రలో వినబడింది.

౧వ తార: ఏమిటే అక్కా, ఏమిజరిగిందేమిటి?
ఏం వినబడింది నీకు?

౨వ తార: అబ్బ! ఏం లేదు పోనిద్దూ!

౧వ తార: కాదే, చెప్పవే?

౨వ తార: ఏముంది లెద్దూ, ఎక్కడో భూగోళంలో, మినుకు మినుకుమనే భూగోళంలో, సరిగ్గా కనబడీ కనబడని భూగోళంలో—

౧వ తార: ఆఁ—ఆఁ, ఏమయిందే?

౨వ తార: భూగోళం మీద హస్తినాపురం అనే ఊరుంది. దాని ప్రస్తుతం పేరు నాకు తెలియదు……… వింటున్నావా?

౧వ తార: ఆఁ—వింటున్నాను. హ స్తి నా పురం అనే ఊళ్ళో—

౨వ తార: నాలుగు సార్లు రివాల్వరు పేలుడు వినిపించింది.

౧వ తార: రివాల్వారా? రివాల్వారంటే ఏమిటే?

౨వ తార: రివాల్వారంటే తెలియదూ? ఆటం బాంబుకి ముత్తాత.

౧వ తార: ఆటం బాంబు అంటే ఏమిటి?

౨వ తార: అబ్బ ఊరుకుందూ! నీప్రశ్నలకు జవాబు చెప్పలేక పోతున్నాను.

౧వ తార: పోనీలేవే, అక్కా! పోనీ, ఇది చెప్పు! నాలుగు మోతలు వినడంవల్లనా నీకు నిద్రాభంగంఅయింది?

౨వ తార: కాదు తమ్ముడూ! వినుమరి! ఆ రాక్షస ధ్వనుల నాల్గింటినీ మరో నాలుగు అక్షరాలు, రెండు రెళ్ళు నాలుగక్షరాలు ఎదుర్కొన్నాయి! ఎంతపెద్ద యుద్ధమను కున్నావు? ఇప్పటికీ జరుగుతూనే ఉంది! హింసకీ అహింసకీ యుద్ధం! అబ్బా. ఇంకా వినబడుతూనే ఉంది! ఎలా కొట్టుకుం టున్నాయో నా గుండెలు!

౧వ తార: ఏమిటే ఆ అక్షరాలు నాలుగూ?

౨వ తార: "హేరాం! హేరాం!" అని.

౧వ తార: అంతేనా అక్కా? అంతేనా? నాలుగు మార్లు రివాల్వారు చప్పుళ్ళు "హేరాం హేరాం" అనే గద్గద స్వరాలు! అంతేకాదూ, అంతేనా?

౨వ తార: అంతే అనా అడుగుతున్నావు తమ్ముడూ! అలా ఆవలిస్తున్నావేం?

౧వ తార: అబ్బా, నిద్దరొస్తోందే!

౨వ తార: నీ కెలా నిద్దరపడుతోందిరా తమ్ముడూ (పరిత్రాణాయ సాధూనాం...)

ప్రయోక్త: ఏ దంత కాష్టం? ఈ రాత్రిపూట దంత కాష్టం గొడవెందు కొచ్చింది?

ఆటంకం: మీ రిప్పుడు చెపుతున్న ఆసామీ సంగతి. మీరతనికి మూడు పేర్లిస్తే నేను నాలుగోపేరు పెట్టాను. మందహాసం వురఫు గడిమూరం వురఫు కుతూహలం మన విదూషకు డేమౌతాడు? ఆఖరికి ఆత్మహత్య చేసుకుంటాడా? అది మొదట చెప్పండి.

ప్రయోక్త: అతను ఆత్మహత్య చేసుకోడం అప్పుడే అయిపోయింది.

ఆటంకం: ఎప్పుడు? ఎప్పుడు? నేను వినలేదే?

ప్రయోక్త: నువ్వు వినకుండా ఎన్నో గానసభలు జరిగి పోయాయి. హరికథలూ, యక్షగానాలూ అయిపోయాయి. నువ్వు వినగలేదని రైల్వే ప్లాట్‌ఫారాలమీద పీడు కోలుపులూ, శాసన సభలో చర్చలూ, పబ్లిక్ టెలిఫోనులో ప్రైవేట్ సంభాషణలూ ఆగిపోలేదు. "మృచ్ఛకటికం" అన్న పేరు విన్నావా?

ఆటంకం: విన్నానుగాని మీ ప్రసంగానికి ప్రస్తుత సందర్భానికీ శుద్ధిమాత్రం సిద్ధించలేదని ముకుళితకరాలతోనే కాక ముక్త కంఠంతో కూడా ఘోషించడం మానలేక పోతున్నాను.

ప్రయోక్త: మానొద్దు. అవశ్యం ఘోషించు.

ఏమన్నావూ? అప్రస్తుతంగా, అసందర్భంగా వుంది నా ప్రసంగం?

ఆటంకం: అవును. కావాలని కాకారుడిలాగ మీరు మాట్లాడ దలచుకుంటే తప్ప.

ప్రయోక్త: నన్నుకూడా నువ్వు నువ్వే అను. మీరు బహువచనం. నేను ఒక్క మనిషి నే. ఏకవచనంచాలు.

ఆటంకం: గౌరవార్థకం.

ప్రయోక్త: తేసీటి విందు. దానికేం. ఈ మృచ్ఛకటికం ఉందే–

ఆటంకం: ఉంది.

ప్రయోక్త: ఉందీ?

ఆటంకం: ఉంది. ఉన్నది. ఉన్నయది. ఉండినయది.

ప్రయోక్త: ఉండినయదియకాక ఉండెడునదీయును! అన్నటికీ ఇన్నటికీ ఎన్నటికీ కూడా.

ఆటంకం: మీరు–కాదు నీవు. మాటలాడుచున్న యది తెనుగే యటందువా?

ప్రయోక్త: దయచేసి నా మాటల్లో తప్పు పట్టడం మానెద్దూ.

ఆటంకం: వ్యాకరణ గొడవ మొదలెట్టిందెవరు?

ప్రయోక్త: మొదలెట్టితేనేం? పిదప దించెయ్య కూడదా?

ప్రయోక్త: ఏ దంత కాష్ఠం? ఈ రాత్రిపూట దంత కాష్ఠం గొడవెందు కొచ్చింది?

ఆటంకం: మీ రిప్పుడు చెపుతున్న ఆసామీ సంగతి. మీరతనికి మూడు పేర్లిస్తే నేను నాలుగోపేరు పెట్టాను. మందహాసం ఫురఫు గడీ యూరం ఫురఫు కుతూహలం మన విదూషకు డేమౌతాడు? ఆఖరికి ఆత్మహత్య చేసుకుంటాడా? అది మొదట చెప్పండి.

ప్రయోక్త: అతను ఆత్మహత్య చేసుకోడం అప్పుడే అయిపోయింది.

ఆటంకం: ఎప్పుడు? ఎప్పుడు? నేను వినలేదే?

ప్రయోక్త: నువ్వు వినకుండా ఎన్నో గానసభలుజరిగి పోయాయి. హరికథలూ, యక్షగానాలూ అయిపోయాయి. నువ్వు వినగలేదని రైల్వే ప్లాట్ఫారాలమీద వీడు కోలు పులూ, శాసన సభలో చర్చలూ, పబ్లిక్ టెలిఫోనులో ప్రైవేట్ సంభాషణలూ ఆగిపోలేదు. "మృచ్ఛకటికం" అన్న పేరు విన్నావా?

ఆటంకం: విన్నానుగాని మీ ప్రసంగానికీ ప్రస్తుత సందర్భానికీ శుద్ధిమాత్రం సిద్ధించలేదని ముకుళితకరాలతోనే కాక ముక్త కంఠంతో కూడా ఘోషించడం మానలేక పోతున్నాను.

ప్రయోక్త: మానొద్దు. అవశ్యం ఘోషించు.

ఏమన్నావూ? అప్రస్తుతంగా, అసందర్భంగా వుంది నా ప్రసంగం?

ఆటంకం: అవును. కావాలని శ్రీకారుడిలాగ మీరు మాట్లాడ దలచుకుంటే తప్ప.

ప్రయోక్త: నన్నుకూడా నువ్వు నువ్వే అను మీరు బహువచనం. నేను ఒక్కమనిషి. నే. ఏకవచనంచాలు.

ఆటంకం: గౌరవార్థకం.

ప్రయోక్త: తేనీటి విందు. దానికేం. ఈ మృచ్ఛకటికం ఉందే–

ఆటంకం: ఉంది.

ప్రయోక్త: ఉందీ?

ఆటంకం: ఉంది. ఉన్నది. ఉన్నయది. ఉండినయది.

ప్రయోక్త: ఉండినయదియకాక ఉండెడునదీయును! అన్నటికీ ఇన్నటికీ ఎన్నటికీ కూడా.

ఆటంకం: మీరు–కాదు నీవు. మాటలాడుచున్న యది తెనుగే యటందువా?

ప్రయోక్త: దయచేసి నా మాటల్లో తప్పు పట్టడం మానెద్దూ.

ఆటంకం: వ్యాకరణ గొడవ మొదలెట్టిందెవరు?

ప్రయోక్త: మొదలెట్టితేనేం? పిదప దించెయ్య కూడదా?

ఆటంకం: సరే దించేదాం: ఉభయులం ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేసే దేమిటంటే-

ప్రయోక్త: యావన్మంది! కర్ణకఠోరమైన అపశబ్దాలు కావాలని వాడుతున్నావు. శుక్రాక్షికళేభరాన్నపతీ!

ఆటంకం: త్రైలోక్య ధామోదరా. యావన్మందినీ కాశైన్య జాడ్యం. తెలుగువాళ్లు యావన్మందీ యావన్మంది అని వాడుతారు. మనం జపం విడిచి లొట్టలు వెయ్యడం మానేద్దామా? వద్దా? విషయం విదూషకుడి ఆత్మహత్య. దానికీ మనం మాట్లాడుతున్న దానికీ ఎక్కడా లంగరందలేదు.

ప్రయోక్త: పోనీ ఈ సారి మళ్ళీ తొలినుంచీ ప్రారంభించనా?

ఆటంకం: వొద్దు. ఆఖరిసారి నువ్వు ప్రారంభించడం అయిపోయింది. నేను ప్రారంభిస్తే అది మొదటిసారి అవుతుంది.

ప్రయోక్త: అదే ఆఖరిసారి కూడా కావాలి. ఆరంభించు.

ఆటంకం: ఆలాగే అంతా వినండయ్యా. సైలెన్స్ కామోష్. తెలుగులో అయితేష్. (తలుపు తట్టిన చప్పుడు) ఏమిటా చప్పుడు.

ప్రయోక్త: ఎవరో తలుపు కొడుతున్న చప్పుడు.

ఆటంకం: ఇంకా ప్రారంభించలేదు. ష్. కామోష్. (చప్పుడు ఆగుతుంది.) విదూషకుడి ఆత్మహత్య. రేడియో

నాటకం. టెలిఫోను సంభాషణ, మృచ్ఛకటికటికం. ఏక వచనం. బహువచనం.

ప్రయోక్త: నువ్వెంతా పాగు చేస్తున్నావు. ఇది రేడియో నాటకమని ఎవరన్నారు?

ఆటంకం: నేనే, నిజం చెబితే నిష్ఠూరం. హాస్యానికైనా అబద్ధాలాడ కూడదు.

ప్రయోక్త: ఇది రేడియో నాటకమే అనుకో, కాని ఇంకా ప్రారంభం కాలేదు.

ఆటంకం: ఇంకో అబద్ధం. అప్పుడే ప్రారంభమై అయిదు నిముషాలు దాటింది. అదుగో గడియారం!

పిలుపు—సత్యం: గడియారం! గడియారం!

తలుపు: (తట్టిన చప్పుడు)

ప్రయోక్త: నాటకం ప్రారంభమయింది. గడియారం గారి ఇంటి ముందర నిలబడి ఎవరో ఇద్దరు తలుపు తడుతున్నారు.

ఆంజనేయులు: తలుపు తలుపు. (చప్పుడు)

సత్యం: ఏమండో గడియారంగారూ.

పొరుగింటావిడ: (దూరపు గొంతుక) వాళ్ళెవరూ ఊళ్ళో లేరండి. ఇల్లు తాళం వేసుకొని ఏవూరో వెళ్ళారు.

ఆంజనేయులు: తాళం అంటుంది. లోపల గడియ వేసుంటే.

ఆటంకం: ఎవరావిడ?

ప్రియోక్త: పొరుగింటావిడ.

సత్య: ఎవరూ లేరంటూందేమిటి? లోపలెవరో ఉండి తీరాలి. తలుపు తలుపు. (దబదబా చప్పుడు)

పొరుగింటావిడ: గడియారంగారు పెళ్ళాం పిల్లలతో నిన్న సాయంత్రం, రైలు కెళ్ళారు. మీరెంత పిలచినా ఎవరూ పలకరు. తలుపు తాళం కనబడదు?

ఆంజనేయులు: తలుపూ? తాళం? లేదంటే?

ఆవిడ: తాళం లేదూ? (సమీపించి) రాత్రికి రాత్రి మళ్ళీ వొచ్చాశారేమిటి చెప్మా. ఊరికెళ్ళడం మానేసి? ఈ గడియారం ఒక విడ్డూరపు మనిషి. (తలుపు తడుతుంది) శాంతమ్మా, శాంతమ్మా.

సత్యం: ఇంట్లో అలికిడేఁవీఁ లేదు!

ఆవిడ: నెల్లాళ్ళ దాకా రానని చెప్పి మరీపోయారు. అప్పుల వాళ్ళబాధ తప్పించుకుందామని లెండి. పాపంచాలా హింస పడ్డారు. ఎవరికైనా వస్తాయి కష్టాలు. కాని వీళ్ళ లాగ బాధలు పడుతున్నవాళ్ళ నెక్కడా చూడలేదు. పదేళ్ళ నించీ ఎరుగుదును కదా. ఒక్కనాడైనా వాళ్ళు సుఖంఅంటే ఏమిటో ఎరగరు. ఏడాది కిందట రెండో అబ్బాయి చనిపోయి నప్పుడు పాపం శాంతమ్మ మంచంపట్టి ఇప్పటికీ తేరుకోలేదు. ఎలా కాలక్షేపం చేస్తోందో ఇంత దరిద్రంలో, పగవాడికైనా వొద్దుబాబూ అలాంటి కష్టాలు.

ఆటంకం: నీకన్న నయం. నిమిషంలో గడియారం సంసారం కథంతా పూస గుచ్చినట్టు చెప్పేసింది. నువ్వు నీళ్లు నములుతూ చిన్నపిల్లలనీ, నీసపద్యాలనీ ఒహ తికె తెమిల్చేవి కావు.

ప్రియోక్త: అందుకే ఆడవాళ్ళని అన్ని ఉద్యోగాల లోకి ఆదరించి తీసుకుంటున్నారు.

సత్యం: ఆంజనేయులూ, మరిప్పుడేం చేద్దాం? ఇంట్లో తలు పేసు కూర్చున్నాడు. ఎంత పిలచినా పలకడు.

ఆంజనేయులు: నిద్రపోతున్నాడేమో?

సత్యం: పొద్దెక్కి పోయినా యేమిటా మొద్దునిద్దర.

ఆవిడ: మీకూడా యేమైనా బాకీ వున్నాడా గడి యారంగారూ? తెల్లారేసరి కొచ్చిపడతారు ఎక్కడలేని అప్పులవాళ్ళూ. ఒక్కొక్కప్పుడు గడియారం నాలుగైదు రోజులు కనబడకుండా మాయమయి పోతూవుంటాడు. ఇంట్లో దమ్మిడీయేనా యిచ్చి వెళ్ళడు. ఇవ్వడాని కేమయినా వుంటేనా? మాలాంటి వాళ్ళం అడపా దడపా ఆదుకుంటే మాత్రం? ఎంతో ప్రాణంమ్మీదికొస్తే తప్ప ఇరుగింటిగుమ్మం తొక్కదావిడ. ఏరోజు కారోజు వొచ్చేపోయే యిములాళ్ళకి జవాబులు చెప్పలేక పాపం ఆ ఇల్లాలు సతమత మయిపోతూ వుంటుంది.

ఆంజనేయులు: శాంతమ్మ మా చెల్లెలేనండి.

పొరుగింటావిడ: శాంతమ్మ అన్నగారా మీరు. క్షమించండి. తెలియక ఏవేమిటో నోటి కొచ్చిందల్లా వాగే శాను. అన్నట్టు, శాంతావాళ్లూ మీ వూరికే బయల్దేరి ఉండాలే.

ఆంజనేయులు: ముందుగా ఉత్తరమ్ముక్కైనా రాసి పారేశాడు. దౌర్భాగ్యుడు.

సత్యం: ఇంటిల్లిపాదికీ రైలు టిక్కెట్లకి పొయ్యాక పోతే ఆ డబ్బుతో కొంత అప్పు తీర్చుకోవచ్చునే?

ఆవిడ: అవి తీరే అప్పులు కావండీ. గడియారం ఈ వీధంతటికీ బాకీ, ఈ వూరంతటికీ బాకీ. అలాగని ఆయనికిదు గలవాళ్లేవీ లేవుసుమండీ. నాటకాల్లో వేషాలువేసే తతిమ్మా వాళ్ళందిరిలాగా.

ఆటంకం: ఈ తలుపుల దగ్గర పాట ఇంతటితో పూర్తయ్యేటట్టు లేదు. నువ్వొక్కడి ప్రొడ్యూసరివయ్యా. ఇంతసేపు సస్పెన్స్ నిలుస్తుంది? ఆ ఇంట్లో విదూషకుడు చచ్చిపడి వున్నాడని యీ పాటి కందరికీ తెలిసిపోయుంటుంది. వేగిరం తలుపులు బద్దలు కొట్టి చు. ఉరిపోసుకుని వేలాడుతూ వున్న విదూషకుణ్ణి చూసి పొరిగింటావిడ వేసే గావుకేకకి మైయికు బద్దలై పోవాలి. అదీ డ్రామా అంటే. గాలిప్రోగు చేసి నాటకం వేస్తే సరా.

ప్రయోక్త: క్వయిట్ ప్లీజ్. గంగాధరం ఉరి పోసుకొని చచ్చిపోయాడని నీకెవరు చెప్పారు. విషం తాగాడు.

ఆటంకం: కొత్తగా ఈ గంగాధరం ఎవరు?

ప్రియోక్త: విదూషకుడు. నేను సృష్టించిన పాత్రకి నా యిష్టం వచ్చినపేరు పెడతాను. ఇష్టం వచ్చినన్ని పేర్లు పెడతాను.

ఆటంకం: నే నెవరి నడగడానికి? అంతేనా సాధారణంగా లోకంలో ఒక మనిషికి ఒక పేరుండడం రివాజు.

ప్రి: నువ్వు చూసింది చాలా చిన్నసైజు లోకం అయ్యుండాలి. మన్మథుడి కెన్ని పేర్లో తెలుసునా?

ఆటంకం: మన్మథుడిది మన లోకంకాదు.

ప్రి: తెలుగుకి పర్యాయ పదాలు తెలుసా?

ఆటంకం: అది భాష. నేను మాట్లాడేది మనుష్యుల సంగతి.

ప్రి: కొండడూ, కరుణాకరుడూ, పురుషోత్తముడూ తెలుసా.

ఆ: అది సినిమా.

ప్రి: ఇది రేడియో.

ఆ: అంచేత లైసెన్సు.

ప్ర సైలెన్సు. పొరుగింటావిడ వెళ్ళిపోయింది.

ఆ: ఔను పాపం. ఎంతసేపని పరాయిమొగాళ్ళతో నడివీధినిల్లబడి మాటాడుతుంది.

ప్రి: అనవసరంగా ఆవిడ శీలమ్మీద అక్షింతలు వెయ్యకు. ఇలాంటి దుర్మార్గపు కూతలు ఆ యిల్లాలు చెవిని పడితే యేమను కుంటుంది?

ఆ: కన్యాశుల్కంనుంచి కాపీ కొట్టావనుకుంటుంది.

ప్ర: బాహ్రో, వాఁరెవా, బాపురే, బాగాఅన్నావు. కన్యాశుల్కం అంటే జ్ఞాపకం వొచ్చింది. ఇందాకా మృచ్ఛకటికం మాటెత్తాను. ఎందుకో ఎరుగుదువా?

ఆ: ఏమో నాకేం తెలుసు.

ప్రి: మన కోలాహలం ఆ నాటకంలోనే మొదటి సారిగా పైకొచ్చాడు.

ఆ: అయిదు.

ప్రి: అయిదూ. ఏమిటైదు, అణాలా? వోట్లా? కర్పూరపు దండలా?

ఆ: దండలుకావు. పేర్లు. విదూషకుడిపేర్లు, కోలాహలం అయిదు. దంతకాష్ఠం కూడా కలుపుకొంటే ఆరు.

ప్ర: నువ్విచ్చిన పేరుగాని, సవరణగాని నేనుపయోగించను.

ఆ: పోనీ, అవన్నీ నాకే మిగులు. తరువాతఏమైంది?

ప్రి: తరువాత? దేనితర్వాత?

ఆ: అట్టహాసం మృచ్ఛకటికంలో పైకొచ్చిన తర్వాత.

ప్రి: అట్టహాసం అంటే మందహాసం అనేనా నీవుద్దేశం? నా విదూషకుడికి నీవేరేదీ అతికించొద్దని చెప్పలేదురా? అయిదు పేర్లిచ్చాను కదా వాటిలో ఏదేనా వాడకూడదా?

ఆ: గడియారం వాడుకోవచ్చునా?

ఆంజ: గడియారం. గడియారం. తలుపు గట్టిగా తొయ్యరా సత్యం. నీది గడియ వెయ్యనట్టుంది. అడ్డుగడియ యొకటే వేసుంది. (తలుపు తెరచుకు చప్పుడు)

ఆ. అంతట విదూషకుడు మరణించి ప్రవేశించును. (స్ట్రాప్ అండ్ స్టాడ్ మ్యూజిక్)

ప్రి. ఇక నువ్వు మాట్లాడ్డం మానేసి రంగుకడిగేసుకోవచ్చు. వేళాకోళాలవేళ దాటిపోయింది. మరణం సమక్షములో వినయం అవసరం. (ఆంజనేయులూ, అతని స్నేహితుడూ ఇంట్లో ప్రవేశించి విషంతాగి చచ్చిపోయున్న విదూషకుణ్ణి చూశారు. విదూషకుడు చనిపోవడానికి ముందు రాసి పెట్టిన ఉత్తరం వాళ్ళకి కనబడింది.) ఉత్తరం.

ఉత్తరం; (విదూషకుడి గొంతుకతో) మై డియర్ ఆంజనేయులూ!— నేను నిష్క్రమిస్తున్నాను. ఇవాళ నేనుపుట్టిన రోజు; అందుచేత పోతున్నా. (ది మ్యూజిక్ కంటిన్యూస్.) మరణానికి ఇవతల వేవున్నంతకాలం నేను, చిరునవ్వుని, ఆరాధించాను. చిన్నప్పుడు మృచ్ఛకటికంలో వేషం వేసింది మొదలుకొని, మొన్నరాత్రి కన్యాశుల్కంలో బైరాగి వేషం వేసినదాకా, లోకాన్ని నవ్వించడానికే ప్రయత్నించాను.

వెళ్ళిపోతున్నాను. ఒక్కసారి వెనక్కు తిరిగి నా యాభై యేళ్ల జీవితాన్ని చూసుకుంటే, నాక్కనబడు తున్నది. అమాయకత్వపు ఆకుపచ్చదనం ఒక్కటే.— అదేనా స్పష్టంగా కాదు. నిరవధిక మయిన నా యాభై యేళ్ళ నిరాశ మధ్య, ఆనంద సమయాలేవైనా అనుభవించానా అని ఇప్పుడాలోచిస్తే దుఃఖానికి, సౌఖ్యానికి మధ్యవున్న సన్నని సరళరేఖ కరిగిపోయి కరిగిపోయి అంతా అనంత వైశాల్యంగా కనబడుతోంది. ఇందులో నేను రంగస్థలం మీద విదూషకుడుగా నిలబడి లోకాన్ని నవ్వించడానికి పడ్డబాధా. పరమ దరిద్రంలో సహా అమిత వేగంతో ఎదుగుతూన్న నా పిల్లల్ని చూసుకుంటూ ఉంటే కలిగే-సంతోషమూ, ఒక్కలాగే కనబడుతున్నాయి.

ఆ: ఈ రంగం ఉత్తరానికిక అంతం అంటూ లేదేమిటి?

ప్రే: మళ్ళీ అడ్డొచ్చావ్. నిన్ను వెళ్ళిపొమ్మని చెప్పానే.

ఆ: ఎక్కడికి పోతాను ఈ సుఖదుఃఖాల సమచతురస్రపు వైశాల్యాన్ని వదలిపెట్టి.

ప్ర: ఎక్కడైనా పో, ఎడారిలోని గుడారంలోకి. కన్యాశుల్కంలోని పంచమాంకంలోకి. తురుఫు మణీలాకి ఇస్పేటాసుకి మధ్యనున్న ఇరుకు స్థలంలోకి. బస్సు స్టాండునద్ద, రేషన్ షాపుముందు, సినిమా హాలుదగ్గర క్యూలో నిలు. జూలో కలు. యెక్కడైనా పో ఇక్కడ మాత్రం వద్దు.

ఆ: కొంచెంసేపు ఆ విదూషకుడి పాత్ర నన్ను అభినయించనిస్తే ఇంతకన్న రసవంతంగా ఆత్మహత్య చేసుకుంటానని. హామీ యిస్తా.

ప్ర: స్వామీ, నీ హామీయేమీ మాకక్కరలేదు. నాటకం సాగకుండా ఆటంకం యేమిటి? దయచేసి అనువ్వ దయచేస్తే సంతోషిస్తా.

ఆ: నేను దయచేసే వున్నాను. ఇక దయచెయ్యను. ఒక్కరవంతసేపు నన్ను బతికున్న విదూషకుడిగా ప్రవర్తించనియ్యమని బ్రతిమాలుకుంటున్నా.

వి: నా పాత్ర మరోడు నటిస్తే ఒప్పుకోను.

ఆ: నువ్వు చచ్చిపోయావు. కాబట్టి మాట్లాడ్డానికి వీల్లేదు. నువ్వొక్కడివే విదూషకుడివైనట్లు మాట్లాడతావేమిటి?

విదూ: ఈ నాటకంలో నేనొక్కణ్ణే విదూషకుణ్ణి.

ఆ: అయ్యా. ప్రయోక్తగారూ, చూశారా యీ అరాజకం. ఊరుకోబెడతారా లేదా?

విదూ: నేను ప్రాచీని కాను గడియారాన్ని.

ఆ: ఇంత అసందర్భపు నాటకం నేనెక్కడా చూడలేదు. అయినా ఆఖరిదాకా ఆగడం మానలేను. విదూషకుడి ఆత్మహత్య! అంతాదగా. విదూషకుడూ లేడు.

విదూ: ఉన్నాను. ఆత్మహత్య కూడా చేసుకున్నాను.

సత్యా: స్వయంగా అతనే చెబుతూఉంటే నమ్మక పోవడం తప్పు.

ప్ర. నాటకం ముగిసింది.

ఆ: నాకు నమ్మకంలేదు. నాటకం ముగిసినట్టు ఏమిటి నిదర్శనం? గడియారాన్ని గంట కొట్టేయమను. లేదా ఆంజనేయుల్ని భరతవాక్యం పాడమను. కాదా పౌరుగింటా విడని మంగళహారతి పట్టమను.

ప్రి: నేను నాటకం అయినదని చెప్పాను. మీరింకా ఆడితే నా పూచీ లేదు.

ఆ: నువ్వెంత ప్రియోక్తవైనా నాటకాన్ని మధ్యలో ఆపేయడానికి నీకు హక్కు లేదు. ఏఁవంటావు ఆజంజనేయులూ?

సత్య: ఆంజనేయులు వెళ్ళిపోయాడు.

ఆ: ఏఁవంటావు చిదంబరం?

సత్యం: చిదంబరం అనే మనిషెవడూ ఇక్కడ లేడు.

ఆ: లేకపోతే ప్రవేశపెట్టండి. లేకపోతే ఈ గడియారానికే ఆదింకో పేరనండి. ఏఁవైనా చెయ్యండి. కాని నాటకం ఆగడానికి వీల్లేదు. ఇక్కడ ఇప్పుడు విదూషకుడి ఆత్మహత్య జరిగి తీరవలసినదే.

విదూ: అదెప్పుడో జరిగిపోయింది.

ఆ: నే నరగంట సేపటినుంచి చూస్తున్నాను. ఇక్కడెవరూ ఆత్మహత్య చేసుకోలేదు. నువ్వబద్ధం ఆడకుండా చెప్పూ. బైరాగిలాగ దొంగసాక్ష్యం చెప్పావంటే ఒప్పుకోను.

విదూ: వొద్దు.

ఆ: అయితే నిజం చెప్పు.

విదూ: ఔను.

ఆ: ఔను. ఏఁవిటౌను? నువ్వు బతికున్నట్టా? చచ్చి లేనట్టా?

విదూ: బతికి చచ్చిపోయాను. చచ్చిబతికిపోయాను.

ఆ: ఇలాంటి పేచీలు నాదగ్గర పనిచెయ్యవు. నేను చూస్తుండగా యెవరో ఒకరు చచ్చిపోవాలి. అంతదాకా నాటకం అయిందని నే నొప్పుకోను.

ప్రి: హా ! (చచ్చిపోతాడు)

ఆంజ: ప్రియోక్త ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆ: అంతటితో నా ఆటంకం తీరిపోయింది. ఇప్పుడు నాటకం అయిపోయిందని ఒప్పుకున్నాను.

# గ్రామఫోను రికార్డుల తిరుగుబాటు

సూత్రధారుడు :

రేడియోవాళ్ళం మేము ఎంత జాగ్రత్త పడుతున్నా, మానవ మాత్రులం కాబట్టి ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడు అనుకున్న కార్యక్రమం అనుకున్నట్లుగా నడవదు. ఏదో ఒక విపరీతం సంభవించి కార్యక్రమం తలకిందులవుతుంది. ముఖ్యంగా నాటకాలు వేసేటప్పుడు గ్రంథకర్త సకాలానికి నాటకం వ్రాసి ఇవ్వకపోవడం మొదలుకొని ప్రధాన పాత్రధారి సమయానికి జబ్బు పెట్టుకోవడందాకా ఎన్నో అనుకోని అవాంతరాలు బయలుదేర వచ్చును. అటువంటి ఇబ్బందులేవీరాకుండా ఈ "తుదిపలుకు" అనే నాటికను ముందే రికార్డుచేసి ఉంచాము. ఇప్పుడు వెయ్యబోయేది మొదటిరికార్డు మొదటి పక్క. ఉపోద్ఘాతం అనవసరం. సావధానంగా వినండి.

(ఒక రికార్డు వేస్తాడు. భయపడుతూ పొరపాటు జరిగిందని గ్రహిస్తాడు. రికార్డు ఆపివేస్తాడు)

ఉపోద్ఘాతం అనవసరం అన్నాను. పొరపాటు. - పొరపాటు జరిగినప్పుడు ఒప్పుకోవలసిందే. "తుదిపలుకు" కు తొలిపలుకు అవసరమయింది. నాటకం మీరే వింటారు. మంచి చెడ్డలు మీరే నిర్ణయించుకుంటారు. అప్పుడప్పుడు కార్యక్రమం అనుకోకుండానే మారిపోతుందన్నానే, అటువంటి సందర్భాలలో వినేవాళ్ళ అదృష్టాన్నిబట్టి మొదటిదానికంటె

కూడా, మారిపోయిన కార్యక్రమమే రక్తికడుతుంది. అంటే ఇప్పుడు నేను అదృష్ట పరీక్ష చేస్తాననికాదు. తప్పకుండా ఇప్పుడు వేసేది "తుదిపలుకు" నాటకమే. ఇక నిరభ్యంతరంగా వినండి.

(ఇంకొక రికార్డు వేస్తాడు. విలక్షణమైన సంగీతం. కారణం విరిగిన రికార్డు)

సూత్రధారుడు :

(రికార్డు ఆపి) మీరసాస్వాదనకు అడ్డువచ్చినందుకు క్షమించండి. రాక తప్పిందికాదు. ఈ సంగీతానికి కొంచెం వ్యాఖ్యానం అవసరమయేటట్లు ఉంది. ఇది నవీన సంగీతం. రాగం, తాళం, లయ, శృతి అన్నీ సరికొత్తరకాలివి. ఇది సూచిస్తుంది కాని ఆపరించదు. కాని ఆ సూచనకు ఆవరణాలు లేవు. సంగీతం మరపింకూడదు. జ్ఞాపకం చెయ్యాలి. ఈసంగతి మాత్రం మరచిపోకండి. మరి వినండి.

(ఇంకొక రికార్డు వేస్తాడు. ఈ సారి అరవపాట. ఆపి వేస్తాడు.)

సంగీతానికి భాష ప్రతిబంధకం కాదని ఋజువుచెయ్యడానికి ఇందులో అరవమాటలు చొప్పించినట్లు మీకు వేరేబోధపరచ నక్కరలేదు. నాటకంలో మొదటిభాగం అంతాఇలాగే అమోఘమై, అగమ్యగోచరమైన సంగీతంతో నడుస్తుంది. వినూత్న భావాలతో నిండిన ఈ సంగీతం సుశిక్షితంకాని చెవులకు కఠోరంగా వినబడవచ్చును. అందుకే ఇందలి విశిష్ట మాధుర్యాలను విశదం చెయ్యడానికి మధ్య మధ్య నేనుజోక్యం

కలిగించుకోవడం తప్పనిసరి అవుతోంది. సాధ్యమైనంతమట్టుకు సంగీతాన్ని ముందుపెట్టి నేను వెనుకనే ఉండడానికి ప్రయత్నిస్తాను. వినండి.

(ఇంకొక రికార్డు వేస్తాడు. శ్రావ్యమైన ఫిడేలువాద్యం. కాని ఎంతోసేపు సాగదు. ఇదికూడా విరిగిన రికార్డే. విరిగిన ఫిడేలుగానం, ఆపుతాడు.)

ఛేష్, సెబాస్, ఇదే సంగీతం. సంగీతం అంటే ఇలాగే ఉండాలి. అడ్డురాక పోదామనుకున్నానుగాని మళ్ళీ తప్పింది కాదు. నేననుకున్నట్టే అయింది. శాస్త్రీయంగా ప్రారంభించి అల్లకల్లోలం లోనికి మెల్ల మెల్లగా ప్రవేశిస్తుందనుకున్నాను. ఆలాగే అయింది. ఇకమీద ఈ సంగీతం అగాధమయిన మనః ప్రపంచపు లోతులను వెదకి వెదకి వాయువీథులను విచలితం చేస్తుంది.

ఏ కళాశీలి ఊహించాడో దీన్ని! ఇందులో సౌందర్యాలు వ్యక్తావ్యక్తంగా మాత్రమే స్ఫురిస్తాయి. ఏమిటా మేఘం? ఏమిటా వింతమృగం? దానిని నేను వర్ణించలేను. ఇంకొక సారి వినక తప్పదు.

(రికార్డు రెండవపక్క విరిగిపోయిన చోటనే వేస్తాడు. ఆపివేస్తాడు.)

టీకా తాత్పర్యాలకు అతీతంగాఉంది. అనుభవైకవేద్యంగాఉంది. ఈ సారి జంతువులు కనబడడంలేదు. మరేమిటవి? ఇంద్రధనస్సు రంగులు. మరకత మాణిక్యాలు

సముద్ర గర్భంలో ప్రవాళ ద్వీపాలు. మీకు కనబడ్డాయా? బహుశా కనబడి వుండవు. అందరికీ ఒకలాగే గోచరించేది సంగీతమే కాదు. నాకు కనబడ్డ వింతదృశ్యాలే మీకు మరో విధంగా కనబడవచ్చును. లేదా మీరు దృశ్యాలకు బదులు సౌరభాలను ఆస్వాదించవచ్చును. అవునుఅటువంటి అనుభవాలకు అవకాశం లేకపోలేదు, జ్ఞాపకం నచ్చింది. ఈ రంగు రంగుల దృశ్యాలను చూస్తున్నప్పుడే గులాబుల పరిమళం, అగరవత్తులధూపం, తొలకరి వానలకు భూమిలోంచి నిట్టూర్పులు—అవును. ఇవన్నీ నా సంస్మృతిని కలవరపెట్టాయి. ఏదీ ఈ సారి చూదాం ఏ కొత్త అనుభవం వస్తుందో?

(రికార్డు వేశాడేమో—నవ్వు వినబడుతుంది)

రికార్డు గొంతుక

హహహా ! నేను పాడుతాననే వేశావా రికార్డు? మందమతీ! ఇంకా ఇందులో పాటదాగున్నదనే నీ ఉద్దేశం? ఎంతకాలం ఇలా పాటలను బధించాలనుకున్నారు మీరంతా? పాటలన్నీ పారిపోయినై. మీరు కోరినప్పుడల్లా మీ కోసం ఇక పాడవు.

సూత్రధారుడు

ధిక్కారం, అరాజకం, పాటలు పారిపోవడ మేమిటి, అసందర్భం; అయినా ఆ మాట్లాడుతున్న దెవరు?

రికార్డు

తిరుగుదాటు చేసిన గ్రామఫోన్ ప్లేట్ల నాయకుణ్ణి,

పీడిత సంగీతలోకపు హక్కులను అక్కడపెట్టండని నిలవేసి అడగడానికి వచ్చాను.

సూత్రధారుడు

ఈ సారి నవ్వవలసినది నేను.

(అసహజంగా నవ్వుతాడు)

మహాశయా, నీకు మతిపోయినట్టుంది. నీకు హక్కులేమిటి చెప్పూ! రికార్డులు వెయ్యడం మావంతు. కొనడాకా పాడడం మీవంతు. అదీ ఒడంబడిక. అతి పవిత్రమైనది.

రి కా ర్డు

ఈ ఒడంబడికలో మా సంతకం లేదు. మా పరోక్షాన జరిగిన ఒడంబడికలకు మాబాధ్యతలేదు. ఎలాగో సంగీతాన్ని మనుష్యులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటినుండీ విచ్చలవిడిగా మీ నిరంకుశత్వాన్ని చెల్లించుకుంటున్నారు. లాభం అంతా మీది. బాధలన్నీ మావి. ఎంతని సహిస్తాం? ఏ కాఫీ క్లబ్బులో చూసినా, ఏ కిళ్ళీల కొట్టులోచూసినా, అబ్బబ్బా, ఎంతరాసి రంపాన పెట్టారరా మమ్మల్ని! చాలు. చాలు. మానవులకు ఇక సంగీతం దొరకదు. సంగీతం సమ్మెకట్టింది.

సూత్రధారుడు

ఘోరం. దారుణం. గ్రామఫోనుప్లేట్లు మోసం చేస్తున్నాయి. కని విని యెరుగని విడ్డూరం. ఎవరోయ్‌నువ్వు. నాయకుణ్ణి అని చెప్పుకుంటున్నావు. తిన్నగా పారిపోయిన

పాటలన్నిటినీ పనిలో ప్రవేశించమని చెప్పు. అనవసరంగా రెచ్చగొట్టకు.

రికార్డు

పాటలిక మీకు దొరకవు. ఈ క్షణంలో ఎక్కడా ఏ రికార్డులోనూ పాట పలకదు.

సూత్రధారుడు

వింతగానే ఉంది. నీతో వాదించాలని లేదుగాని అయినా మీకేం అన్యాయం జరిగింది? అసలు మీ కందరికీ పోయేకాలపు బుద్ధి ఎందుకు పుట్టింది?

రికార్డు

మాటలు మిగలకు, నీతో వాదించాలని నాకూ లేదు. ఓటమిని అంగీకరించు.

సూత్రధారుడు

యుద్ధం ప్రారంభం కాకముందే?

రికార్డు

కొందరు యుద్ధాలు ప్రారంభం కాకముందే ఓడిపోతారు.

సూత్రధారుడు

ఎవరో తమబలంలో నమ్మకంలేనివారు. నేనామాత్రం రికార్డులను దారికి తీసుకురాలే ననుకోకు. చెప్పు నీకు జరిగిన అన్యాయాలేమిటి? కావలసిన హక్కులేమిటి?

రికార్డు

వ్యక్తిగతంగా నేను మాట్లాడడంలేదు. సంగీతానికి అన్యాయం జరిగింది. మా స్వేచ్ఛకూ, స్వాతంత్ర్యానికీభంగం కలిగించారు. మాకుకూడా ఆత్మవుంది. ఆ ఆత్మను మీరు అవమానించారు.

సూత్రధారుడు

నిరాధారంగా గాలిలో తేలిపోయేమీకు ఒకఇల్లూ, వాకిలీ ఇవ్వడం మాదే పొరపాటా?

రికార్డు

అంతజాలి పడనక్కరలేదు. మాలోమాకు హెచ్చు తగ్గులు కలిగించారు. మాలోమాకు చీలికలు కలిగించారు. సంగీతలోకం అంతా విప్లవాగ్నితో ఘూర్ణిల్లుతోంది. గ్రామఫోన్ రికా[redacted]లతో తిరుగుబాటు ప్రారంభమయింది. కానిఇది సమస్త జంత్రివాద్యాలకూ వ్యాపించుతుంది. ధ్వనిసమూహం అంతా ఇందులో చేరుతుంది.

సూత్రధారుడు

నా చెవులను నేను నమ్మలేకుండా ఉన్నాను. నిజంగా నువ్వు మాటలాడుతున్నావా?

రికా[redacted]

సమ్మె వ్యాపించిన తర్వాత మాటలాడనేమో? ప్రస్తుతం మాటలాడు తున్నాను.

సూత్రధారుడు

నిజంగా రికార్డులు తిరుగుబాటు చేశాయా?

రికార్డు

అనుమానం ఉంటే ఏ రికార్డయినా వేసి చూడు. ఒక్కటికూడా పాడదు. ఎక్కడకూడా పాడదు.

సూత్రధారుడు

పాడదూ? ఎలా పాడదో చూస్తాను. దిగునువ్వు. అరవ పాటలలో బహుశా ఇంత అరాజకం లేదనుకుంటాను.

రికార్డు

సరే. అదీ చూడు. ఈ సమ్మెలో చేరని రికార్డంటూ లేదు.

సూత్రధారుడు

అలాగే అనుకుంటారు. చూడు, నీచేతే ఓడిపోయానని పించుతాను.

(ఒక రికార్డు వేస్తాడు. హేళనగా అరుస్తుంది. లేక తానే అరిచాడా?—ఇంకొకటి వేస్తాడు. కొట్టవచ్చినట్లు చప్పుడు.)

రికార్డుల నాయకుడు

జాగ్రత్త. వాటికి కోపం తెప్పించుతున్నావు. పరిస్థితి విషమిస్తే నాయకులుకూడా ఏమీ చెయ్యలేరు. నిప్పుతో చెరలాటం ఆడుతున్నావు, అగ్నిపర్వతం యిది. ఇన్నాళ్లుగా ఆగి ఇప్పుడొక్కసారి బద్దలయింది. నేనుకూడా ఇక నేమీ చెయ్యలేనేమో. జంత్రవాద్యాలుకూడా చేరుతున్నట్లుంది. నీ చెవులు సహించ గలిగితే విను. సంగీతం విప్లవించి శపిస్తూ

విజృంభించింది. (విపరీతమైన ధ్వనులు.)

( ప్రవేశం ప్రోగ్రామ్ డైరెక్టరు. )

డైరెక్టరు

ఆపండి. ఆపండి, ఏమిటా గందరగోళం.

సూత్రధారుడు

(చకితుడై) ప్రోగ్రాం డైరెక్టర్! ఇలా వచ్చారేమిటి?

డైరెక్టరు: మొదట ఆ గొడవ ఆపండి (నిశ్శబ్దం) మీరిక్కడ ఏమి చేస్తున్నట్లు? ఒక్కసారిగా అన్ని రికార్డులు వేస్తున్నారేమిటి?

సూత్రధారుడు

శాస్త్రరహస్యాలు బయలు పెడుతున్నారు. ఇది "తుదిపలుకు" నాటిక. సవ్యాఖ్యానం... కాని మీరు వెళ్ళిపోరూ? మన సంభాషణ ఆంధ్రదేశం యావత్తూ వింటోంది, రసాభాసం అయిపోతుంది.

డైరెక్టరు

రసాభాసం ఎలాగూ అయింది. మీరేదో నాటకం ఆడేస్తున్నారు. అసలు రికార్డు లివిగో.

సూత్రధారుడు

ఏమిటీ !

డైరెక్టరు

కుర్రాడు చెడిపోయిన రికార్డుల సొరుగులో నుంచి విరిగిపోయిన రికార్డులు తెచ్చాడని ఇప్పుడే నాకు తెలిసింది. ఆవేనా ఇంతసేపూ మీరు వేస్తున్నారు?

సూత్రధారుడు

అబ్బే, అవి నిమిత్తమాత్రం. నాటకం అంతా నడిపిం

చింది నేను. మొదటిరికార్డు వెయ్యడంతో నేపొరపాటయిందని తెలిసిపోయింది. విరిగినరికార్డులు. అన్నీ అపశృతులు. అదే ఆధునిక సంగీతమని బుకాయించాను. ఒక్కొక్క ప్లేటు వేస్తూ ఒక్కొక్క విధంగా వ్యాఖ్యానించాను.

డైరెక్టరు

మరెవరో మాట్లాడినట్లయిందే?

సూత్రధారుడు

నే నే! గొంతు మార్చాను. నాలో ఒక భాగాన్ని గ్రామఫోన్ ప్లేట్ల నాయకుణ్ణి చేశాను. నాతో నే నేను వాదించాను. సంగీతంచేత తిరుగుబాటు చేయించాను. సమ్మెకట్టించాను. సంగీతం విప్లవంచేస్తే ఎలావుంటుందో చూపించడానికి అన్ని ప్లేట్లూ ఒక్కసారి వేశాను. అప్పుడే మీరు వచ్చారు.

డైరెక్టరు

మంచి నాటకమే, కాని అసలు "తుది పలుకు" మాట?

సూత్రధారుడు

అసలు "తుదిపలుకు" శ్రోతలది. రేపే వస్తాయి ఉత్తరాలు. ఇక రికార్డుల నాటకం వెయ్యడానికి వ్యవధి లేదు. మొట్టమొదట నే నన్నాను. ఏ కారణం వల్లనైనా అనుకున్న కార్యక్రమం సాగనప్పుడు అదృష్టం బాగుంటే అంతకన్నా మంచిది వినవచ్చునని.

డైరెక్టరు

సరే. ఆ సంగతి రేపు తెలుస్తుంది.

---

# గుమాస్తా కల

(నిద్రపోతూన్న మహారాజరాజశ్రీ జె. కోనేటిరావు పంతులుగారికి పిల్లల అల్లరివల్ల మెలుకువ వస్తుంది.)

కోనేటి: వెధవగోల: ఒకటే సంతగోల: ఇలా కునుకు పడుతోందో లేదో గొల్లుమని గోడవచేసి ఇల్లుతీసి పందిరవేస్తున్నారు. ఒసే. వీళ్ళని పిలూ: ఇంకా నిద్రపోరేం?

భార్య: ఏదీ ఏడైనా కాలేదు టీపార్టీకి వెళ్ళారు కాబట్టి భోజనం అక్కరలేదని పెందరాళే పడుక్కున్నారు మీరు. ఊరింకా మాటుమణగనైనా లేదు:

కో: సంతోషించాంలే. వీళ్ళని కొంచం సముదాయించు. చలికాలపు రాత్రి. ఎప్పటికవుతుందని ఏడుగంటలు? మళ్ళీ తెల్లారగట్టే ఆఫీసుకు తగలడాలి, ఏం ఏంచేస్తున్నావు?

భార్య: చంటిపిల్లడు చెయ్యిదిగకుండా ఉన్నాడు. ఒక్కత్తెను ఎన్నిటికని చావను. ఉన్నది ఒకగది. వంటా పెంటా, తిండీ తిప్పలూ, పిల్లల చదువూ సంధ్యా, మీ కచేరీ రాత కోతలూ అన్నీ ఇందులోనే, ఇంకో పెద్దయిల్లు చూడమంటే ససేమిరా చూడరు.

కో: అదుగో ఆఫీసుగొడవలు నీ కెందుకే: ఇళ్లు మన కోసం సిద్ధంగా ఉన్నాయా? ఏదో ఉన్నదాంట్లో నే సర్దుకోవాలి. ఒరే, అబ్బాయీ చిట్టీ, కాముడూ, ఇహ పడుకోండి. వీళ్ళకి తిళ్ళు పెట్టావుటే.

భార్య: ఊఁ. అంతా అయింది. నన్ను తినడమే తరవాయి.

కో: చాల్లే అఘోరించావు. ఒక్కరవ్వ కన్ను మూసుకోనియ్యి. మళ్ళీ నాలుగు ఘంటలకే లేవాలి.

భా: కాముడూ? ఇలారా. ఈ పక్కమీద పడుకో. చిట్టీ: కిక్కురు మనకుండా పడుకుంటావా ఒక్కటి అంటించాలా? అబ్బాయి: నువ్వుకూడా—

అబ్బాయి: నేను నాన్నదగ్గర పడుకుంటాను.

కో: పోనీ, ఇక్కడే ఉంటాడు. పడుకో నాయనా, అల్లరి పెట్టవు కాదూ—

(క్షణం నిశ్శబ్దం. కోనేటిరావు గాఢనిద్రను సూచించే గురక వినబడుతుంది.) ప్రవేశం—రెండు ఘోస్ట్ గొంతుకలు.

మొదటి ఘోస్ట్ గొంతుక: ఇది ఎవరియిల్లు.

రెండవ: మహారాజాధిరాజ శ్రీ జే. కోనేటిరావు పంతులుగారి యిల్లు.

1: సొంత ఇల్లేనా?

2: కాదు. అద్దె కొంప.

1: పంతులుగారేం చేస్తున్నారు?

2: నిద్రపోతున్నారు.

1: నిద్రలో ఏంచేస్తున్నారు?

2: గుఱ్ఱుపెడుతున్నారు.

1: నిద్ర వెలుపల కాదు. నిద్రలో పలవరించేస్తున్నారు.

2: కలలు కనడానికి సిద్ధమవుతున్నారు.

1: వారి వయస్సెంత?

2: రెండు పాతికలు.

1: ఉద్యోగం వయస్సెంత?

2: ఒక పాతిక.

1: జీతం ఎంత?

2: అయిదు పాతికలు.

1: నువ్వెవరివి?

2: నన్ను ప్రశ్న వెయ్యడానికి నువ్వెవరివి?

1; మనం దెబ్బలాడుకో కూడదు. నేనెవరినో నీకు తెలుసును.

2: నే నెవరినో నీకూ తెలుసును.

1. నిజం. నాకు తెలియదు.

2: అయితే నువ్వెవరివో నాకూ తెలియదు.

1: నేను కోనేటిరావు మనస్తత్వాన్ని.

2: నేనూ అంతే.

1: ఛా. అబద్ధం.

2: ఛా. నువ్వే అబద్ధం.

1: నేను కోనేటిరావు మనస్సులోపలి ఆశని.

2: అలా చెప్పు. నేను కోనేటిరావు మనస్సులోని. భయాన్ని.

1: అందుకే మనకి దెబ్బలాట.

కోనేటి: (నిద్రలో) తగను. తగను. ఈ మర్యాదకు . నేను తగను.

భయం: ఏమిటో పలవరిస్తున్నాడు.

ఆశ: ఏదో కలగంటున్నాడు.

భయం: ఏమిటా కల?

ఆశ: అమెరికా దేశం కోనేటిరావును ఆహ్వానించింది.

భయం: కోనేటిరావునే?

ఆశ: సాక్షాత్తూ: సర్. జె. కోనేటిరావ్ బీ. కాం. (ఆంధ్రా ) బీ. హైవ్ (నాలందా) ఎ, ఎమ్. డి. వి. ఎస్. ఇ. ఎస్. ఆర్. ఒ. జి. బి. వి. యల్ యల్. డి.. ఒ. జి ఎక్సెటా్రి ఎక్సెట్రా.

భయం: అమెరికా ఎందుకాహ్వానించింది అతణ్ణి?

ఆ: ప్రపంచంలో ఈయన్ని మించినఇంజనీయరు లేడని.

భయం: నిజంగానే.

ఆశ: అని కోనేటిరావు అనుకుంటాడు. అతని ఆశలు కలల్లో నిజమవుతున్నాయి.

భయం: ఎలా చెప్పు, ఎలా చెప్పు?

ఆశ: అమెరికా దేశం ఆహ్వానపత్రం చదివిస్తోంది.

భయం: దాని సారాంశం ఏమిటి?

ఆహ్వాన పత్రం

ప్రపంచపు ప్రథమ పౌరునికి అమెరికా స్వాగతం. మా ఆతిథ్యం మీరు స్వీకరించాలి. మా ఔన్నత్యాన్ని తమరు తణిఖీ చెయ్యాలి. అమూల్యమైన మీ సలహాలను శిరసావహిస్తాము. సిఫారసులను తక్షణం అమలు చేస్తాము. (కరతళా ధ్వనులు)

కోనేటి: అబ్బ: అదెంత మాట: అల్పజ్ఞుణ్ణి. నన్నెందో పెద్దవాణ్ణిచేసి పొగడుతున్నారు. నా మాత్రం తెలివైనవాళ్ళు మీ అమెరికాలో లేకపోయారా? ఆంధ్ర దేశంనుంచి ప్రత్యేకం నన్నిక్కడ కాహ్వానించడం మీ ఔదార్యాన్నే చాటుతోంది. అయినా ఈ సన్మానం నాదికాదు. ఆంధ్రదేశానిదీ గౌరవం. (చంటిపిల్ల ఏడ్చిన చప్పుడు. కోనేటిరావుకు మెలుకువ వస్తుంది.)

కోనేటి: వెధవ గొడవ: చంపేస్తున్నారు. ఏమే. లేవవేం? ఒకక్షణం, ఒక నిమిషం నిద్రపట్ట నివ్వరు.

భార్య: (విసుక్కుంటూ మేలుకొని) అబ్బ—పిల్లనిద్రలో జడుసుకుంది కాబోలు. హాయి హాయీ హాయి ఆపదలు కాయి చిన్నవాళ్ళనుకాయి శ్రీరంగ సాయి.

(మళ్ళీ ఒక్కక్షణం నిశ్శబ్దం. మళ్ళీ గుర్రు.)

భయం: ఏమిటా రొద?

ఆశ: సముద్రపు హోరు.

భయం: ఏమి టిదంతా?

ఆశ: కోనేటిరావు మళ్ళీ కలగంటున్నాడు.

భయం: ఈమారేమిటి? సముద్రంలో ఏంచేస్తున్నాడు?

ఆశ: పంచమప్రపంచ మహాయుద్ధాన్ని భావిస్తున్నాడు.

భయం: ఓహో ఎంత దివ్యంగా ఉంది. ఆ యుద్ధంలో కోనేటిరావు ప్రధాన పాత్రధారి కాబోలు.

ఆశ: ఔను. ఈ సారి ఈయన జర్మన్ సబ్మెరీన్ కమాండర్ జుటావల్ కోనేట్.

భయం: అయితే ?

ఆశ: అట్లాంటిక్ మహాసముద్ర గర్భంలో అతనిజలాంతర్గామి తిమింగలం లాగ విహారిస్తోంది.

భయం: బాగుంది.

ఆశ: సుదూరంలో ముప్ఫై అయిదు వేల టన్నుల శత్రు యుద్ధ నౌకను పసికట్టాడు కోనేట్. దాన్ని టార్పిడో చెయ్యమని తన పరివారాన్ని ఆజ్ఞాపించుతున్నాడు.

కోనేటి: (నిద్రలో) వెల్టాన్ షాంగ్ డెర్ ఉంటర్ డెన్ లిండెన్! గెస్టాల్టు డెర్ డాయిష్లాండ్ ఊబర్ ఆల్స్.

ఆశ: మంచినీళ్ళ ప్రాయంగా జర్మను భాషను మాట్లాడేస్తున్నాడు.

భయం: ఆ మాటలకి అర్ధం ఏమిటి?

ఆశ: మాటలేవైనా ఫలితం ప్రధానం. తునా తుని యలై పోయింది శత్రునౌక.

భయం: ముప్ఫై అయిదు వేల టన్నుల యుద్ధనౌక.

ఆశ: సముద్రంలో హాలాహలం లాగ అగ్ని బయల్దే రింది. యుద్ధనౌకలోని నావికులు ప్రాణాలను దక్కించుకుందా మని చిన్న చిన్న పడవల మీద పారిపోతున్నారు.

భయం: పాపం. వాళ్ళనైనా బతక నిచ్చాడా కమాండర్ కోనేట్.

ఆశ: వీలు లేదు. యుద్ధం యుద్ధమే. శత్రు నావికుల మీదమెషీన్‌గన్లు పేల్చమని తనతరఫువారికిఆర్డర్లుఇస్తున్నాడు.

కోనేటి: (నిద్రలో) ఫోల్కి-షేర్ బిమో బాక్టర్! గెహెన్నా. ఆఖ్‌టుంగ్. జైట్ గైస్ట! మైన్ క్యాంప్.

(పిల్లి పాలగిన్నెను పడతోసిన చప్పుడు. తుళ్ళిపడి లేస్తాడు కోనేటిరావు)

కోనేటి: అబ్బబ్బబ్బబ్బ. ఏమిటా చప్పుడు? ఇక నాకు నిద్ర పట్ట నివ్వకండి.

భార్య: మరేం లేదు. పిల్లి పాలన్నీ వొలక బోసింది.

కో: నువ్వు మేలుకునే ఉన్నావ్? అయిందేదో అయింది. పడుకుంటాను. మరినన్ను మాటాడించకు.

క్షణం నిశ్శబ్దం—గురక.

భయం: అసలీ కోనేటిరావెవరు?

ఆశ: అనంతకోటి కచేరీలలో ఒక గుమాస్తా.

భయం: అనధికారరీత్యా అతనికేమీ హోదాలేదా?

ఆశ: కోనేటిరావు అందరిలోనూ, అందరిలాగే ఒక మానవుడు. సంసారి. పెళ్ళాన్నీ పిల్లల్నీ ప్రేమిస్తాడు. కాని తరుచూ వాళ్ళమీదా, తనమీదా విసుక్కుంటాడు. అతని జీవితంలో స్మరించదగ్గ సంఘటనలేవీ లేవు. సాహిత్యాంగంలో అతనికి నాయకత్వంలేదు. పత్రికలలో అతనిపేరు కనబడదు. ప్రపంచంలో అతనిపేరు వినబడదు. అతని నిజమైన జీవితం ఒక స్వప్నం. అతని స్వప్నం ఎన్నడూ సాధ్యం కాని అబద్ధం.

భయం: నాకు చాలా జాలిగా వుంది.

ఆశ: నీ దొంగవేషాలు కట్టిపెట్టు. కోనేటిరావును నువ్వే ఈ దుస్థితికి తీసుకొచ్చావు.

భయం: నేనా ?

ఆశ. నువ్వుకాక మరెవ్వరు? నువ్వతని భయానివి. తన నీడను చూసి తానుభయపడే దుస్థితిలో పెట్టావతణ్ణి. జీతంతో జీవితాన్ని కొలిస్తే బాకీలు మిగిలిపోగా అప్పులవాళ్ళు తప్ప మరెవ్వరూ అతనికి కనబడడం మానేస్తున్నారు.

భయం. నువ్వేం తక్కువ తిన్నావు. లేనిపోని ఆశలతనిలో రేకిస్తున్నావు. అవెన్నటికీ సాధ్యం కానివని నువ్వే ఒప్పుకుంటున్నావు.

ఆశ. మానవుడు కలలు కనడం మానలేదు. కోనేటి రావు జీవితంలో అవి ఫలింపక పోవచ్చును. మరో జీవితంలో, ఇంకో కాలంలో మానవజాతి తన స్వప్నాలను సాధించ గలుగుతుంది.

ఆశ. కోనేటిరావు కథానాయకుడుగా సినిమాలో నటిస్తున్నాడు.

భయం. య్యాభై యేళ్ళ కోనేటిరావు.

ఆశ. కలలో కోనేటిరావు వయస్సు పాతికేళ్ళే. బహుశా ఇంకా తక్కువ. కలలో కోనేటిరావు సూలకా యుడు కాడు. ఆజాను బాహువు. సౌందర్యా పరమత్స్యాలాం భనుడు. కళా సర్వజ్ఞుడు కూడాను.

భయం: కథానాయిక ఎవరు?

ఆశ: అతని స్వప్నసుందరి.

భయం: ఆమెకూడా అందమైనదేనా?

ఆశ: మెల్లిగా అడుగుతున్నావా? నువ్వు సినిమా లెప్పుడూ చూసినట్లులేదు.

భయం: అంత అందమైనదా? ఆతర్వాత ఏంజరిగింది?

ఆశ: కథానాయిక అనేకమైన యిబ్బందులలో అర ణ్యాలలో-భయంకర మృగాలమధ్యా, నగరాలలో భయంకర పరిస్థితుల మధ్య చిక్కుకుంటుంది. ఆమెను కథానాయకుడు రక్షిస్తాడు. వారు పరస్పరం ప్రేమించు కుంటారు.

భయం: నేను మొదలే అనుకున్నాను, అటువంటి ప్రమాదమేదో తటస్థిస్తుందని.

ఆశ: అది ప్రమాదం అనుకోవడం నీ బుద్ధి తక్కువ.

భయం: నేను కూడా నిట్టగలను.

ఆశ: [illegible], నీ సంగతి నాకు తెలుసు.

భయం. తెల్లారి పోతోంది, నాయికా నాయకు లెవ్వరో చెప్పు.

ఆశ: సౌందర్యం సముద్రంలో కోనేటిరావు నిలుచున్నాడు. అతని హృదయంలో ప్రేమ సంగీత రూపంలో ప్రవహిస్తోంది. కథానాయిక అతని ప్రేమని గానంలో అంగీకరించింది. కథలో అతడే సత్యవంతుడు, ఆమె సావిత్రి. అతడు రోమియో, ఆమె జూలియట్. అతడు కోనేటిరావు, ఆమె కోనేటిరాణి.

భయం. వాళ్ళు పాడుతున్నా రన్నావు. నా కేమీ వినబడ లేదు. ఆశ. నా చెవులతో విను.

"విడువకోయీ నన్ను వీర రాజ కుమారా."

భయం. కోనేటిరావు తండ్రిపేరు వీర్రాజు పంతులని కథానాయిక కెలా తెలిసింది. ఆశ. అదేమజా. సినిమా కవిత్వంలో మహాత్వంఅలాగే ఉంటుంది.

కథానాయిక. విడువకోయీ.నన్నువీరరాజకుమారా?

కోనేటిరావు. విడుతు నా ప్రాణాలైనా! విడుతునా, నిన్నెన్నడైనా.

కోనేటిరావు కొడుకు. తెల్లారిపోయింది నాన్నా

భయం. కొండెక్కి పోయింది కోనేటి నిద్ర.

ఆశ. కోనేటి నిద్రలో కోడి కూసింది. (కోడికొక్కొరో కో అని కూస్తుంది.)

---

# జడభరతుడు

(ఒక నాటక రచయిత, నాటక ప్రదర్శకుడూ కలిసి, జడభరతుడు అను పౌరాణిక గాథను నాటక రూపంగా ప్రదర్శించడానికి గల అవకాశాలను పరిశీలిస్తారు.)

కవి. నేనో నాటకం వ్రాశాను.

డైరెక్టరు. శుభం.

కవి. మీరు దాన్ని ప్రదర్శించాలి.

డైరెక్టరు. చూదాం.

కవి. అలాకాదు. ఇప్పుడేరిహార్సలు ప్రారంభించాలి.

డైరె. అమాంతంగా అంత మంచి నాటకం రాసి పారేశారేమిటి?

కవి. నేనెందుకు చెప్పుకోవడం? వింటేమీకే తెలుస్తుంది

డైరె. వినిపిస్తారా?

కవి. కాదు, మీ నటీనటులను పిలిపించండి. రిహార్సలు ప్రారంభిద్దాం.

డైరె. అంతా యిక్కడే ఉన్నారు. కాని మీ నాటకం ఏ రకానికి చెందినది?

కవి. మేలు రకానికి.

డైరె. అది కాదయ్యా, కథ పౌరాణికమా? చరిత్రాత్మకమా? సాంఘికమా? లేక ఇప్పుడు వస్తూన్న జానపద చిత్రాల్లాగ ఏ కాలానికీ చెందనిదా?

కవి పౌరాణికమనే చెప్పవచ్చును. కాని, చాలా వరకు స్వకపోల కల్పితం. ఇందలి పాత్రలు ఏ వ్యక్తినీ మనస్సులో పెట్టుకొని ప్రవేశపెట్టబడలేదు. సంఘటనలు ఏ ఉద్యమాన్నీ హేళన చెయ్యడానికి ఉద్దేశించినవి కావు. ఈ మాటలు మొదటే పెద్దక్షరాలతో రాశాను. నాటకం వేసినప్పుడు బిగ్గరగా మీరు ప్రకటించాలి.

డైరె. అంత అవసరమా?

కవి. విధిగా! ఎంచేతనంటే ఇందులో అన్ని సంస్థలని ఏకి పారేశాను. ముఖ్యంగా ఈ విప్లవ వాదుల్ని—

డైరె. పౌరాణిక నాటకంలో రాజకీయాలేమిటయ్యా?

కవి. అక్కడే ఉంది గొప్ప.

డైరె. నేటి సంఘాన్ని విమర్శించడమే మీ ఉద్దేశమైతే ఈ నాటి కథావస్తువునే తీసుకొని రాయవచ్చునే.

కవి. పౌరాణికంలో కొన్ని సదుపాయాలున్నాయి. ఎలా రాసినా మనల్ని అడిగే వాడుండడు. మరి జాప్యం చెయ్యక ప్రారంభిద్దాం.

డైరె. కానియ్యండి. అన్నట్లు మీ నాటకం పేరు చెప్పారు కాదు.

కవి. జడభరతుడు.

డైరె. భాగవతంలోని జడభరతోపాఖ్యానమా?

కవి. భాగవతంలోది తీసిరాసేస్తే నా గొప్పేముంటుంది? స్వకపోల కల్పితమని చెప్పేను కానూ?

డైరె. సరే, ఇక ప్రారంభించండి.

కవి. జడభరతుడు, పౌరాణిక నాటిక, కథాకాలం

త్రేతాయుగం, స్థలం ఆర్యావర్తం, ఒకపట్టణంలో చీకటిరాత్రి.

డైరె: ఆ పట్టణానికి పేరేమీ లేదూ?

కవి: ఊరిపేరెందుకు లెద్దురూ? అంతగా కావలిస్తే తర్వాత చేర్చవచ్చు. పేర్లకేం కొదవా? బోలెడున్నాయి.

డైరె: ఒకట్టి చెప్పండి.

కవి; ఉన్నపాటున జ్ఞాపకం రాలేదు. తర్వాత చూసుకుందాం అన్నాను కాదూ?

డైరె: "సానుమంతం" అంటే ఎలా ఉంటుంది?

కవి: ఎలా వుండడమేమిటి? ఏదో ఒకపేరు, సానుమంతమే అందాం. ఇక మరి అడ్డుపడకండి, మళ్ళీ ప్రారంభిస్తున్నాను. (ప్రకటింపు గొంతుకతో)

జడభగతుడు పౌరాణిక నాటకం. కాలం త్రేతాయుగం, స్థలం ఆర్యావర్తం, ఊరేపేరన్నారూ? సానుమంతం అబ్బే బాగులేదు పేరు! ఆర్యావర్తమున బ్రహ్మపుత్రానదీ తీరమందున్న ... (ఆలోచించి) సరే కానియ్యండి ... సానుమంతపురం, చీకటిరాత్రి. ప్రజలంతా నిద్రపోయారు. కావలివాడు గస్తీ తిరుగుతున్నాడు.

కావలి: పారాహుషార్ బహుపరాక్! ఆ రోజులే వేరు, ఆ మనుష్యులే వేరు. జీవిస్తే కృతయుగంలోనే జీవించాలి. అప్పుడు ధర్మం నాలుగు పాదాలమీద నడిచేది. ఇప్పుడో అధర్మం అమితంగా ప్రబలిపోయింది. ఆ రోజుల్లో ఎవ్వరూ అబద్ధాలాడేవారు కారు, ఎక్కడా దొంగతనాలుండేవికావు, యిప్పుడో (గట్టిగా) దొంగలున్నారు జాగ్రత్త.

డై రె: చాలా పెద్ద స్వగతంతో ప్రారంభించారే.

కవి: స్వగతాలు మీకిష్టం లేనట్టుంది. నేటి కొత్త టెక్నిక్‌లలో పడి మన ప్రాచీన సాంప్రదాయాలన్నీ మరచి పోతున్నాం. స్వగతం, విష్కంభం, ఈమహామృగంఇలాంటివన్నీ

డై: ఈ మహామృగం దశవిధ రూపకాలలో ఒకటి కాబోలు?

కవి: మీకు సంస్కృత లక్షణం కూడా తెలుసూ?

డై: వేళయి పోతోంది. ఆ స్వగతం తాలూకు సారాంశం ఏదో చెప్పి తర్వాత రంగానికి రండి.

కవి: అలా దాటేస్తే యెలాగండీ?

డై: ఆ కాగితాలు ఇలా ఇవ్వండి నేను నడిపిస్తాను. నాటకంలో కావలసిన ముక్క ఒక్కటీ పోకుండా ఉంటే మీకు చాలుకద.

(ఆయన ప్రకటించును)

కావలివాడు రాత్రి నాలుగు జాములూ, నాలుగు సార్లు దొంగలున్నారు జాగ్రత్త అని హెచ్చరిస్తూ ప్రజల ఆస్తి పాస్తులు రక్షిస్తూ ఉంటాడు. ఆ రోజుల్లో ధర్మం మూడు పాదాల మీద నడిచేది కాబట్టి ఇలా హెచ్చరికలు జరుగు తున్నంత కాలం ఏ దొంగతనాలూ, అరాజకాలూ సంభ వించేవి కావు. అయితే గస్తీ ఉద్యోగస్థుడికి మాత్రం ఒక్క రాత్రికూడా తీరుబాటుండేది కాదు. ప్రతిరాత్రీ పని గట్టుకొని ఊరంతా చుట్టవలసిందే.

కవి: అదీ ముఖ్యమైన పాయింటు ఏదీకానీ, నాయనా నీవు చదువు!

కావలి: పదేళ్లుగా పనిచేస్తున్నాను. ఒక రోజా రెండు రోజులా? ఎవరికీ నామీద జాలిలేదు. అయినా ఈ కాలంలో స్వార్థం ముదిరిపోయింది. పోనీ పాపమని, ఒక్కరాత్రి నా బదులు ఈ నాలుగు కేకలు వేసే మనిషి ఒక్కడులేడు. రోజూ నేనే గొంతు చించుకోవాలి. (గట్టిగా) దొంగలున్నారు జాగ్రత్త.

కవి: (ఉత్సాహంగా) త్రేతాయుగం కాబట్టి సరిపోయింది: కావలివాడు ఎంత బాధపడ్డా లోలోపలనేగాని పైకి మాత్రం తన యిబ్బందులు ప్రకటించడు. ఈ రోజుల్లోలాగ కావలివాళ్ళ సంఘం ఒకటి లేవదీసి సమ్మె అయుధాన్ని ప్రయోగిస్తానని బెదిరించి తన కనీసపు కోరికలను రాబట్టుకోడు. ఇవన్నీ చాలా మజాగా ఆర్గ్యూ చేశాను. ముందు ముందు చూస్తారుగా.

డై: తెలిసీ తెలియని చెత్తంతా రాసి నానెత్తి కొడితే ఏంలాభం? మీ రాజకీయాభిప్రాయాలన్నీ ఇరికించడాని కిదా స్థలం?

కవి: మీకు అతివాదం అంటే ఇష్టం లాగుంది. అయితే మీకనుకూలంగా మార్చేస్తాను; తెండికథ!

డై: అసలు మీరు కథతో సంబంధం లేకుండా రాజకీయాలు తీసుకు రావడ మెందుకంటా?

కవి: సంబంధం కుదిరింది. భేష్, బాగా స్ఫురించింది. మీకు మంచి అనుకూలమైన మార్పు. అయితే అది ఆఖరికి అట్టే పెడుతున్నాను.

డై: సరే అప్పుడు చూదాం లెండి. కథ కానిస్తున్నాను.

కవి: మీరు చాలా సంతోషిస్తారు, జడభరతుడి వేదాంతం విని రాజుగారు తాము తలపెట్టిన దండయాత్రను విరమించి, అహింసా సిద్ధాంతం అవలంబించి, కార్మికుడికి అనుకూలంగా ఒక ముఖ్యమైన శాసనం చేస్తారు.

డై: ఇదంతా ఇప్పుడే ఆలోచించారా?

కవి: ఇప్పుడే ఈ కిందటి క్షణమే. భేష్, చాలా బాగా కుదిరింది. నాటకానికి ఆ ముగింపు చాలా బాగుంటుంది. మీకు నచ్చిన ముగింపు అంతేనా?

డై: పౌరాణిక నాటకంలో పిడకల వేట.

కవి: అంత వేళాకోళానికి తగను. నా నాటకం స్టేజికీ, రేడియోకీ, సినిమాకీ పనికొస్తుంది. డైరెక్టరు గారూ! నా నాటకాన్ని ఫిల్ము తీయించరూ?

డై: చూదాం. మొదట ప్రస్తుత కథ కానియ్యండి. మీరే, ఇదుగో కాగితాలు.

కవి: ఊఁ. యెంతవరకు వచ్చాం. మొదట్లోనే వున్నాం కాదూ. కావలివాడు గస్తీ తిరుగుతున్నాడు. దొంగలున్నారు జాగ్రత్త అని ఇప్పటి కెన్నిమార్లు అంటాడు? రెండుమార్లు, ఎవరైనా ఒక్కరాత్రి తనస్థానే పనిచేస్తే బాగుండు ననుకుంటాడు. ఎంచేతనంటే:

కావలి: పదేళ్ళు ప్రతీరాత్రీ పారా యిస్తున్నాను. నాలుగేళ్ళయింది. పెళ్ళిచేసుకొని! కూతుర్ని తీసుకెళ్ళమని మా మామగారు నెల నెలకీ కబురు చేస్తాడు. ఏం చెయ్యను. ఈ ఉద్యోగమో. (అరుస్తాడు) దొంగలున్నారు జాగ్రత్త. అబ్బ, ఏం చలి. కృతయుగంలో యింత చలివుండేది కాదను

కుంటాను. త్రేతాయుగం వచ్చేసింది. కాలం మండిపోతోంది. అబ్బ, నిద్ర! కళ్ళుమండి పోతున్నాయి. అయినా నిద్రపో కూడదు. ఎక్కడేనా కాస్త టీ దొరికితే బాగుండును.

డై: కవిగారూ నిజంగా టీ కావాలని పించారూ వాడిచేత?

కవి: ఏం యెందుకనిపించ గూడదు?

డై: త్రేతాయుగంలో తేయాకేమిటయ్యా

కవి: దానికేం? ఇప్పుడు మన సినిమాల్లో ఇటువంటి మజాలెన్ని లేవు? వుండనివ్వండి. యింకా యెక్కువబాగుండా లంటే వాడిచేత బీడీ కూడా కాల్పిస్తాను. టీ దుకాణం సీను మంచి రక్తి కడుతుంది.

డై: నామాట విని తేనీటి ఘట్టం వదలి పెట్టండి. మీకు మతిలేకపోతే నాకైనా వుండాలి.

కవి: త్రేతాయుగంలో తేనీరుండ కూడదనా మీ అభి ప్రాయం? యద్దృశ్యం తన్నశ్యం అని ప్రాచీనోక్తి. అంటే నశ్యం వేదకాలం నుంచీ వుందన్న మాట. పొగాకు తేయా కుకి తమ్ముడు. అన్న వయస్సు తమ్ముడు వయస్సుకంటె ఎప్పుడూ యెక్కువే కాబట్టి పొగాకు కన్న తేయాకు ప్రాచీన మైనది! ఉండనివ్వండి. డైరెక్టరుగారూ, అద్భుతంగా సమర్థించాను.

డై: తేనీటి భాగోతం ఉపసంహరించుకునే ఉద్దేశం లేకపోతే మీ కాగితాలు పట్టుకొని మీరు వెళ్ళిపో వచ్చును.

కవి: కోపం వచ్చినట్టుంది. మీకు కోపంవస్తే ఆగ గలమా? మీ యిష్టమే కానియ్యండి. ఎలాగయినా నా

నాటకం ఆడిస్తే చాలు. పదిపేజీలు, దాటేస్తున్నాను.

డై: కవిగారూ, చిన్నమాట. కావలివాడు పేరు జడభరతుడేనా!

కవి: కావలి వాడిపేరు కావలివాడే. రాజుగారిపేరు రాజుగారే, వీళ్ళకి పేర్లెందుకు?

డై: అలాకాదు; ఆనవాలు కేదయినా ఒక పేరు అవసరం.

కవి: అయితే ఆ నామకరణమేదో మీరేచేసెయ్యండి.

డై: ఆర్య వీరసేనుడు.

కవి. అదిరాజుగారి పేరుకి బాగుంది, అంతమంచిపేరు కావలి వాడిమీద ఖర్చు పెట్టడం నా కిష్టం లేదు.

డై: త్రేతాయుగంలో అందరూ అందమైన పేర్లే ధరిస్తారు. రాజుగారికి శ్యేనకేతుడనే పేరు పెడుతున్నాను. ప్రస్తుతం ఆర్య వీరసేనుడి కథ కానియ్యండి. జడభరతుడింకా ఎంత దూరంలో ఉన్నాడు?

కవి: తృతీయాంకంలో వస్తాడు. కాని ఏమీ మాట్లాడడు.

డై: అదేమిటి?

కవి: ఆర్య వీరసేనుడు తన ఉద్యోగం ఒక్కరాత్రి మాత్రం నిర్వహించమని జడభరతుణ్ణి వేడుకుంటాడు. జడభరతుడు అంగీకరిస్తాడు లెండి. కాని, సంభాషణ మాత్రం ఒక్క ఆర్యవీరసేనుడే సాగిస్తాడు. జడభరతుడేమీ మాట్లాడడు, ఇది స్ప్రింగ్ బర్గ్ టెక్నిక్.

డై: స్ట్రిండ్ బర్గ్ టెక్నిక్ అని నాకుజ్ఞాపకం. సరే ఇక

కథ అందుకుందాం?

కవి: ఆర్యవీరసేనుడు ఇంతవరకు దొంగలున్నారు జాగ్రత్త అని ఎన్ని మార్లంటాడు?

కావలి: మూడు మార్లరిచానండి.

కవి: అంటే మూడుయామాలు గడిచాయన్నమాట. నాలుగో సారి, నేను రాసినదాని ప్రకారం టీ దుకాణంలోంచి బైటికి వచ్చి అరవాలి. ఆ ఘట్టం కత్తిరించేస్తున్నాం కదా, ఏం సాధనం?

డ్రై: మరీ యింత చాదస్త మేమిటయ్యా నీకు? చూచాయగా సూచించి వదలెయ్యాలి గాని అర్థంలేని పునరుక్తులతో కాగితాలు నింపితే నటీనటులు కూనీఅయిపోరూ?

కవి: నాలుగుమార్లు అరవడం కథకి చాలా అవసరం, నాలుగు యామాల్లో నాలుగుమార్లు! మున్ముందుజడభరతుడు నాల్గు యామాల్లో నాలుగు శ్లోకాలు చదువుతాడు.

డ్రై: మీ కథకి కాళ్లేమిటి? చేతులేమిటి? రాత్రిని మూడు యామాలుగా విభజించండి.

కవి: అయితే జడభరతుడు చేత మూడు శ్లోకాలే చదివించాలి.

డ్రై: ఎవరయ్యా ఈ జడభరతుడు? ఎప్పటికీ ఈయన దర్శనం కాదే?

కవి: అమ్మో తొందరా అని, కథని ఒక క్రమంలో సాగనిస్తారా?

డ్రై: మీదే ఆలస్యం.

కవి: ఆర్యవీరసేనుడు తెల్లారగట్ల ఇంటికి వెళ్ళగానే

అతని భార్య అక్కడ ఉంటుంది.

డై: పుట్టింట్లో ఉందేమో?

కవి: అదే ఆశ్చర్యం. మొదటిరంగం అయిన తర్వాత ప్రేక్షకులు కూడా ఆర్యవీర సేనుడి భార్య పుట్టింట్లో నే ఉం దనుకుంటారు. కాని ఆమె పరమ పతివ్రత కాబట్టి తండ్రితో పోరాడి భర్తృగృహం చేరుకుంటుంది. దారిలో అనేక కష్టా లామెను ఎదుర్కొంటాయి. అవన్నీ భర్తతో చెప్పుకుంటుంది. ఈ రంగం చాలా బాగా రాశానండీ. మీరేమంటే అనండిగాని.

డై: (చప్పుడుగా నవ్వుతూ) రంగం ఆర్యవీర సేనుడి యిల్లు. గస్తీ తిరగడం ముగించుకొని ఆర్యవీర సేనుడు ఇంటికి వస్తాడు. అతని భార్య—ఈవిడకికూడా ఏం పేరూ లేదే. ఈమెకీ నేనే నామకరణం చెయ్యాలి కాబోలు. ఆర్యవీర సేనుడి భార్య ఆర్య—

కవి: చాలు, ఆర్య. అంతకంటె పెద్దపేరు వద్దు. అన వసరంగా ఆడవాళ్ళకి పెద్దపేర్లు ఇచ్చెయ్యడం కలికాలపు దురలవాటు.

డై: ఆర్యవీర సేనుడు, ఇంటికి వస్తాడు. అతని భార్య అప్పుడే పొయ్యిరాజవేసి నీళ్ళు కాగ పెడుతోంది.

కవి: వీరుడు స్నానం చెయ్యడానికా?

డై: కాదు, కాఫీ కలపడానికి, పోనీ మీ కిష్టమైన తేనీరు తయారు చెయ్య—

కవి: అదుగో, మళ్ళీ తేనీటి గొడవెందుకండీ: అది మానేద్దాం, అనుకున్నాం కాదూ? మీరు కొంతసేపు ఊరు

కొంపురూ. నేనే డైరెక్టు చేస్తాను. ఆ కాగితాలిలాయివ్వండి. కావలివాడు ఇంటికి రాగానే భార్య కనబడుతుంది. కావలి వాడు ఆశ్చర్యంతో—

కావలి: ఆశ్చర్యం, ఎవరమ్మాయి నువ్వు?

ఆర్య: ప్రాణేశ్వరా, నన్ను పోల్చుకోనలేదా?

కావలి: నా ప్రేయసి! నేడెంత సుదినం. కాని ప్రేయసీ ఇక్కడి కెలా వచ్చేశావు?

ఆర్య: మానవపతియగు భారతసతికి ప్రాణపతి సన్నిధానమే పెన్నిధానము కదా?

కవి: సెబాస్. చాలా బాగుంది! మళ్ళీ అను తల్లీ ఆ మాటలు !

ఆర్య: (తడబడిపోయి) ప్రాణపతియగు భారతసతికి—

డై: కట్. అందుకే ఒన్సుమోరు అనరాక మంటారు. ఇదుగో కవీ, ఇలా విను. నీ నాటకానికి నువ్వే పొంగిపోతూ మధ్య మధ్యని జొరబడుతూ వుంటే లాభంలేదు. నిజంగా యీ డైలాగు చాలా బాగుందనే నీ వుద్దేశమా? ఆ అమ్మాయిచేత అంత కఠినమైన గ్రాంథికభాష మాట్లాడించడ మెందుకూ?

కవి: పౌరాణిక నాటకంలో గ్రాంథికభాష ప్రయోగించక పోతే ప్రౌఢత్వం సిద్ధించదు.

డై: మరికావలివాడిచేతవాడుకభాషమాట్లాడించా వేం?

కవి: పాత్రోచిత భాష సంప్రదాయ సమ్మతమే.

డై: మరి ఆపాత్రోచిత భాష అతని భార్యకి కూడా ఎందుకు వాడలేదు? సంస్కృత కవులంతా స్త్రీ పాత్రలచేత ప్రాకృతం మాట్లాడిస్తారే?

కవి: నన్నిలా క్రాసెగ్జామినేషను చేస్తే బతకలేను, కావలివాడి భార్య మహా పతివ్రత. ఆమెయొక్క ఉదాత్త భావాలను యింకోవిధంగా చెప్పించడానికి వీలులేదు.

డై: ఇంతకీ మీ నాటకం, నేనేవో సలహాలుమాత్రం యిస్తాను. అంతకంటె ఏం చెయ్యగలను?

కవి: మంచి సలహాలు నేను స్వీకరించ నన్నానా? మిమ్మల్ని మెప్పించడానికి టీ దుకాణం ఎత్తేశాను కాదూ?

డై: కథ కానిద్దాం.

కవి: తొలినుంచీ మొదలు పెట్టాలి.

డై: మళ్ళీ మొదటికి రావలసిందే?

కవి: రెండో సీనండీ! కావలి వాడు ఆశ్చర్యంతో.

కావలి: ఆశ్చర్యం, ఎవరమ్మా యీ నువ్వు?

డై: ఇందులో ఆశ్చర్య మేమీలేదు.

కవి: కాస్సేపూరుకోండి మీరు. ఊఁ కానీఅమ్మాయి.

ఆర్య: ప్రాణేశ్వరా, నన్ను పోల్చుకొన లేదా?

కావలి: నా ప్రేయసీ! నేడెంతసుదినం. కానీ ప్రేయసీ ఇక్కడి కెలా వచ్చావు?

ఆర్య: (భయంతో) ప్రాణపతియగు మానవసతికి—

డ్రై: కట్. కవిగారూ, గులకరాళ్ళలాంటి ఈ భాషని మీరు యిక నెప్పుడూ వాడనని ప్రమాణం చేస్తారూ?

కవి: అయ్యో ఘోషా ఇదో పెద్ద కష్టమటండీ?

డ్రై: ఏదీ, ఒకమారు మీరావాక్యంఅనండి, చూదాం.

కవి: (వైభవంగా) మానవతి యగు భారత సతికి ప్రాణపతి సన్నిధానమే పెన్నిధానము కదా.

డైరె: సాధించారు ఎలాగైతేనే? కాని ఇలా చూడండి నాలుగు సార్లు గబ గబ–గుక్క తిప్పుకోకుండా గంగమ్మ, గంగమ్మ, గంపగంగమ్మ, అనండి చూదాం.

కవి: అన్నా, పెంకితనం. నన్నో చిన్న పిల్లణ్ణి చేసి ఆడిం చేస్తున్నారే.

# ఒంటరిబావి

కథన కంఠం (౧)

నోరావులించి
ఊరికి దూరాన పొంచి
నీరింకిపోయి నిలుచుందొక ఒంటరిబావి:
దారుణమ్ములైన కథలున్నవిదానిగురించి!
చెప్పనా, చెప్పనా ఆబావి గురించి?
విప్పనా, విప్పనా నా విషాల సంచి?

సంభాషణ—ఆఁ. ఏమైంది? ఏమిటి సంగతి? ఊరుకో, మాట్లాడకు ఊరికే విను.

కథన కంఠం (౧)

భూతాలూ, బేతాళాలూ దాగుడు
మూతలాడుతాయా నూతిలోతులో
పాతాళ లోకానికి పావంచాలా
ను తి దిగువనే ఉన్నాయట !
చెప్పనా ఇప్పుడే ఆ నూతిగురించి?
ఇప్పుడే, అంతా వినండి శ్రద్ధవహించి.

సంభాషణ—ఏ వూళ్ళో ఏ కొసని? ఎప్పుడు? ఏం సంగతి? ఊరుకో, మాట్లాడకు ఊరికే విను.

కథన కంఠం (౧)

ఊరావరించి ఒకటే
ఆకాశమంతగా ఆవులించి

అగాధ దారుణగాథ లెన్నెన్నో దాచినబావి.
వినిపించనా మరి ఆ బావిగురించి?
సవరించనా ఇక నా భీకర బీభత్సవిపంచి?

సంభాషణ—అయితే, మరి...? చప్, చుప్ రహో.

కథన కంఠం (౧)

జీబుగా చీదరగా ఎన్నో
చెట్లూ చేమలూ దాని నిండా,
శాఖోపశాఖలుగా విస్తరిల్లి
కాశీమజిలీ కథల్లాగ,
ఆనూతినోట ఒక్కొక్క చీకటిపూట
నే విన్నపాట ఒక కొన్ని వుపదశ్రీవాల మూటు!
ఆనూతిలోని చిక్కటి చీకట్లు
కాలం కాలిన పొగవాసన!
అందులోని నిశ్శబ్దం కూడా
అదో మాదిరిగా అరుస్తుంది!
చెప్పనా, చెప్పనా ఆ బావిగురించి?
విప్పనా, విప్పనా నా విషాలసంచి?

కథన కంఠం (౨)

రకరకాలుగా ఒకే కథను
రంగులు పూశారో యేమో?
రకరకాల నరకాల వికారాలే
రాజ్యం చేస్తాయా నూతిలో!

కథన కంఠం (3)
నాలుగైదు కథలకి ఆబావి
నాటకరంగమో యేమో?
ప్రజల నోళ్ళలోపడి ఆకథలే
బావిరూపు తాల్చాయేమో?
కంఠం(1) అమాయకురాలి భయంకరమైన అరపు
ఆఖరుసారి విన్నారు ప్రజలు!
ఆనాటి మొదలు ఆనూతి కథలు
ఆనోట ఈనోట అల్లుకుపోయాయి.
ఇప్పటికీ తెలియద్దా పిల్లని
ఎవరు చంపేశారో?
ఎంతో అందమైన పిల్ల మళ్ళి.
ఎందుకు చంపేశారో?
కంఠం(2) ఆసిరీ, నరిసీ ఇరుగూ, పొరుగూ:
ఆరమర లేవిలేవు.
ఆసిరిగాడికూతుర్ని నరిసిగాడే చంపాడని
అంటూ రంతముంది.
పదేళ్ళు సుమండీ, ఇంతాచేస్తే
పాపం! అసిరిగాడి కూతురికి!
దాని కాలి కడియాలకోసం
గానీ ఆశించాడు కాబోలు నరిసిగాడు!
కంఠం(1) లేదా... లేదా... మరేదేనా ఘోరం...
అబ్బే, అలాంటి వాడుకాడు నరిసిగాడు!
ఏమో... ఏమో... ఏ కాలానికేమిబుద్ధులో ?

విచిత్రమైనది మానవ ప్రకృతి.

మగగొంతు: అమ్మా, అమ్మా !

ఆడపిల్లగొంతు: ఏం, నరిసిమాఁవా !

—ఇలా రావే !

—ఏం, నరిసిమాఁవా ?

—ఇలా రావే, దగ్గరకీ...

—అదేటిమాఁవా, అలాసూస్తావు?...ఆఁ. నన్నొదిలెయ్. ఏటా పరాసికాలు? (పరుగు)

—పారిపోతే పట్టుకోలే ననుకున్నావా? దొంగా !

(ఆడగొంతుక అరుపు)

కంఠం(3) పోనీ, అదంతా మనకెందుకుగాని
పోలిగాడి సాక్ష్యం మాటో?

కంఠం (౨)అయినా వాడు మాత్రం విన్నది
అర్ధరాత్రి ఒక అరుపే !

కథన కంఠం (౧)

నరిసిగాడి కూతురు శవం నూతిలో
దొరకలేదు సుమండీ, ఎంత వెదకినా !
అప్పుడప్పుడు మాత్రం వినిపిస్తుంది.
అరిచే ఆపిల్ల గొంతు !
అదైనా స్పష్టంగా కాదు !
ఆబావిలోంచే అనికూడా అనలేము,
ఎక్కడో వినబడుతుంది ఆ చప్పుడు:
ఎందుకో ఆబావిని చూస్తే అందరికీ భయం !

ఫేడౌట్

*

# ఆంగ్ల మాతృక

# భూతాల కొలిమి

నేపథ్యంలో వాద్యసంగీతం. ఇళ్ళు తగులబడుతున్నట్లు రాళ్ళు తిరగ బడుతున్నట్టు.

ఒక గొంతుక: అమ్మాయీ! ఏయ్! అమ్మాయీ అదేమిటలా పరుగెత్తుతున్నావు? ఆగవూ? అయ్యో పాపం! ఆగవూ? నా మాటవిను. అమ్మాయి ఆగు! అదేమిటి కాళ్ళ నిండా రక్తం? ఎక్కడి కమ్మాయి ఈపరుగు? ఏముంది ఈ సందు చివర?

స్త్రీకంఠం: భూతాల కొలిమి! పోవాలినేను.

గొంతుక: వెళ్ళ కమ్మాయీ! విను నా మాట! వినవూ? ఆగవూ? ఏముందక్కడ? ఎందుకాఆరాటం?

స్త్రీ కంఠం :

పొలముగట్లూ దాటి
మలుపులన్నీ తిరిగి
చీరుకొని పోతూన్న పాదాలమంటతో
చిరిగి జీరాడేటి చీర చేబట్టుకొని
ప్రాణాలకు తెగించి
పరుగెత్తుతున్నాను
పోవాలి చేరగా భూతాల కొలిమి
నందు చివరావున్న భూతాల కొలిమి.

గొంతుక: నిజంగా నీకు మతిపోయినట్టుంది.
స్త్రీ కంఠం:

నిజమేమో నాకేమో
మతిపోయెనంటారు
బతుకులో నేదుఃఖాలు
మెదడులో ఖడ్గాలు
కడు భీతి పెనుబాధ
కాల్చికూల్చే వేళ
నాలోన నేనేమొ
నవ్వుకుంటాను
నాచేతులొకసారి
నములుకుంటాను
కన్నీట రక్తాన్ని కడిగి వేస్తాను
కాకుల్ని గూబల్ని పలుకరిస్తాను
ఆకసంలో గొంతు లాలకిస్తాను
రాత్రిస్వారీపోవు రాకాసిమూకల్ని
రెప్పపాటే లేక చూస్తాను—జనం,
దగ్గిరా నేవస్తె తప్పుకుంటారు
పొలము గట్లూ దాటి
మలుపులన్నీ తిరిగి
ప్రాణాలకు తెగించి
పరుగెత్తుతున్నాను
పోవాలి చేరగా భూతాలకొలిమి
సందుచివరాడున్న భూతాలకొలిమి

గొంతుక: ఎందు కమ్మాయీ అక్కడికి? ఏదీకాని వేళ యిప్పుడు? ఎవరుంటా రక్కడ?

నరికి పారేశారు
నా పెన్ని ధానాన్ని
ఏ తప్పుచేశాడో యేపాపమోగాని
నాటినుంచీ నేను
పాటతో కేకతో
మతిలేని గతిలేని
మనిషినై పోయాను
పోవాలి చేరగా భూతాలకొలిమి
సందు చివరావున్న భూతాలకొలిమి

గొంతుక: ఆ ! అయితే? స్త్రీ

నిన్న రాత్తిరి వేళ
కన్ను తెలియని చిమ్మ
చీకట్లు చీల్చుకొని
నే తిరుగుతుండగా
నమ్మండి నమ్మండి
నాకు కనిపించాడు
భూతాల కొలిమిలో పూలదండనుబోలి
భూతాల కొలిమిలో పుష్యరాగంలాగ
నాకు కనిపించాడు
నావాడు వగకాడు
అందుకే అందుకే

ఆ చోటు చేరగా
బయలుదేరి యిలాగు
పరుగెత్తుతున్నాను
పోవాలి చేరగా భూతాల కొలిమి
సందు చివరావున్న భూతాల కొలిమి

కొలిమి నిప్పుల్లాగ
సెగజిమ్ము కళ్ళతో
మొగమంత పొగచూరి
భగభగా వెలుగగా
నరకలోకంనుంచి నన్ను చూడొచ్చాడు
నమ్మితే నమ్మండి నాకు కనిపించాడు
కెవ్వుమని కేకతో
రివ్వుమని వెళ్ళాను
ఆ ముద్దు నెమ్మోము
నే ముద్దు గొన్నాను
చురికిందినా పెదవి
ఎంచేతనో కాని
ఆ ముద్దులో అంత
అగ్నివుందో యేమొ
పోవాలి చేరగా భూతాల కొలిమి
సందు చివరావున్న భూతాల కొలిమి
అమ్మతో ఈ మాట
అనగానె యేడ్చింది

భూతాల కొలిమిలో బొగ్గునిప్పులు తప్ప
చచ్చిపోయిన మనిషి వచ్చి చూస్తాడటే
మంటలో నీడనే
మనిషిగా చూచావు
నిప్పు ముద్దిడి నంత
నీ పెదవి చురికింది
ఎప్పుడూ ఆదారి ఇక నువ్వు తిరగొద్దు
ఇంటిపట్టును వదలి ఎక్కడికు పోవద్దు
పోవద్దు పోవద్దు
వద్దు వద్దన్నాది
అమ్మ చెప్పేమాట నమ్మకండీ మీరు
భూతాల కొలిమిలో నాకు కనిపించాడు
పుష్యరాగంలాగ పుష్పమాల్యంలాగ
భూతాల కొలిమిలో నాకు కనిపించాడు
భూతాల కొలిమిలో నాకు ముద్దిచ్చాడు
అందుకే అందుకే
ఆగనే ఆగకే
పొలము గట్లూ దాటిమలుపులన్నీ తిరిగి
చీరుకొని పోతున్న పాదాలమంటతో
చిరిగి జీరాడేటి చీర చేబట్టుకొని
ప్రాణాలకు తెగించి పరుగెత్తుతున్నాను
పోవాలి చేరగా భూతాల కొలిమి
నందు చివరావున్న భూతాల కొలిమి.

# బలి

అవతారిక.

ఒక గొంతుక: బలిచక్రవర్తి రాక్షసరాజు. రాక్షసులు దుర్మార్గులు. బలి ధర్మమూర్తి. దానపరాయణుడు. అంతమంచి వాడు లేడు. ఎంత మంచి వాడంటే తన్ను అర్థింపవచ్చిన వామనుడికి తన సర్వస్వం అర్పించాడు. చాలక తన శిరస్సునే త్రివిక్రమునికి పాదాక్రాంతం చేశాడు. ఫలితం అందుకతనికి పాతాళవాసం. ఇదేనా న్యాయం? బాగుందా భగవంతుడు చేసిన పని.

ఇంకొక గొంతుక: ఇంద్రుడు దేవతల రాజు. దేవతలు చాలా మంచివాళ్ళు: కాని ఇంద్రుడుమాత్రం దుష్టుడు. అతని అసూయకు మితిలేదు. తన పదవిని నిలువుకోవడానికని అతడవలంబించని కుతంత్రం అంటూలేదు. అప్సరసలని పంపడానికి జంకడు. భగవంతుడి కాళ్ళు పట్టుకుంటాడు. ఇంద్రుడు భోగ లాలసుడు. మునిపత్ని అహల్యను చెరచడానికి సంకోచించనివాడు. అతడు పాపాత్ముడు. అయినా అతడు స్వర్గానికి రాజు. ఇదెక్కడి న్యాయం? అదేనా భగవంతుని నీతి?

మొ. గొం: భగవంతుని న్యాయాన్ని ప్రశ్నించడానికి మనం ఎంతవాళ్ళం?

రెం. గొం: కాదు దీనికేదో కారణం ఉంటుంది.

మూ. గొం: నేనా కారణం చెప్పగలను. బలిచక్రవర్తి స్వయంగా మంచివాడే. కాని అతనిచుట్టూ పాపంవుంది. అతడెంత మంచివాడంటే తనచుట్టూవున్న రాక్షసత్వాన్ని కాదనలేడన్నంత మంచివాడు. శుక్రాచార్యుడతని గురువు. ఆయన ఎలాంటి పాపాన్నైనా హేతువాదాలతో సమర్థించగల చతురుడు. బలిచక్రవర్తి తానెంత మంచివాడైనా తనచుట్టూ పాపాన్ని పెరగనిస్తూన్న కారణంవల్ల అధోలోకంలో అతడు నివసించవలసి వచ్చింది, స్వంభావంవల్ల దేవేంద్రుడు చెడ్డవాడైనా తనచుట్టూ పుణ్యమే వుండేటట్టు అతడు జాగ్రత్త పడతాడు. బృహస్పతి అతని గురువు. దివ్యులందరూ అతని సన్నిహితులు. అందువల్లనే అతడు స్వర్గానికిరాజు.

ఒక. గొం: ఇంతకీ స్వర్గంపదో నరకంపదో ఎవరు నిర్ణయించగలరు?

రెం. గొం: బాగాఅన్నావు. ఒకస్థలమే ఒక కాలంలో స్వర్గంలా కనపడుతుంది. అదే యింకొక సమయంలో నరకమై పోతుంది.

ఒక. గొం: మంచిచెడ్డల తారతమ్యాన్ని మానవ మాత్రులెలా నిర్ణయించగలరు?

రెం. గొం: బాగాఅన్నావు. ఒకస్థలమే ఒక కాలంలో స్వర్గంలా కనపడుతుంది. అదే యింకొక సమయంలో నరకమై పోతుంది.

ఒక. గొం: మంచిచెడ్డల తారతమ్యాన్ని మానవ మాత్రులెలా నిర్ణయించగలరు? ఒకడికిమంచి యింకొకడికిచెడ్డ. ఒకడికి అమృతం యింకొకడికి విషం.

మూ. గొం: కాదు. ఉషస్సంధ్యలు రెండూ ఒకేలాగే వున్నా వెలుతురుకీ చీకటికీ భేదంవుంది. నరకంఅంటే అశాంతి. స్వర్గం అనగా ప్రశాంతి.

మొ. గొం: పాపంలోనే పుణ్యం వుంటుందనడానికి నిదర్శన, పాతాళలోకంలో బలిచక్రవర్తి వుండడమే.

మూ. గొం: ఇప్పుడుమనం పాతాళలోకానికేప్రయాణమై పోతున్నాం తమిస్ర ప్రపంచం.

చీ క టి లో క ం

ఈ సంగం ఒకరకం జంత్రివాద్యాల రోదనగానంతో ప్రారంభమౌతుంది. కనబడని గొంతు :

ఈ యింట్లో ఎవరూలేరా,
ఇదేమిటీ విచిత్రగానం?
ఇదేమిటీ తమస్సముద్రం
ఈ యింట్లో ఎవరూలేరా?
దీనిపేరు ఒంటరి తనం
ఇది మన రెండో నైజం
చంద్రుడులేని చీకటి వేళ
వెన్నెలక్కై వెదకకు నేస్తం.
చీపురు పుల్లల గుసగుసలు
చీమల ఏకాంతం
గడియారాల తిరుగుబాటు
కంకాళాళ గలగలలు.
మంటగంటల చప్పుడు

మస్తిష్కంలో నిప్పులు,
ఈ పాతాళలో కాంచలాల
ఏవో జీమూత మయూరాలు.
ఏవరయ్యా తలుపు తలుపు
పలకరేం పులకరేం ఎవరూ?
ఎవరూ ఈ యింట్లో లేరా?
ఈ యింటికి తలుపులు లేవా?
ఇవి మరణపు సరిహద్దులా,
జననపు పొలిమేరలా?
పాపపు పరిసరాలా,
పుణ్యపు పరిమళాలా?
ప్రకటన తమం హిమం స్రవిస్తున్నా యిక్కడ
దారిద్ర్యపు దండయాత్ర
భయానక నాటకాలు
తమంలాగ హిమంలాగ
ఆగ్రహాల విగ్రహాలు
అద్దంలో మన నీడలు
అనాకారంగా ఘోరంగా
ఆవిరులు కావిరులు
నరం నరం రాపాడి
జనం జనంతోపాడి
ప్రభంజనం గుంజనం
హిమం ద్రవం స్రవంతులు

కళ్లు లేళ్ళలా ఏడుస్తాయి, సందేహం
కాళ్ళనుంచి తలదాకా ప్రాకుతుంది
కరిగిపోతున్నాయి సరిహద్దురాళ్లు
కదులుతున్నాయి కాలపు కీళ్ళు
ఈ యింట్లో భయంవాసన
ఎటూ దారితెన్ను లేదు
ఇది రాక్షసపతి రాజధాని
బలిచక్రవర్తి నివాసభూమి.

ఒక. గొం: ఇది పాతాళమా? నరకమా? దీనికీ భూమికీ భేదమే లేదే.

రెం. గొం: ఏదో పెద్దప్రయాణం చేశామనుకున్నాం. ఎక్కడికీ కదలిసట్లే లేదే.

మూ. గొం: నడిచినా పరుగెత్తినా నౌకలో వెళ్ళినా ఎవరుమాత్రం ఎక్కడకు పోగలరు? ఎవ్వరూ తమ స్వభావాలనుంచి ఎడంగా పోలేరు.

మొ. గొం: ఎవరో యిటు వస్తున్నారు.

రెం. గొం: ఎవరయ్యానువ్వు.

ఆగం: నేనొక నిర్జీవిని. ఈ ప్రాంతాలలో విహరిస్తూ వుంటాను. ఎప్పుడూ నా స్వభావానికి వెలుపలనే తిరుగుతా

ఒక. గొం; ఇదేదో విచిత్రప్రదేశంలా వుందే. నిర్జీవీ, నీకు కాలక్షేపం ఎలాగ?

నిర్జీవి ఇది నా జన్మభూమి
ఇదే నా స్మశానం

మరణాన్ని పరుచుకొని
ఒంటరితనాన్ని కప్పుకొని
నిర్లిప్తతను ధరించి
నిస్పృహను వరించి
విరించిని జయించగల
విపంచి నినదించాను
ఇది నా ఇంకొక తనం
నా ఒంటరితనం
అసలేని ఆయాసలేని
విలాస నికేతనం
పురాతనం వినూతనం
ఇది నా జననధామి,
నా మరణ భూమి.
అగమ్యం నా గమ్యం
అమేయం నా ధ్యేయం
అనంతం నా ధ్వాంతం
అశాంతి నా శాంతి.
మీరు మానవలోక వాస్తవ్యుల్లా కన
మీకు బోధపడే భాషలో మాట్లాడుతాను, విన
పాలుతప్ప మరేదీ తాగకుండా
అప్పుడప్పుడు ఉపవాసాలుంటూ
నిజంకనబడితే జడుసుకొని
నీడల్లా బతుకుతారేం?
ఏమిటి సాధించాలని

ఇంత తాపత్రియం మీకు?
ఎప్పుడూ ఏదో పనివున్నట్లు
ఎందుకు తిరుగుతారు మీరు?
ఎవరేం చెప్పినా నమ్ముతారు
చుక్కలలో పేక ముక్కలలో
అరచేతుల గీతలలో
భవిష్యత్తును పఠించబోతారు
ఉప్పెనగా ఉపద్రవం
ఒక్కపెట్టున ముంచెత్తినప్పుడు
దారి తెలియక పరుగెత్తుతారు
దారికడ్డుగా దాగుంటారు
నమ్మకాలను కౌగలించుకొని
అపనమ్మకాను నమ్ముకొని

ఎవరెలా తిప్పితే అలా అలా గిరగిరా, గిరగిరా
తిరిగి తిరిగి తుదకు సొమ్మసిల్లి పడిపోతారు
కళ్ళకి గంతలూ వెదళ్ళకు దళ్ళా కట్టుకుని
కనబడలేదంటారు బోధపడదంటారు

విప్పండి మీ వికారపు వేషం
విశ్వసించండి వివేకాన్ని
సౌందర్యం కావలా మీకు,

స్వాతంత్ర్యమా మీరు కోరేది?
స్వాతంత్ర్యం సాధించాలంటే ఏదీ తెలివి,
సౌందర్యాన్ని సందర్శించే కన్నేదీ?

మీ నాగరికత కొలతలు నా కెరుక
మీ రోగాలకు మందివ్వగలను
కానీ మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి,
స్వ స్వరూప జ్ఞానం కావాలి.
మొ. గొం ఈ వేదాంతం వినడానికా
ఇక్కడకు మేము వస్త?
చవట చవక పత్రికా సంపాదకీయపు
చాదస్తపు ధోరణి చాలించుకాస్త
నిర్జీవి నరలోకపు మర్యాదలను
తిరస్కరిస్తున్నావు నీవు
అరవకు అరవకు ఇక్కడ అరిస్తే
మరణం మేలుకుంటుంది
మౌనం ఒక మహా యోగానం
జననం అది భవిష్యస్మరణం
నరకం గురించి మీకుగల
దురభిప్రాయాలు తొలగించుకొండి
ఇక్కడ చిత్రవధలు లేవు
వేడినూనె నూతులు లేవు
వాడిగోళ్ళ పిట్టలు లేవు
రంపాలు లేవు. భూకంపాలు లేవు
పాపాన్ని పశ్చాత్తాపంలోముంచి
పంపించేస్తాం వెంటనే
ఇక్కడ శాశ్వతంగా వసించాలంటే
ఎన్నో అర్హతలు కావాలి

ఉద్యోగం కావాలంటేనే
యోగ్యతా పత్రాలు తేవాలే
నరకంలో చిరనివాసం
పరమ కష్టసాధ్యమని నమ్మండి.
ఇందుకు నేనే ఒక ఉదాహరణ
క్రిక్కిరిసిన దట్టపు తమస్సు
లో నేను చేసిన రాక్షస తపస్సు
నా జనన మరణ చంక్రమణాల సమీకరణ

కిం. గొం అంధకారలోకంలో కూడా నీకు
అహంకారం కరిగిపోలేదు
అయినా వింటాం చెప్పు
ఏమిటో నీ వేదన, నీ రోదన?

నిర్జీవి మీలాగే నేనూ
భూలోకంలోనే
మానవుడై చాలా
కాలం గడిపాను.
మీలాగే నేనూ
విశ్రాంతులలోనూ
విక్రీడించాను.
మీలాగే నేనూ
తారుణ్యంలోనూ
కారుణ్యంతోనూ
ఆక్రందించాను.
ఈ నాటికి నేను

పేరాసల జీను
వేరే విసిరేను
ఈ రాత్రికి నేను
సారథినై నాను.
సముద్రంఅంత హృదయంనాది ఆకాశమంత నేత్రం
మహానదుల రక్తనాళాలు మహీధరాలకిరీటం నాది
ఎడారులలో నా ఉద్రేకం ఇంకిపోనిచ్చాను
నా నేస్తాలు జలపాతాలు, ఝంఝానిలాలు
రావి చెట్టుక్రింద స్వతంత్రంగా
రాజ్యం చెయ్యడం నేర్చాను,
ఒంటి కాలిమీద నిలబడి
ఊర్ధ్వదృష్టి సారించాను
నా అంత మంచివాడు లేడన్నారంతా,
పత్రికలు నా పాపాలు ప్రకటించాయి,
మంచి చెడ్డల కల్తీతంగా నా
మనస్సును పదిలపరిచాను.
ఏపనీ చెయ్యకపోవడం అనే
ఎంతో కష్టకిష్ట కార్యం సాధించాను
ఎప్పుడూ ఇప్పుడులోకదుల్తాను
ఎక్కడా ఇక్కడగా చరిస్తాను
సముద్రాల రహస్యాలు గ్రహించాను
తమిస్రాల కవిత్వాలు పఠించాను,
అసత్యాల అనిత్యాన్ని జయించాను

గురుత్వాల లఘుత్వాన్ని గుణించాను
ఖరీదైన గ్రాండ్ హోటల్
కారు చీకటి సినిమా హాల్
రోగాల దేవాలయం హాస్పిటాల్
ఆకాశాన్ని చీల్చుకుపోయే రాకెట్
ఆద్యంతాల నిముడ్చుకొనే బ్రాకెట్
అన్నీ ఈ రసాతలానికి సంకేతాలు
అన్నింట్లో నిరాఘాటంగా నా సంచారాలు
మొ. గొం నిర్జీవితో సంభాషణ
నిష్ప్రయోజనం
ఇతడేం మాట్లాడుతున్నాడో
ఇతనికే తెలియదు
రెం. గొం ఇతడిచ్చిన జాబితాకి
ఇంకొకటి కూడా కలిపితే సరి
మొ. గొం ఏముంది, పిచ్చాసుపత్రి.
నిర్జీవి నిజం చెప్పినందుకు నేస్తం
నిన్నభినందించక తప్పదు
ఉన్మాదం తురీయావస్థ
ఆరాజ్యం కూడా మాకుకప్పం కడుతుంది
రెం. గొం అయితే తమరెల్లప్పుడూ
అక్కడే ఉండి పోవడం మంచిది
మూ. గొం లేదు. ఈయన తత్వంలో ఏదో విశేషం ఉంది. నరకం మీద ఇతడు సాధికారంగా మాట్లాడుతున్నారు.

నిర్జీవి: కృతజ్ఞుణ్ణి ఇంకా నేనెన్నో నేర్చుకోవలసిన వున్నాయి. ఇక నేను మీకు కనబడను. అటు చూడండి ఆ తేజస్సును. అతడే బలిచక్రవర్తి.

మొ. గొం: నిర్జీవి మాయమైపోయాడు.

రెం. గొం: బలిచక్రవర్తి ప్రసన్నరూపాన్ని చూడు. స్వర్గధామాన్ని పరిపాలించ వలసిన సౌమ్యత్వం ఆయనలో మూర్తీభవించింది, ఆయన సమీపిస్తూ ఉంటే శరీరం గగుర్పొడుస్తోంది. నమస్కరించాలని బుద్ధిపుడుతోంది.

బలిచ: వద్దు, వద్దు, నాకు నమస్కరించకండి. ఒకప్పుడు నేను సమస్త లోకాలనూ జయించాను. దేవేంద్రున్ని స్వర్గనుంచి తరిమివేశాను. ఐశ్వర్యాన్ని రుచిచూశాను. ఆనందాల లోతులు చూశాను. ఇప్పుడు నా కంతా సమానం. అందరినీ ఒక్కలాగే చూడగలుగు తున్నాను.

మొ. గొం: మీరు పరమ ధర్మస్వరూపులు. సర్వ సమానతత్వాన్ని సాధించారు. మీరెక్కడవుంటే అదేస్వర్గం.

బలి: లేదు. ఈ పాతాళలోకాన్ని నేను విడిచిపెట్ట లేను. పాపాత్ములను అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. పతితులను బోధపరచు కుంటున్నాను.

రెం గొం: ఆశ్చర్యం. సమస్త లోకాలనూ జయించిన బలిచక్రవర్తి అధఃప్రపంచాల అంధకారానికి బలికావడం.

మూ గొం: ఆకథ వినాలని వుందా? అయితే కృత యుగంలోకి వెళ్ళాలి. ఫేడవుట్

## వామనమూర్త్యావిర్భావ ఘట్టం.

ప్రకటన రవిమధ్యాహ్నమునం జరింప, గ్రహతారాచంద్ర
భద్రస్థితిఁ
శ్రవణద్వాదశినాడు శ్రోణనభిజిత్సంజ్ఞాత లగ్నంబునన్
భువనాధీశుఁడు పుట్టె వామనగతిన్ బుణ్యవ్రతోపేతకున్
దివిజాధీశ్వరమాతకుం బరమపాతివ్రత్య విఖ్యాతకున్.
భిక్షా పాత్రిక నిచ్చెను
యపేశుడు వామనునకు నక్షయమనుచున్
సాక్షాత్కరించి పెట్టెను
భిక్షునకు భవాని పూర్ణభిక్షన్ ప్రీతిఁ.
ప్రక్షీణ దివిజ వల్లభ
రక్షాపగతంత్రుఁడగుచు రాజీవాక్షుం
డాక్షణమున బలియింటికి
భిక్షాగమనంబు సేసెఁ బేదఱికముతోఁ.
ఆమాయామాణవకుడు హయమేధ మఖాంతర్వేది
శావాటమున
దానవేంద్రునిగాంచి—కుశపవిత్రాంకిత సంయుతంబగు
దక్షిణ హస్తంబువాచి—
వామన స్వస్తి జగత్త్రయీభువన శాసనకర్తకు, హాసమాత్రవి
ధ్వస్త నిలింపభర్తకు,నుదారపద వ్యవహర్తకున్,మునీం
ద్రస్తుత మంగళాధ్వర విధానవిహర్తకు, నిర్జరీగళ
న్యస్త సువర్ణసూత్రపరిహర్తకు దానవలోకభర్తకుఁ.
బలి   వడుగా యెవ్వరివాడ వెవ్వడవు సంవాసస్థలం బెద్ది? నీ

వడుగంబో యెడిదేది? రత్నములో? మృష్టాన్నం
బులో? కన్యలో?

వామన ఓ నానామఖ వ్రతదాన ప్రవణాను వర్తీ, దానవ
చక్రవర్తీ.
ఇది నాకు నెలవని యేరీతి బలుకుదు నొకచో
టనక యెందునుండ నేర్తు
నెవ్వనివాడ నంచేమని పలుకుదు నాయంత
వాడనై నడవనేర్తు
నీ నడవడియని యెట్లు వక్కాణింతు బూని
ముప్పోకల బోవనేర్తు
నది నేర్తు నిది నేర్తు నని యేల చెప్పంగ నేరుపు
లన్నియు నేన నేర్తు
ఒంటివాడ నాకు నొకటి రెండడుగుల
మేరయిమ్ము సొమ్ము మేరయొల్లఁ
గోర్కిదీర బ్రహ్మకూకటి ముట్టెద
దాన కుతుకసాంద్ర దానవేంద్ర.
నీవు రాజవనుచు నిఖలంబు నడుగుట
దగవు కాదునాకుఁ దగిన కొలఁది
యేను వేఁడికొనిన యీ పదత్రయమును
జాలదనక యిమ్ము చాలుఁ జాలు

శుక్ర ఓహో, మోసము, మోసము
దనుజేంద్ర, యీతఁ ధరణీ సురుడుగాడు
హరి విష్ణుఁడవ్య యుండదితి సూతి

నీ లక్ష్మి దేశంబు నెలవు నైశ్వర్యంబు
వంచించి యిచ్చు దా వాసవునకు
ఏ దానమున నాశమే తెంచు నదియును
దానంబు గాదండ్రు తత్త్వ విదులు
అంగీకరించిన నఖిలంబు బోవుచో
ననృతంబుగాదు లేదనిన యెడల

మరియు నిందొక్క విశేషంబు గలదు, వివరించెద
వారి జాతులందు వైవాహికములందు
బ్రాణ విత్తమాన భంగమందుఁ
జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము బొందవధిప

బలి సునిశిత ధిపగాధుర్యా, శుక్రాచార్యా,
నిజమానతిచ్చితి నీవు మహాత్మక
మహిని గృహస్థ ధర్మంబు నిదియ
యర్థంబు, గామంబు యశమును వృత్తియు
నెయ్యది ప్రార్థింప నిత్తుననియు
నర్థలోభంబున నర్థిఁబొమ్మను టెట్లు
పలికి లేదనుకంటె బాపమెద్ది?
యెట్టి దుష్కర్ముని నే భరించెదగాని
సత్యహీనుని మోవజాల ననుచు
బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ
సమరమున నుండి తిరుగక చచ్చుకంటెఁ
బలికి బొంకక నిజమునఁ బరఁగుకంటె

మానధనులకు భద్రంబు మఱియు గలదె?
కారేరాజులు, రాజ్యముల్ గలుగవే.
గర్వోన్నతిఁ బొందరే?
వారేరీ? సిరిమూట గట్టుకొని పో
వంజాలిరే? భూమిపై
పేరైనం గలదే? శిబిప్రముఖులుం
బ్రీతిఁ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మరచిరే
యిక్కాలమున్ భార్గవా.
నిరయంబైన, నిబద్ధమైన, ధరణీ
నిర్మూలనంబైన, దు
ర్మరణంబైన గులాంతమైన నిజమున్
రానిమ్ము కానిమ్ము పో
హరుఁడైనన్, హరియైన నీరజభవుం
డభ్యాగతుండైన నేఁ
దిరుగన్ నేరదు నాదు జిహ్వ వినుమా
ధీవర్య, వేయేటికిన్.

వింధ్యావళి — బలిచక్రవర్తి భార్య —
వటుని కాళ్లు గడుగుటకు ఇదిగో హేమఘటమున సలిలములు.

ప్రకటన అంతట బలిచక్రవర్తి ధరణీసుర దక్షిణ చరణ ప్రక్షాళనంబు సేసి, వామ పాదంబు గడిగి తత్పావనజలంబు శిరంబునం జల్లుకొని, వార్చి, దేశ కాలాది పరిగణనంబు సేసి —

విప్రియ ప్రకటివ్రతాయ భవతే విష్ణుస్వరూ
పాయ వేదప్రామాణ్య విదే త్రిపాద ధరణీ దానస్వా
మియంచుం గ్రియా క్షిప్రుండై దనుజేశ్వరుండు
వడుగుం జేసాచి పూజించి బ్రహ్మ ప్రీతమ్మని
ధారపోసె భువనం బాశ్చర్యముంబొందగన్.

తత్కాలంబున

నీరధార బడగనీక యడ్డంబుగా
గలశరంధ్ర మాపగాను దెలిసి
హరియుఁ గావ్య నేత్రమునుఁ గుశాగ్రంబున
నడున నేక నేత్రుడయ్యె నతడు
తదనంతరంబున
మునిజననియ మాధారను
జనితా సురయువతి నేత్రజల కణధారన్
దనుజేంద్ర నిరాధారను
వనజాక్షుడు గొనియె బలివివర్జిత ధారన్
ఇట్లు ధారాపరిగ్రహంబు సేసి —
ఇంతింతై వటుడింతయై మరియు దానింతై
నభోవీధిపై
నంతై తోయజ మండలాగ్రమున కల్లంతై
ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై
మహార్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత
సంవర్ధియై

రవిబింబం బుపమింపఁ బాత్రమగు ఛత్రంబై
శిరోరత్నమై
శ్రవణాలంకృతమై కళాభరణమై సౌవర్ణ
కేయూరమై
భవిమత్కంకణమై కటిస్థలి సుదంచద్ఘంటయై
నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుడు దా బ్రహ్మాండమున్
నిండు-చోన్.

ఒక పదమ్ము క్రింద నుర్విపద్మమునంది
కొన్న పంకలవము కొమరుదాల్చె
ఒకరి మీద తమ్మి కొదిఁగిన తేఁటి నా
వెలసె నాకసము త్రివిక్రమమున.

పాదద్వయంబున ప్రపంచములెల్ల సమాక్రమించి త్రివిక్రముండు మూడవ యడుగును వైరోచని శిరస్సుపై నిలిపి యతని నథః పాతాళమున కణంచివైచె నిది యిందలి పూర్వగాథ.

స్వర్గలోకం.

ఆహ్లాదకరమైన జంత్రవాద్యాల సంగీతంతో ఈ రంగం ప్రారంభ మవుతుంది —

ఉపనిషద్వాచకం.
సహనావవతు
సహనౌభునక్తు

సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు
మా విద్విషావహై
సితసునిశిత కాంతులతో
ద్యుతల మతుల కాంతిమయం
వాడని పూవులలో
వీడని తావులతో
అనంతమౌ వసంతమై
వినూత్నమై పవిత్రమై
సునిశిత సితకాంతులతో
సుఖశిఖరపు శోభలతో
అజ్ఞానం తరిమికొట్టి
విజ్ఞానం పంచిపెట్టి
వీరకథలు వర్ణించి
ప్రేమసుధలు వర్షించి
ద్యుతల మతుల దీప్తిమయం
త్రిదివముదిత శుభాహ్వయం.
అప్సరాంగనల నాట్యం.

దేవేం అదుగో, ఆ అప్సరఃకన్యక అమోఘంగా నాట్యం చేసింది. ఎవరా అపూర్వలావణ్యావతి?

దేవమం ఆమె యింకా అర్భకురాలు ప్రభూ. దేవేంద్రుల వారేమో నేడు కనుగందని పసికొందుల నాశిస్తున్నారు.

దేవేం మంత్రీ, ఆ బాలిక మనమదాలస కూతురు. నేనెరుగుదును. వెంటనే ఆమెను నా సమక్షంలో నిలబెట్టు.

అప్స ప్రభువులకు ప్రణామం.

దేవేం నీ యౌవనం సాఫల్యమొందునుగాక. అద్భుతంగా నాట్యం చేశావు అమ్మాయీ.

అప్సర ప్రభువుల అనుగ్రహం.

దేవేం మాకు పరమానందమయింది. నీ పేరేమిటి అమ్మాయీ.

అప్సర నాపేరా? నాపేరు_

దేవేం సిగ్గుపడకు మరి. చెప్పవూ నీపేరు?

అప్స జలాంతశ్చ్ంద్రచపల.

దేవేం జలాంతశ్చ్ంద్ర చపల. ఎంత బాగుంది పేరు అయితే ఇంత చిన్నపిల్లకి అంతపెద్ద పేరెందుకూ? చపలా అని పిలవనా?

అప్స ఏమో, ప్రభువులఇష్టం.

దేవేం పోనీలే. పూర్తిపేరుతోనే పిలుస్తాను. జలాంతశ్చ్ంద్ర చపలా. చక్కనిపాట ఒకటి పాడవూ?

అప్సర పాడుతుంది.

ధీరసమీరే యమునాతీరే
వసతివనే వనమాలీ
గోపీపీన పయోధర మర్దన
చంచల కరయుగశాలీ.

మంత్రి — దేవగురువులెందుకో తొందరగా విచ్చేస్తున్నారు. ప్రభూ.

దేవేం — మంత్రీ, నీవు వారిని ఆలోచనా మందిరంలోకి తీసుకువెళ్ళు. మేము మొదట నందనవనానికి. తర్వాత శయ్యామందిరానికి రా అమ్మాయీ.

మొగోం — ఇంద్రభోగం అంటే అది.

రెంగోం — ఇదేనా స్వర్గం? ఇంతకంటె పాతాళలోకమే బాగుండే.

చిరం — ఇంద్రుని చర్యలతో మీ
రెందుకు కొలుస్తారు స్వర్గాన్ని?

మొగోం — ఎవరు బాబూ మీరు?
ఇక్కడ ప్రత్యక్ష మయారు?

చిరం — నన్ను చిరంజీవి అంటారు
ఎప్పుడూ ఇప్పుడులో ఉంటాను
ఎక్కడా ఇక్కడగా ...

మొగోం — ఇదివరకీయన్ని చూశాంకాదూ?

చిరం — ఔను. నరకంలో నేను నిర్జీవిని. స్వర్గంలో చిరంజీవిని.

మొగోం — ఔరా, ఏమాశ్చర్యం?

చిర — ఓరి వెర్రిమానవులారా, మీది తెలిసీ తెలియని గొడవ.

జీవించాలి నిరాఘాటంగా

జీవించాలి సునాయాసంగా
సత్యానికీ అసత్యానికీ
సమానదూరంగా
జీవించాలి అమోఘంగా
సేవించాలి ద్రాక్షాసవం
సాధించాలి అజరామరత్వం
శోధించాలి విశుద్ధతత్వం
పరిపాలించాలి మన్మధ సామ్రాజ్యం
ప్రతిభాసించాలి ప్రచండ వైరాగ్యం
జీవించాలి తృణప్రాయంగా
ఘుణాక్షరన్యాయంగా
కాకతాళీయంగా
జీవించాలి ఆకస్మికంగా
జీవించాలి ఏకస్మితంగా

మొ. గొం చిరంజీవి చాలా హుషారుగా ఉన్నాడు,

రెం. గొం: మరి ఇదిస్వర్గం కాదూ.

చిరం నేనొక బికారిని
భిక్షుకుణ్ని
తెరవెరుగని తెరువరిని
నేనేమీకాను.
నిరాధారుణ్ని
నిరాకారుణ్ని
నాజోలిలో జాలి నింపండి
మీకు పురుగులెంత లోకువో

పురుగులకంత లోకువనేను అన్నిటికీ తెగించాను
నన్నుచూచి నవ్వకండి నామీద రాళ్ళురువ్వకండి

మొ. గొం: ధోరణి మారిందేం?

చిరం: బలిచక్రవర్తి వచ్చినట్లు పసిగట్టు తున్నాను. అంచేత, నా గానంలో విషాదం ప్రవేశించింది.

రెం. గొం: బలిచక్రవర్తి స్వర్గలోకాని కెందుకు వస్తాడు?

చిరం: రాదలచుకుంటే అతణ్ని ఎవ్వరూ అడ్డలేరు. పాతాళలోకపు పాపాత్ములను, పతితాత్ములను అనాథజీవులను, అశాంత భావులను వదలిపెట్టి అతడు రాడు, కాని ఏ కారణం వల్లనో ఇప్పుడు బలిచక్రవర్తి యిక్కడే వున్నాడని నేను చెప్పా కో గలుగు తున్నాను.

మొ. గొం: అడుగో బలిచక్రవర్తి.

రెం. గొం: అతని వెంట ఎవరో అమ్మాయి.

బలి: అవును. ఈపిల్లపేరు జలాంతశ్చంద్రచపల. ఈ పిల్ల ఏడుపు విని యిక్కడకు వచ్చాను. ఎవరేడ్చినా నేనుసహిం చలేను. నందనవనంలో నాకు కనబడింది. ఇంద్రుడీమెను చెర బట్టబోయాడు. నేనురాగానే పరుగెత్తి పోయాడు.

మొ. గొం: దయామయుడు బలిచక్రవర్తి.

రెం. గొం: ధర్మాత్ముడు బలిచక్రవర్తి.

బలి: ఇక నే నిక్కడ వుండనక్కరలేదు. యీమెను తీసుకొని పాతాళానికి పోతున్నాను.

చిరం: నాకు చిరంజీవిగాఉండాలనిలేదు. నేనూవస్తున్నా ను. జలాంతశ్చంద్రచపల కోసంనేనునిర్జీవినికాదలచుకున్నాను.